# రెండు తమిళ ఆణిముత్యాలు

## జయకాంతన్/ మహరిషి

# బ్రహ్మోపదేశం/ స్ఫటికం



అనువాదం : ఏండీ సుందరేశన్

# RENDU TAMILA ANIMUTHYALU

(Two Tamil Classics- by Jayakanthan/Maharishi)

తెనుగు అనువాదం© Kurinji Publications, California, US

First Edition, 2021

© D. Jayakanthan/Maharishi/Andy Sundaresan

The translator gratefully acknowledges with thanks the permission to use the cover illustration from ***Meenakshi Puttaga Nilayam***, Madurai -626 001, Tamilnadu, India

The translator gratefully acknowledges with thanks the permission to use Artist Gopulu's illustrations for Brahmmopadesam originally published in Ananda Vikatan.

***Cover Design:***

Amir Butt

**Printed at:**

The Copy World
2001 3rd Street,
San Francisco, CA 94107
Phone: 800.930.COPY

# జయకాంతన్/ మహాఋషి

# బ్రహ్మోపదేశం/ స్ఫటికం

## మూలం: తమిళం

## అనువాదం : ఏండీ సుందరేశన్

**Publisher**

**Kurinji Publications**

**10944 San Pablo Avenue # 610**

**El Cerrito, CA 94530-2377**

**Email: rangan.sundaresan@gmail.com**

# ఇందులో

అనువాదకుని ముందుమాట

జయకాంతస్ ముందుమాట

బ్రహ్మోపదేశం

స్పటికం

# రచయితలు

## జయకాంతన్

(1934-2015)

అరవైయేళ్ళ సాహిత్య ఉద్యమంలో 40 నవలలు, 200 కధానికలు, 400 వ్యాసాలు రాసారు. జ్ఞానపీఠం, సాహిత్య అకాడమీ, పద్మభూషన్ బిరుదులు అందుకున్నారు. సాహిత్యం అవతల తనే రెండు చలన చిత్రాలుతీసారు. ఇతని నాలుగు నవలలు చలనచిత్రాలుగా పేరు పొందాయి.

## మహరిషి

(1932-2019)

అసలు పేరు T.K. బాలసుబ్రమణ్యం. జన్మస్థలం తంజావూరు జిల్లాలో, సేలంలో స్థిరపడ్డారు. Tamil Nadu Electricity Board లో ఉద్యోగం చేసి, పదవి విరమణ తరువాత ***మహరిషి*** అనే కలంపేరుతో నూరుకుటపైగా కధలు, నవలలు, వ్యాసాలు రాసారు. ఇతని ఆరు నవలలు చలన చిత్రాలుగా పేరు పొందాయి.

## అనువాదకుడు

ఏండీ సుందరేశన్ ఇరవైఆరు సంవత్సరాలుగా తమిళ కధానికలు, నవలలు ఆంగ్ల, తెలుగు భాషలలో అనువాదం చేస్తున్నారు. 2013 లో ఇతను అనువదించిన నీల పద్మనాభన్ తమిళ నవలని Autumn Reveries అనే పేరుతో కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది. దానికి 2016 లో వల్లి చెన్నై దిశై ఎట్టుమ్ సంస్థ బిరుదు లభించింది.

# అనువాదకుని ముందుమాట

“బ్రహ్మ జ్ఞానవాంస్తు బ్రాహ్మణః” అని బ్రాహ్మణుడికి నిర్వచనం ఉంది. పుట్టుకతో అందరూ శూద్రులే ఐనప్పటికీ, తమ తమ విధి నిర్వహణ సంస్కారాలను బట్టి బ్రహ్మజ్ఞానం సంతరించుకున్న తదుపరి బ్రాహ్మణులుగా అవుతారని శంకరాచార్యులవారు వివరించారు.

బ్రాహ్మణుడుగా పుట్టడం గొప్పకాదు, బ్రాహ్మణుడుగా జీవించడం గొప్ప. సర్వ శాస్త్రాలు, సమస్త హైందవ ధర్మం ఈ విషయాన్ని నొక్కి చెప్పాయి.

ఈ కధల్లో వచ్చే శంకర శర్మ, యజ్ఞం, ఈ ధార్మిక లక్షణాలున్న, వేరే వేరే రచయతలు సృష్టించిన పాత్రలు.

జయకాంతన్ పాత్రలో తన కుల బ్రాహ్మణ ఔనత్యం కాపాడడానికి శర్మగారు ఒక ఉద్యమంకి నాయకులు. అతనిలో విప్లవాత్మక ఉంది. ఈ కలియుగంలో ఇతర బ్రాహ్మణుల ధోరణి చూస్తి అతనికి ఈసడింపు. ఆధునిక యుగంలో ఉదయించే కొత్త శక్తులతో అతను మూర్ఖంగా పోరాడుతున్నారు.

ఇది ఒక వివాదాస్పదమైన కధ. ఇది ‘ఆనంద వికటన్’ పత్రికలో ప్రచురమైనప్పుడు చాలామంది పాఠకులకి శర్మగారి సాహసం - నిర్లజ్జత - మింగుడు కాలేదు.

ఈ కధకి నేపద్యం ఉందని జయకాంతన్ ఒక వ్యాసంలో సూచించారు.

మహాకవి భారతియార్ (1882-1921) కనకలింగం ఒక హరిజన యువకుడుని బ్రాహ్మణుడుగా మార్చారని, తను ఆ కనకలింగంని కలుసుకున్నట్టు అతను రాసారు.

ఈ కథని 2010 లో జయకాంతన్ అనుమతితో నేను ఆంగ్లభాషలో అనువదించాను. ఇప్పుడు అతని కొమార్తె దీపలక్ష్మి సమ్మతంతో మీకు తెలుగులో అందజేస్తున్నాను.

'మహఋషి' పాత్ర యజ్ఞంకి ఎవరిమీదా తిరగబడే స్వభావం లేదు. తన స్వధర్మం కాపాడుకోవడం - అదే వాడికి ముఖ్యం. వాడిగురించి అన్ని కబుర్లూ ముసలమ్మే మనకి చెప్తోంది. కొన్నిచోట్ల భగవద్గీతలో శ్లోకాలు వల్లించి వాడెవడని మనకి గుర్తుచేస్తోంది.

స్పటికం కల్కి - మహాత్మా గాంధీ శతజయంతి (అక్టోబర్ 5, 1969) సంచికలో వెలుబడింది. మార్చ్ 2011 లో రచయత మహరిషితో నాకు పరిచయం కలిగిన తరువాత ఈ కథని అనువదించడానికి అతను అనుమతి ఇచ్చారు.

నా అనువాదం ఓపికతో చదివి, సలహాలిచ్చిన అక్కయ్య సెల్వీ విశ్వనాధన్ కి నా కృతజ్ఞతలు.

********

# బ్రహ్మోపదేశం

## జయకాంతన్ ముందుమాట[1]

***బ్రహ్మోపదేశం*** ప్రచురమైన తరువాత నా మిత్రులు, విమర్శకులు శ్రీ K.N. సుబ్రహ్మణ్యం[2] నాగురించి రాసిన వ్యాఖ్యానం నాకు జ్ఞాపకం వస్తోంది:

***"జయకాంతన్ రచనలు సామాజిక అభ్యుదయంకి దోహదం చేస్తాయని అందరూ అనడం మనకి తెలుసు. కాని అతని సాహిత్యంలో ముప్పాతిక కథలకి సామాజిక అభివృద్ధితో పొత్తు లేదని కనిపిస్తోంది."***

ఈ కథ చదివి నా మిత్రులలో కొంతమందరు "ఈ కథ  సామాజిక అభ్యుదయంకి ముందంజా, వెనుకంజా, లేక చమత్కారంగా రచయిత అందించే రాజీయా?" అని అనుమానించారు, లేక నన్ను నిందించారు.

అలాగే ఇంకొకతను - అతను నాకు మిత్రుడూ కాదు, విరోధీ కాదు, తన పేరు చెప్పడానికి అతనికి ఇష్టం లేదు! - ఒక పత్రికలో "ఇతనేం కమ్యూనిస్టు? బ్రాహ్మణమతం రక్షణార్థం కోసం  ఒక కథ రాసి అందులో వచ్చే ఒక యువకుడు ఒక సనాతన బ్రాహ్మణుడి వాదంముందు ప్రాకుతున్నట్టు రాసారే?"  అని చిరచిరలాడుతూ, రెండు చేతులు గాలిలో విసురుతూ నా కమ్యూనిస్టు నిజాయితిని కాపాడడానికో లేక ద్వంసం చెయ్యడానికో పూనుకున్నారు.

దీనికి కారణం వీళ్ళందరికీ వ్యక్తిగతంగా నా మీద ద్వేషం అని నేనన్నను.

కాని సామాజిక అభ్యుదయం అంటే ఏమిటని వీళ్ళు అపార్థం చేసుకొని, నామీద పైబడుతున్నారని నేను గ్రహించాను.

మరికొందరు నేనొక రాజకీయ పార్టీకి చెందిన ఈ నాటి తత్క్షణమైన ప్రశ్నలకి అనుసరించి రాయడమే 'సామాజిక అభ్యుదయం' అనే భావనతో ఆ పార్టీకి సంబంధం

---

[1] **రచయిత మే, 21, 1963 వ్రాసిన వ్యాసం సారాంశం**

[2] తమిళ రచయిత, విమర్శకులు, (1912-88)

లేని, ఆ పార్టీ ఆసక్తికి రాని, పార్టీ ఖరారుగా తీర్మానించక వదిలేసిన ప్రశ్నలకి పార్టీని జతకల్పుతున్నారు.

అందువలనే ఇటువంటి అభిప్రాయాలు చాలా బాధ్యతతో - ఈ విమర్శకులు - నాకు తెలియజేస్తున్నారు; ఈ విమర్శలగురించి నాకేం విచారం లేదు.

అసలు 'అభ్యుదయం' అంటే ఏమిటి? నా దృష్టిలో, అవగాహనలో, అభ్యుదయం అంటే ఏమిటని నేను ఈ కథలోని పాత్రలమూలంగా నా పాఠకులకి చెప్పదలచుకున్నాను.

పిలక పెట్టుకుంటే తిరోగమనం; కోవిలకి వెళ్తే తిరోగమనం; మన పురాణాలు, ధర్మశాస్త్రాలన్నీ చదివి మనం వెనుతిరుగుతున్నాం అనే భావన సమాజంలో బాగా వ్యాపించి ఉంది!

పేరు మార్చుకుంటే అభివృద్ధి., నాస్తికం మాటాడితే, అభివృద్ధి. బిరియాని భోజనం చేస్తే అభివృద్ధి. నిత్యమూ విదేశాల ఘనత గురించి మాటాడితే అభివృద్ధి. మనల్ని మనమే దూషించుకుంటూ, మన విగ్రహాలు పగులగొడితే ఆదే పురోగమనం అని కొందరికి గాఢ నమ్మకం ఉంది.

అసలు ఈ రెండు అవస్థల దృష్టిలో మాత్రం ఆరసించి 'ఇది పురోగమనం', 'ఇది తిరోగమనం,' అని జ్ఞానవంతులు దేన్నీ వర్గీకరించరు.

స్వార్థం నిరాకరించి, జన సమూహంలో ప్రత్యేకంగా ఏ గుంపూ, గుంపులమీద పగా, ద్వేషం లేకుండా, సర్వసాధారణంగా మానవోభ్యుదయంకీ, ఉన్నత ఆదర్శాలకీ పాటుపడడానికి తానొక ఉదార జీవి అనే ప్రజ్ఞతో మెలుగుతూ, అందుకు తన జీవితాన్ని పూర్తిగా అప్పగించినవాడు - అతనే ప్రజల మర్యాదకీ, ప్రతిష్టకీ, అర్హుడైన ఉత్తరోత్తర నాయకుడు!

అటువంటి దృష్టిలో చూస్తే మన ప్రాచీన ప్రఖ్యాతులు, భారత దేశం ఆత్మని నాశనం చేసేసి, నిరర్థక గుణాలు వల్లించుతూ, మాయలమారిగా, జాతులమధ్య ఘర్షణలు పురిగొలిపి, సమాజంలో సంచరించే పామర బ్రాహ్మణులమధ్య ఈ కథలో సంచరించే నా శంకర శర్మ ఒక గొప్ప విప్లవకారుడు!

నేను అనుసరించే నియమాలకి విరుద్ధంగా నా శర్మ ఒక శైలి పాటించవచ్చు. ఏ దృక్పథంతో నేనొక నియమం ఆదరించ పూనుకున్నానో, అదే దృక్పథంతో అతను భిన్నమైన ఒక నియమం ఆదరించుతే అతన్ని తప్పుపట్టడం న్యాయంకాదు; అందులో ఎటువంటి ఔదార్యమూ లేదు.

అతని బ్రాహ్మణ కులం తన సనాతన ధర్మం నిలబెట్టుకోవాలనే ఆకాంక్ష వలన అతను ఏ నాస్తిక బ్రాహ్మణ ద్వేషి కంటే ఇంకా తీవ్రంగా ఆ జనసమూహంతో జగడమాడుతున్నారు!

పురాతన ఘనతల పునరుద్ధరణకి ఒక ఉద్యమంలో నిరంతరంగా కృషి చెయ్యడానికి కావలసిన చిత్తశుద్ధితో శర్మగారి జీవితం సాగుతోంది. మేధావిగా మానవకోటికి ఆధ్యాత్మిక జ్ఞానం అందజేయాలనే సహానుభూతి అతనికి ఉంది.

అవును. అతను మన వేదాలని ఒక నూతన దృక్పథంలో ఆరసించి చూస్తున్నారు. మానవ జీవితం గురించి అతనికి కొన్ని దీర్ఘమైన అభిప్రాయాలున్నాయి. అతను ఆస్తికుడు, ఆత్మీకవాది. అందువలనే అతని సామాజిక స్పృహని అనుమానించకూడదని నిజమైన నాస్తికుడు, లోకాయతవాది, కమ్యూనిస్టు శేషాద్రి గ్రహించాడు.

అంతేకాదు. దుర్బలమైన ఒక ఉద్యమంకి దారి చూపే బలమైన శర్మగారు, తీవ్రంగా, మూర్ఖంగా  తనతో పోరాడుతున్నారని గ్రహించిన శేషాద్రి తన పక్షం వాదించి అతన్ని నిరాయుధపాణి చెయ్యకూడదని, ఉత్తికే నవ్వేసి తన చేష్ట మూలంగా అతన్ని తోసిపారేయడం మనం చూస్తున్నాం.

అలాగ చెయ్యకుండా “ఆస్తికులు, దైవభక్తి గల మానవ సమూహమే మీరు ఇవాళ శ్లాఘుంచే కళ. సంస్కృతిని పోషించాయి!” అని - అది శేషాద్రి కూడా ఏకీభవించదగిన ఒక పురాతన సత్యం - శర్మగారు గర్వంగా విర్రవీగడం చూసి, అది సహించక, మండిపడి “మీ ఆస్తికం ఈ ప్రపంచంని “ద్వంసం చేస్తుంది!” అని నాస్తికుల అంతరిక్ష ప్రయాణాలు, నూతనసంస్కృతిలో విజ్ఞాన విప్లవాలు గురించి జవాబు చెప్తే, శేషాద్రి పాత్ర బలహీనమైపోతుంది; పాత్ర చిత్రీకరణకి, నా కథ కూర్పుకి అది విరుద్ధం.


పైబడుతున్న ఆధునిక  భారతదేశ ఆత్మ, వైరాగ్యం, ధర్మావేశం, నిర్బంధం వలన పురాతన ఆచారాలు  ఎలా మారుతున్నాయని వివరించడానికి శర్మగారి పాత్ర ఒక ఉదాహరణ.

ఆధునిక యుగంలో క్రమేణ జయం పొందుతున్న నూతన శక్తికి ప్రతినిధులు శేషాద్రి వంటి యువకులు. ఆ శక్తి ఉత్తికే కేక వేయదు; అది ఆస్తికులతో ఇరుకుగా కలిసి బుద్ధి కుశలతతో పని చేస్తుంది. ఆస్తికుల సంరక్షణ అనే వంకలో మూర్ఖత్వనంతో, నాస్తికుల లాగే సామాజిక వ్యతిరేక చేష్టల మూలం మన భారత దేశ ప్రతిష్టకి హాని చెయ్యదు. మనకున్న ఘనతలని నీచం అని అవివేకంగా తోసిపారేయక, అన్యమోహం అనే బానిసత్వంకి బలి అవదు. పురాతన మహత్వం ఏమిటో అర్థం చేసుకొని, కొత్త గౌరవం, సిద్ధాంతం అలవరించుకుంటుంది. ఆ కొత్త సిద్ధాంతమే మాటెడు గుణమున్న విజ్ఞానం; దాని ప్రతినిధి శేషాద్రి.

ఇది బోధపడితే నేను నా దృఢవిశ్వాసంకి రాజీగా ఏదీ రాయలేదని ఆ విమర్శకులు నాతో ఏకీభవిస్తారని నా నమ్మకం.

********

# బ్రహ్మోపదేశం



# బ్రహ్మోపదేశం

శంకర శర్మ అని అంటే చెన్నపట్టంలో సామాన్యంగా చాలామందికి తెలియదు; మధ్యతర కుటుంబాలకీ అతనెవరో తెలియకపోవచ్చు. కాని సామాన్య ప్రజలకి పరిచయమైన మంత్రులు, న్యాయాధిపతులు, వర్తకులు, గుంపులు గుంపులుగా జనులు అభిమానించే సినిమా తారల్లాంటి ఉన్నత వర్గంలోని ప్రముఖలకి అతని గురించి బాగా తెలుసు.

కొందరికి అతని పేరు వినగానే అతని ఆకారం గుర్తుకు రాకపోయినా, ఇటీవల రాష్ట్ర గవర్నరు పాల్గొన్న విందులో వడ్డించిన - శర్మగారు కొత్తగా సృష్టించిన - ప్రత్యేక భోజన పదార్థం 'టోమేటో పాదుషా' - గుర్తుకి వస్తుంది; వెంటనే నాలికలో నీరు కారుతుంది.

అవును. దానికి పేరు టోమేటో పాదుషా. అది స్వచ్ఛంగా, ఎఱ్ఱగా, చూడడానికి అసలు నిండు సీమ తక్కాళిలాగే కనిపిస్తుంది. అందులో నెయ్యిలో వేయించిన బాదాం, జీరకం, పంచదార, కుంకుమ పువ్వు, మరి కొన్నివస్తువులు నింపబడి ఉంటాయి. ఆ పదార్థాల వివరాలు, ఆ భక్షణం చేసే విధం అతను చెప్తేనే బోధపడుతుంది. ఆ తరువాత ప్రతీ ఇంటి విందులోనూ అది తప్పకుండా సేవించడం అలవాటైపోతుంది. దాని ప్రసిద్ధి వ్యాపించుతున్న అదే సమయంలో శర్మ ఇంకొక స్వీట్ లేక కారం పరిచయం చేస్తారు; త్వరలో దానిగురించి అందరూ గొప్పగా చెప్పుకుంటారు. ఆ విధంగా ఉన్నత వర్గ ప్రజల మధ్య శంకర శర్మ పేరు మోసిన వంటగాడుగా మెలుగుతున్నారు. అందువలన అతను సంపాదించే దినభత్యమూ ఎక్కువే; తన సహకారులకు అతను ఇచ్చే జీతమూ ఎక్కువే. కాని అతను పని చేసే రోజులు తక్కువ. అందుకు కారణం అతనితో వ్యాపారం కోరేవారు స్వల్పమైనవారని మాత్రంకాదు. వాడుకైన ఉపయోక్తులతో అతనికి పొత్తులేదు. అతనొక అద్భుతమైన రసజ్ఞుడు.

శంకర శర్మ మన పురాతన వేదకాలంలో జీవించవలసిన బ్రాహ్మణోత్తములు. అతనికున్నశాస్త్రజ్ఞానం, బ్రహ్మజ్ఞాన మేధా విలాసం, ఈ కలియుగంలో అజ్ఞానమే ఏలుతున్న తమిళ దేశంలో, ఒక చిన్న పల్లెలోని అగ్రహారవాసులకి సరిపడలేదు.

సుమారు పదిహేడు సంవత్సరాలముందు తన భార్యని పోగొట్టుకున్న శర్మ భుజంలో తన రెండేళ్ళ కూతురు మైత్రేయిని ఎత్తుకొని, చెయిలో మడిసంచితో దేశాంతరం బయలుదేరారు.

లోకమంతా ఆవివేకం, అజ్ఞానం, నాస్తికం, ఆధీనంలో చిక్కుకొని ఉందని గ్రహించి శర్మ గింజుకున్నారు. లోకం, ప్రజల ధోరణి చూసి అతని మనసులో ఆసూయ, గర్వం చోటుచేసుకున్నాయి.

'ఇది కలియుగం. అది ముగిసి ఇక అధర్మం రాబోతుంది. కాని దుర్మాత్ములైన బ్రాహ్మణులు ఈ పాపంకి వశమైతే ఈ కలియుగం నశించిపోవడం ఎలాగ సాధ్యం? ఈ మానవజాతి జ్ఞానంకి బాధ్యతగల బ్రాహ్మణుడు మూర్ఖుడైపోతే, అది ఎంత శోచనీయం!   ఛీ, ఛీ, బ్రాహ్మణుడుకి మూర్ఖుడవడానికి హక్కు లేదు! అసలు వీళ్ళేం బ్రాహ్మణులు? పేరుకి మాత్రమే బ్రాహ్మణులు!  నడవడిలో, ధోరణిలో, ఎవరిలోనూ రవంతైనా బ్రహ్మ తేజస్సు కనిపించదే?' అని వాపోతూ శర్మ ఇతరులకంటే బ్రాహ్మణులపైనే ఎక్కువగా అసహ్యపడ్డారు, నిందించారు. కాని వాళ్ళమధ్యనే అతను జీవించవలసిన నిర్బంధం తప్పలేదు.

చెన్నపట్ణంలో. తిరువళ్ళిక్కేణి అనే పేటలో - గేదెలు, యెద్దులు, వాహనాలకి చొరవలేని ఒక యిరుకైన సందులో - అతను తన కూతురుతో బస చేస్తున్నారు. ఐతేనేం?

విధి, స్థితిగతులు అనుకూలంగా లేనప్పుడు, బలాత్కారంగా, జనులు కుళ్ళిపోయిన ఒక సమాజం విభాగంలో జీవించడం సహజం. కాని కొందరు వ్యక్తులు తమ తెలివితో, చిత్తశుద్ధితో, తమకు తామే అలవరించుకున్న సంస్కారాలవలన తమ చుట్టూ ఆత్మప్రభతో ఒక దడి కట్టుకొని ఆ వ్యక్తికతని రక్షించుకోడమూ మనం చూస్తాం. ఇంకా చెప్పాలంటే అదే - అలాగ జీవించవలసిన ఒక  నిర్బంధం, ఈ సమాజంకి, ఆ వ్యక్తులకి అవశ్యకమని మనం గ్రహించాలి. ఎందుకంటే ఒక మహా పురుషుడు తనచుట్టూ అమర్చుకున్న ఆ దడిలో తను వర్ధిల్లి, సాధించిన ఆ వ్యక్తికత అతని తరువాత సమాజంని ఏలుతుంది. సమాజంకి దూరంగా నిలబడి ఆ సమాజంని తీర్చిదిద్దేవారే మహనీయులు, జ్ఞానులు, మేధావులు.

ఆ నమ్మకం వలనే తనొక 'పవిత్రమైన బ్రాహ్మణుడు' అని గర్వపడినా, తను అభ్యసించిన శాస్త్రాలు, వేద జ్ఞానం తనలో అణచుకొని శర్మ 'నిండు కుండ తొణకదు' అనే సామెతకి తగిన విధంగా ఆ అశుద్ధాలమధ్యనే అగ్నిలాగ శర్మ జీవించారు.

చెన్నైలో అతనికి దొరికిన మొదటి, ఒంటరి మిత్రులు గుండురాయర్[1] దంపతులు. వాళ్ళ కఠిన పరిశ్రమ చూసిన తరువాత శర్మకి ఒక ఆలోచన తట్టింది. మౌలికంగా బ్రాహ్మణుడి మనుగడ జ్ఞానంపై ఆధారపడివుంటుంది. కాని, దానితోబాటు, ఏదైనా వృత్తి చెయ్యడం మంచిదని అతనికనిపించింది. పౌరోహిత్యం, వేద పారాయణం బదులు లౌకికంగా పనిచేసి జీవించాలని నిశ్చయించి అతను నాలుగు ఇనుము గరిటెలతో వంటవాడుగా సిద్ధమయ్యారు.

అయినప్పటికీ, అతను సకాలంలో సంధ్యావందనం చెయ్యడం, పితృకర్మలు నెరవేర్చడం, ఆత్మశుద్ధితో ఆచారాలన్నీ రూఢిగా పాటించడం - ఇవన్నీ అలవాటుగా చేస్తూ బ్రాహ్మణ కుల ధర్మంకి ప్రతినిధిగా మెలిగారు.

తన చుట్టూ జీవించే జంధ్యం ధరించిన బ్రాహ్మణులందరూ బ్రాహ్మణ కులధర్మం ఉల్లంఘించి కలియుగంలో అంధకారంలో చిక్కుకున్నారని అతను గూఢంగా నమ్మారు. తనదగ్గర పని చేసే సహకారులనుకూడా అతను బ్రాహ్మణులుగా అంగీకరించలేదు. వాళ్ళ అనాచార కార్యకలాపాలు, కోసిన జుత్తు అతను నిత్యమూ నిందించుతుంటారు. ఈ కారణం వలనే ఊరులో అందరూ పొగడే తన వంటని శర్మ ఇంతవరకూ రుచిచూడలేదు. ఎందుకంటే ఆ వంట అశుద్ధ బ్రాహ్మణుల చేతులతో చేసినది. అశుద్ధ బ్రాహ్మణులే దాన్ని భుజించనీ! ఇవన్నీ అతనికి చాలా పెద్ద విషయాలు.

అతనికి కుడి చెయ్యిలాగున్న గుండురాయరు శర్మ ఇంటి వెనుకతట్టులో తన భార్య గంగాబాయితో చాలా రోజులుగా బస ఉన్నారు. గుండురాయరు చాలా కాలం ఒక హోటల్లో పనిచేసి ఇటీవల ఆ పని వదిలేసి శర్మతో కలిసి పని చేస్తున్నారు. గుండురాయరు శర్మకంటే పది సంవత్సరాలే పెద్ద, కాని జుత్తు బాగా నెరసిపోయి అతనిలో ముసలితనం కనిపిస్తోంది. అతను ఏది ముట్టుకున్నా సరే, శర్మ దాన్ని

[1] తమిళనాడులో స్థిరపడిన కన్నడ, మాధ్వా బ్రాహ్మణుల పేరు.

ముట్టుకోరు. అలగేమైనా జరుగుతే స్నానం చేసే ఇంటిలోకి ప్రవేశిస్తారు. ఇవన్నీ చూసి గుండురాయర్ తనలో నవ్వుకుంటారు, కాని నోరెత్తి ఏమీ అనరు. అందుకు కారణం భయం మాత్రం కాదు. అతనికి శర్మగారి వేద శాస్త్రాల పాండిత్యం గురించి గౌరవం ఉంది.

## 2

అది పెళ్ళి ముహూర్తాల సమయం.

"స్వామీ, మీకు డబ్బు, ఆస్తి గురించి ఏ చింతా లేదు. అది నాకు తెలుసు, ఈ లోకంకి తెలుసు. కాని మీరేమో ఒంటరి మనిషి కాదు. మీరు పెద్దవారు, నేను బుద్ధి చెప్తున్నానని అపార్థం చేసుకోవద్దు. మైత్రేయి ఇంకా బాలిక కాదు. ఆమెకి ఒక శుభకార్యం జరగాలి. మీ మనసులో ఆమె మీదున్న ప్రేమానురాగాలు తప్పిస్తే మరేం సొత్తు లేదు. కాని లోకంకి అది చాలదు. ఆమె చెవిలో, ముక్కులో ఒక తిరుగుడుకూడా లేదని మా ఆవిడ నొచ్చుకుంటోంది. అందుకనే మీరు కొంచెం దయచేసి . . . " అని గుండురాయర్ జంకుతూ లౌకిక బాధ్యతలగురించి శర్మకి సూటిగా అతన్ని చూస్తూనే మనసు విప్పి మాటాడారు.

"అవునయ్యా, నాకు తెలుసు . . .  కాలం చెడిపోయింది, అందువలనే మనకీ కొన్ని ఇబ్బందులు . . . ఒక బ్రాహ్మణ యువతి పందొమ్మిది సంవత్సరాలవరకూ కన్యగా ఉండడం ఎంత అపచారం! 'రజస్వలకావటం ముందే తగిన వరుడు చూసి తన కూతురుకి పెళ్ళిచేయని తండ్రిని ఖండించాలి!' అని మను శాస్త్రంలో రాసివుంది. 'తగిన వరుడు' అని మను అన్నారు, అవునా? అదే నాకు ముఖ్యం. ఎనిమిది సంవత్సరాలుగా దానికి నేను వరుడు వెతుకుతున్నాను. ఏం లాభం?నా పూర్వీకులందరూ బ్రాహ్మణకుల ధర్మకి ఓజబంతిగా జీవించారు. మధ్యన మా నాన్నగారే తోవ తప్పారు. అతని తరువాత అతనికి బదులు ఆ పవిత్ర పతాకం నేను ఎత్తిపట్టుకున్నాను.  'నా తరువాత ఎవరు?' అని ఆలోచించినప్పుడు నాకొక కొడుకు పుడతాడనుకున్నాను . . . ఆ పుణ్యవతి నాకొక కూతురుని ఇచ్చి కన్ను మూసేసింది. నేనిప్పుడు ఒక అసలు బ్రాహ్మణుడుని వెతుకుతున్నాను.  వాడు ఉంఛవృత్తి చేసి బతికే బ్రాహ్మణుడైనా సరే, కాని బ్రహ్మజ్ఞానం, వేదాల్లో నమ్మకంతో ఈ లోకాన్ని పరిపాలించే అర్హత వాడికి ఉండాలి. ఈ జాతిభ్రష్ట బ్రాహ్మణుడెవరికీ నా

కూతురుని నేను ఇవ్వను! అది కన్యగానే ఉండనీ! కాని, నాకు తెలుసు, అటువంటి బ్రాహ్మణ యువకులు ఈ లోకంలో ఉన్నారు . . . వాళ్ళవలనే ఈ లోకం వర్ధిల్లుతోంది! . . . ” అని విచ్చలవిడిగా శర్మ చెప్తూపోతుంటే గుండురాయరు ఇక రాబోయే వ్యాపారంకి ఏర్పాట్లు శర్మకి వివరంగా చెప్పి అతని ఆమోదం అందుకున్నారు.

ఆ సంవత్సరం ఫాల్గుణంనుంచి బాద్రపదమాసం వరకూ ఎన్ని ముహూర్తాలున్నాయో, ఆ అన్ని దినాల్లోనూ ఏదో ఒక ఇంటిలో శర్మకి పని ఉంది.

ఈ అత్యవసర పరిస్థితిలోనే గుండురాయర్ శేషాద్రితో శర్మ దగ్గరకి వచ్చారు.

ఒక రోజు ఉదయం శర్మ వసారాలో కూర్చొని ఉన్నప్పుడు గుండురాయర్ శర్మతో “స్వామీ, నేను చెప్పిన శేషాద్రి వీడే. చాలా మంచి అబ్బాయి. వీడికి యూనియన్ తో పొత్తు ఉందని ఆ హోటల్ యజమాని వెళ్ళగొట్టాడు. అధవా, బాగా పని చేస్తాడు” అని శర్మకి పరిచయం చేసారు.

“నమస్కారం” అని శేషాద్రి చేతులు జోడించాడు.

శర్మ అతన్ని తేరిపార చూసారు. ఎత్తైన మనిషి కాకపోయినా గుండురాయరు పక్కన నిలబడడం వలన శేషాద్రి పొటుగాటిగానే కనిపించాడు. ముఖఛాయ నలుపూ కాదు, ఎరుపూ కాదు. కోసిన జుత్తుతోనే, తెల్ల షర్టు, పంచెతో కనిపించాడు. నెత్తి ఖాళీగా ఉంది. దీర్ఘమైన ముక్కు కింద నూనూగు మీసం శర్మ గమనించారు.

నోటిలోని పొగాకుని వీధిలో ఉమ్మేసిన తరువాత గుండురాయరు “నాకు వీడి నాన్నగారు బాగా తెలుసు. చాలా మంచివారు. కిందటి సంవత్సరం కన్నుమూసారు” అని అన్నారు. శర్మ అతన్ని తిరిగికూడా చూడలేదు. శర్మ దృష్టి అంతా శేషాద్రిమీదే ఉంది. గభీమని అతను వాడిని అడిగారు.


“బ్రాహ్మణుడు అంటున్నాం, నీ నెత్తిలో విభూతికూడా లేదే?”

“నాకు అందులో నమ్మకం లేదు.”

“ఎందులో? నువ్వు బ్రాహ్మణుడనా?”

శేషాద్రి బవాబు చెప్పాడు:

“బ్రాహ్మణుడంటే విభూతి తప్పకుండా ఉండాలా?”



“ఓ, అలాగా?” అని అడుగుతూ శర్మ తన గడ్డం తడుముకుంటూ ఆకాశాన్ని చూసారు.

ఇది చూసి గుండురాయరు నిర్ఘాంతపోయారు. ‘ఇదేంటి, వీడు పనికోసం వచ్చి శర్మతో వాదం చేస్తున్నాడు?’ అని ఆయాసపడుతూ అతను మౌనంగా కూర్చున్నారు.

“అదేం పుస్తకం?” అని శేషాద్రి దగ్గర ఉన్న పుస్తకం చూసి శర్మ చెయి చాపారు. శేషాద్రి మౌనంగా దాన్ని అతనికి అందించాడు. అది చూసి, నాలుగైదు పేజీలు తిరగేసిన శర్మ దాన్ని పూర్తిగా చదవాలని పూనుకున్నారు. గుండురాయరు, శేషాద్రి శర్మ ఎదుట మౌనంగా కూర్చొనివున్నారు. ఐదు నిమిషాలు, పది నిమిషాలయ్యాయి. శర్మ కాలుమీద కాలు వేసుకొని, తలెత్తి, మధ్య మధ్య తను చదువుతున్న విషయంకి వ్యతిరేకంగా జవాబు ఆలోచించడంవలన అతని మొహంలో విసుగు, అలక్ష్యం చోటుచేసుకున్నాయి. అతనింకా చదువుతూనే ఉన్నారు.

గుండురాయరు తాంబూలం వేసుకున్నారు. సావధానంగా చెయిలోని సున్నంని గోడమీద రుద్ది, పొట్లం విప్పి, అందులోనుంచి కొంచెం పొగాకు తీసుకొని, అరచెయిలో నలగగొట్టుతూ పుస్తకాన్ని ఆతురతతో చదువుతున్న శర్మని వినోదంగా చూసారు. ఈ వైదిక బ్రాహ్మణుడు ఇంత ఓపికగా పుస్తకం చదవడం చూసి శేషాద్రికి ముందు ఆశ్చర్యమూ, తరువాత శర్మమీద గౌరవమూ చోటుచేసుకున్నాయి.

గభీమని ఇంటిలోనుంచి రాయరు భార్య గంగాబాయి కన్నడంలో ఏదో అంటూ భర్తని పిలవగానే అతను చెయిలోని పొగాకు నోటిలో వేసుకొని శేషాద్రితో “ఉండు, నేను ఒక నిమిషంలో వచ్చేస్తాను!” అని లోపలికి పరుగెత్తారు.

ఇంటిలో వంటగదిలో ఇంతసేపూ ఉన్న శర్మ కూతురు మైత్రేయి తన పనులు పూర్తిచేసుకొని నాన్నగారిని పిలవడానికి వచ్చినప్పుడు అతను కనిపించలేదని, అతను వసారాలో ఉన్నారని గది కిటికీ ద్వారా తొంగిచూసింది. శర్మ వీపు వెనుక ఉన్న కిటికీనుంచి ఆమె చూసినప్పుడు, పుస్తకంలో లీనమైపోయిన శర్మ ఎదుట కూర్చున్న శేషాద్రి అకస్మాత్తుగా తలెత్తి చూసాడు. మసి కప్పుకున్న కిటికీ

నేపథ్యంలో కాంతితో ప్రకాశించే ఆ సౌందర్య ముఖం - కలలు పలించినట్టు తన కన్నులు ఒక అన్య యువకుడిని చూసిన నివ్వెరపాటులో, అతన్ని సూటిగా చూసి, సిగ్గుతో 'నాన్నగారూ!' అని పిలవలేక, భయంతో ఆమె తన గోరింట చేతులుతో పెదిమలు కప్పుకున్నప్పుడు - చూసి మురిసిపోయినప్పుడు శర్మ తన దృష్టి పుస్తకంనుంచి మళ్ళించారు. "ఈ పుస్తకం మన భారతదేశ ఘనతని పరీక్ష చేస్తోంది, కాని దాని విమర్శన ఒక నాస్తిక ధోరణిలో ఉంది . . . నేనింకా పూర్తిగా చదవలేదు . . . చదివినంతనరకూ నాకు ఆ జాడే కనిపిస్తోంది . . . " అని అతను గభీమని తనతో మాటాడగానే శేషాద్రికి మొహంలో చెమట పట్టేసింది.

"అవును. ఇందులో నాస్తిక వాదం ఉండవచ్చు. అది రాసినతను కమ్యూనిస్టు పార్టీకి చెందినవారు" అని శేషాద్రి అన్నాడు.

"నువ్వూ ఆ పార్టీలో ఉన్నావా?" అని శర్మ నవ్వుతూ అడిగారు.

శేషాద్రి కొన్ని క్షణాలు ఏమీ అనక ఆలోచించాడు.

"నేను మాటవాసికి అడిగాను, అంతే. గుండురాయరు సిఫారసు చేస్తే నేను మరేం అడ్డు చెప్పను. నీ ఉద్యోగం ఖాయం!" అని ఇంకా బాగా నవ్వుతూ శర్మ హామీ ఇచ్చారు.

శర్మగారి చూపు వాడికి ఇబ్బందిగా ఉంది. తనొక కమ్యూనిస్టు అని చెప్పడానికి సిగ్గు పడుతున్నట్టు తల వొంచి, పెదిమలు కఱచుతున్న శేషాద్రి తలెత్తి "అవును. నాకూ ఆ పార్టీతో పొత్తు ఉంది" అన్నాడు.

"కమ్యూనిస్టులు నాస్తికులు కదూ?"

"అవును. నేనూ నాస్తికుడునే" అని శేషాద్రి అనగానే శర్మ తన గడ్డం తడుముకుంటూ నవ్వుకున్నారు. ఆ నవ్వు ముగింపులో అతను అన్నారు:

"అదే ఉత్తమం. తనొక బ్రాహ్మణుడని చెప్పుకుంటూ బ్రాహ్మణ కులధర్మంకి వ్యతిరేకంగా అన్ని పనులు చెయ్యడం కంటే నాస్తికుడుగా ఉంటే మంచిదేకదా?"

"ఏం, బ్రాహ్మణుడు నాస్తికుడుగా ఉండకూడదా?"

కనురెప్పలు ఎత్తి, పెదిమలు కూర్చి, ముంజెయితో గడ్డం తడుముకుంటూ, శర్మ మాటాడారు.

"నాస్తికుడైనా  బ్రాహ్మణులని చెప్పుకొనేవారికంటే నువ్వు రెండు ఆకులు ఎక్కువ చదివినట్టనిపిస్తోంది. నీ ప్రశ్నకి ఒక వాక్యంలో జవాబు చెప్పాలంటే, బ్రాహ్మణుడు నాస్తికుడుగా ఉండడం అసాధ్యం! నాస్తికుడంటే బ్రహ్మం, పితృకర్మలు, సంస్కారాలు నిరాకరించేవాడు. ఒక బ్రాహ్మణుడుకీ, బ్రాహ్మణ స్త్రీకి కొడుకుగా పుట్టిన ఒకే కారణం వలన ఎవడూ బ్రాహ్మణుడు కాదు. బ్రాహ్మణుడుకి ఒక జన్మలో రెండు పుట్టుకలు. పుట్టినప్పుడు అందరు మనుషులలాగ వాడూ ఒక జంతువుగానే పుట్టాడు. ఆ తరువాత వాడు తన గుణాల వలన, బాధ్యతలు నెరవేర్చడం వలన మానవుడవుతాడు. అలాగ జాతిలేని మానవుడు తన తండ్రి యజ్ఞోపధారణం చేసిన తరువాత బ్రాహ్మణుడవుతాడు. తనకి ఉపదేశించిన మంత్రాన్ని వాడెలా ఎడతెగకుండా అభ్యసించి తన బాధ్యతలని నెరవేర్చి, తన జ్ఞానం వృద్ధి చేసుకొని, జన సమూహంకి బోధన చేసాడనే ఆధారం వలనే ఆఖరివరకూ వాడికి బ్రాహ్మణుడనే అర్హత ఉంది. అందుకు నీ నాస్తికవాదం సరిపడదు.

అలాగని నేను నాస్తికులని నిందుంచుకున్నానని అపార్ధం చేసుకోవద్దు. హిందూమతంలో నాస్తిక మహనీయులున్నారు. కాని వాళ్ళని నేను బ్రాహ్మణులని అనను. నువ్వేమో నాస్తికుడని చెప్పుకొని ఉదర నిమిత్తంకోసం జంధ్యం వేసుకోని బ్రాహ్మణుల ఇళ్ళలో పని చేసినా నా దగ్గర మాత్రం దయచేసి నీకు బ్రాహ్మణుడనే అర్హత ఉందని అనవద్దు! ఈ లోకం నిన్ను అంగీకరించినా నా ఆత్మ ఎన్నటికీ ఒప్పుకోదు!" అని శర్మ అన్నారు.

గదిలోనుంచి కిటికీ వెనుక నిలబడి శేషాద్రిని చూస్తూ మైత్రేయి తన తండ్రి మాటలు వింటోంది.

"మీరు పెద్దవారు. నేను ఇంతగా మీతో వాదించడానికి క్షమించాలి. నా అభిప్రాయం ఏమిటని నేను చెప్తే మీరు అపార్థం చేసుకోరుకదా?" అని శేషాద్రి భవ్యంగా అడగ్గానే శర్మ ఉలికిపడ్డారు.

"శివ, శివా! నీ అభిప్రాయం వినడానికి నాకెందుకు ఆక్షేపణ? నువ్వు చెప్పు, నేను వింటాను అని తువ్వాలుని లాగ్గొని, దేహాన్ని కప్పుకొని, ఛాతీమీద చేతులు ఆనుకుంటూ శర్మ వాడి మాటలు విన్నారు.

శేషాద్రి చెప్పాడు:

"మీరు నన్ను బ్రాహ్మణుడని అంగికరించకపోతే సరే, నేను ఆ అర్హత కావలని అడగలేదు. కాని, ఈ లోకం తీరు చూస్తే పురాతన వేదంకి బదులు ఒక కొత్త వేదం కావాలని నేనంటున్నాను. మీరన్నట్టు పాత సంస్కారాలన్నీ ఈ బ్రాహ్మణ సమూహం నిర్లక్ష్యంతో ఉదాసీనతో చేయడం మనం చూస్తున్నాం. కాని ఈ కొత్త వేదం ఆశించేవారు కొత్త నియమాలు పాటించి, కొత్త జ్ఞానంతో సమాజంకి మీరన్న ఆ బోధన చేయాలని పూనుకున్నారు. నేనటువంటి బ్రాహ్మణుడని చెప్పుకుంటే అది పొరబాటు కాదుకదా?"

"బాగుంది, నీ వాదం! పురాతన వేదంకి ఆస్తికం ఆధారం అంటే నువ్వు చెప్పే కొత్త వేదంకి ఆధారం నాస్తికం అన్నమాట! విను, నువ్వెంత వాదించినా నా ఆస్తికం ఎంత పురాతనమైనదో అంత పురాతనమైనది నీ నాస్తికం కూడా. మానవాభ్యుదంకి దోహదం చేసిన కళాత్మక విలువలు ఇచ్చినది మా ఆస్తికమే. ఆ రోజుల్లోకూడా కొందరు బుద్ధిజీవులు  నాస్తికం గురించి బోధన చేసారు, కాని ప్రజలు అంగీకరించలేదు. అందుకే ఈ సమాజం వర్ధిల్లింది. ప్రజలుగాని నాస్తికంకి ఒప్పుకున్నారంటే అంతే, కొంప మునిగినట్టే! అందువలనే దాన్ని ఎదరించి లోకాన్ని కాపాడాలి!" అని శర్మ బిగ్గరగా నోరెత్తి అరిచారు.

అప్పుడే గుండురాయరు లోపలనుంచి వచ్చారు.

"స్వామీ, అక్కడ మీ అమ్మాయి భోజనం సిద్ధం చేసి  మీకోసం కాచుకొని ఉంది. మీ తర్కం ఇంకా తీరలేదా?" అని అతను అడిగారు.

" అయ్యా, ఇది ఏనాటికీ తీరని తర్కం" అని అంటూ శర్మ లేచి లోపలికి వెళ్ళారు.

శర్మ వెళ్ళగానే గుండురాయరు శేషాద్రిని అడిగారు.

"ఏంరా, అంబీ[2], శర్మ ఏమంటున్నారు? అతనిదగ్గర ఎందుకురా నీ కమ్యూనిజం ప్రసంగం అంతా?"

"అతను చాలా పెద్దవారు . . . మేధావులు!" అని శేషాద్రి శర్మని పొగడాడు.

[2] అబ్బాయిని చనువుతో పిలిచే పేరు

“నేను దానిగురించి అడగలేదు . . . అతనితో తగవులాడితే నీ ఉద్యోగంకి హాని రావచ్చు అని నా భయం . . .”

“అతనలాంటి మనిషి కానేకాదు! . . .”

“అంటే, మంచిదే . . . ఎందుకు నీ మూటాముల్లె ఇంకా హోటల్లో ఉంది? ‘వాడు తరుముతున్నాడు!’ అని అన్నావుగా? ఈ సాయంకాలం వెళ్ళి అవన్నీ మనింటికి తెచ్చేయ్, సరేనా? ‘పాపం, తల్లీ, తండ్రి లేని పిల్లవాడు, మనింటిలో ఉండనీ!’ అని మామీ[3] అంటోంది . . . అసలు సంగతి ఏమిటంటే దానికి పక్కన పెట్టుకొని ముద్దులాడడానికి ఎవరూ లేరుగా? అందుకే నిన్ను పిలుస్తోంది!” అని రాయరు కళ్ళు గీటుతూ అనగానే శేషాద్రి “మీ ఇంట్లోనా?” అని అడిగాడు.

“ఇదేంట్రా, మీ ఇల్లూ, మా ఇల్లూ . . . ఇది మన ఇల్లు! . . . రా, భోజనం చేద్దాం!” అని తన చెయిని వాడి భుజంమీద వేసుకొని గుండురాయరు శేషాద్రితో ఇంట్లోకి ప్రవేశించారు.

## 3

శేషాద్రి, రాయరు కుటుంబంతో ఒక సభ్యుడుగా, శర్మబృందంలో వంటవాడుగా చేరి, ఇప్పుడు మూడు మాసాలయ్యాయి.

పెళ్ళి ముహూర్తాలన్నీ వచ్చాయి, గడచిపోయాయి. ముందులాగ ఎక్కువగా పని లేకపోయినా, శేషాద్రికి ఎప్పుడూ విశ్రాంతి, విరామం అనేది లేనేలేదు. తన జీవితంలో ఒకే ఒక లక్ష్యం ఉన్నట్టు వాడు రోజంతా - పగలూ, రాత్రీ - సంఘం, పార్టీ కార్యప్రవర్తనల్లో నిమగ్నమైపోతాడు; ఎప్పుడూ ఏదో చదువుతూనే ఉంటాడు. రాత్రివేళ శర్మగారి ఇంటి వసారాలో, ఇంటి గది కిటికీకి ఎదురుగా, వాడి పడక. అప్పుడుకూడా వాడు వీధి దీపం వెలుతురులో చాలాసేపు చదువుకుంటూ, ఒక డైరీలో సంక్షిప్తంగా ఏదో రాసుకోడం కొన్నిసార్లు శర్మ చూసారు; మైత్రేయి నిత్యమూ చూస్తూనే ఉంటుంది.

మైత్రెయి తను పుట్టిన తంజావూరు గ్రామంలో జీవించి ఉంటే ఎలా ఉంటుందో అలాగే ఈ చెన్నపట్ణంలోనూ పెరిగింది. గంగాబాయి తోడుతో సాయంకాలం గుడికి వెళ్ళడం తప్పిస్తే ఆమెకి బాహ్యాప్రపంచంతో ఏ పొత్తూ లేదు. సహజంగా,

---

[3] గుండురాయరు ఇక్కడ తన భార్యగురించి మాటాడుతున్నారు.

మానసికంగా కొంతవరకు ఆమెకి లోకపరిచయం ఉంది. గంగాబాయి ఆమెకి పుస్తకాలు, పత్రికలు తెచ్చి ఇస్తుంది. ఇక ఇంటికి కూరగాయలు, సామగ్రి కావాలంటే అవన్నీ రాయరు భార్యయే కొని తెస్తుంది.

ప్రొద్దున్నే శర్మకి ముందుగా మైత్రేయి నిద్రలేచి అతనిలాగే ఆచార నియమాలతో స్నానం చేసి, అతని ఆచారక్రియలకి అన్నీ సమకూర్చుతుంది. అతనికి ఆకలి అని గ్రహించి, అతను అడగడానికి ముందే "నాన్నగారూ, భోజనంకి రండి!" అని అతన్ని పిలిచి నిల్చుంటుంది.

అతని ప్రజ్ఞ, ఆదర్శ భావనలు ఆమెకు ఎంతవరకూ బోధపడ్డాయో, కాని అతని ఆచారాలు, కఠిన శిక్ష ఆమెకు బాగా నచ్చాయి. అవి చాలా ఉదాత్తమైనవి అనే నమ్మకంతోబాటు ఒక వైదిక బ్రాహ్మణుడు కొమార్తె ఎలాగ ఉండాలో అలాగా మైత్రేయి మెలగింది. వయసు పెరుగుతున్నకొద్దీ, అందులోనూ, ఇటీవల గంగాబాయి అంటున్న మాటలు - "ఇతనొక పాతకాలపు మనిషి . . . ఇలాగుంటే ఈ లోకంలో బతకడం ఎలాగ? దేవుడు ఇతనికి ఒక మంచి కూతురుని ఇచ్చాడు, కాని ఏం లాభం?" అని మాటిమాటికీ ఆవిడ గింజుకోవడం ఆమె వినడం జరిగింది; తన తండ్రి దృఢమైన అభిప్రాయాలను అతని ఎదుట ఏకీభవించినవారు కూడా అతని వెనుక "ఇతను ఈ లోకంలో పనికిరాని మనిషి!" అని మాటవాసికి ఎగతాళి చెయ్యడమూ గమనించింది. తనవంటి బ్రాహ్మణ యువతుల ప్రవర్తనలు చూసి, తన తండ్రి ఆదర్శాల మీదున్న పట్టు మెల్లమెల్లగా సడలంతో 'నాన్నగారి ధోరణి వలన నా జీవితం ఏమౌతుందో?' అనే భయమూ ఆమెను ఆవరించుకుంది.

ఆ సమయంలోనే ఎవరూ ధైర్యంగా, విరుద్ధంగా వాదించని తన తండ్రితో చాలా భవ్యంగా, మర్యాదతో శేషాద్రి తన అబిప్రాయాలు నిశ్చితంగా చెప్పడం చూసిన మైత్రేయికి అతని సాహసం, అతని వాదంలో న్యాయం నచ్చాయి. కాని శేషాద్రి తన్ను నాస్తికుడు అని చెప్పుకున్నతరువాత శర్మ "నాస్తికుడైతే నువ్వు బ్రాహ్మణుడుకాదు!" అని ఆరోపించడం విని ఆమె బాధపడింది.

బాలికగా తన తండ్రి ప్రేమానురాగాలుతో, అతనిపై ఆసక్తి పెంచుకున్న మైత్రేయి - ఇప్పుడు - అతను బాధ్యతారహితంగా, తనకొక కూతురున్నాదనే ప్రజ్ఞ లేకుండా ఉన్నారని చిఱచిఱలాడుతోంది.

ఆమె మనసు ఒక చిన్న ప్రపంచం. అందులోని చలనం బయటకి ఎవరికీ తెలీదు. ఒక యువతి మనసులో లేచే కలతలు, రోజువారీ వికసించే పువ్వులు తమ సుగంధం ఎవరికీ అగుపడకపోతే, అవి వాడిపోయి, కింద రాలిపోవడం ఎంత శోచనీయం! ఇంతలో, ఇంకొక నూరు పువ్వులు తరుముకొని వచ్చి ఆమె మనసుని ఆక్రమించుకుంచాయి. అవీ బయటకి దారిలేక లోలోపల కృశించిపోతే ఆ మనసు 'ఈ వొంటి జీవితంకి అంతులేదా?' అని తహతహలాడడం మైత్రేయి కళ్ళని చూసినవారికే బోధపడుతుంది. కాని స్త్రీలకున్న సహజ గుణాలు - బిడియం, దిగులు వంటివి ముసుగులుగా ఉన్నప్పుడు అది దుర్లభం. కాని ఆ రోజు శేషాద్రి ఆమె కన్నులు సూటిగా చూసినప్పుడు ఆమె నిరాశామయ మనసులో తారాడే కల్పనలు గ్రహించాడు. శర్మని చూసిన తరువాత అతను తన కొమార్తెను ఎలా పెంచుతున్నారని శేషాద్రి ఊహించగలిగాడు. ఆ తరువాత, కొన్ని సార్లు, దిక్కులేని ఆ యువతికి తనేమైనా సహాయం చెయ్యం సాధ్యమా అనికూడా ఆలోచించాడు. కాని ఏం లాభం?నిత్యమూ సామాజిక, రాజకీయ కబుర్లు, కార్మికులు, పామరులు గురించి బాధ్యతతో అతను కృషి చేస్తున్నప్పుడు ఒక వొంటరి యువతికోసం అతనెందుకు గొప్పగా బాధపడాలి?

ఇంతకీ, కావాలన్నా అతను చేసేదేముంది?

కాని శేషాద్రిని చూసినప్పడల్లా మైత్రేయి ఒక కొత్త ఆవేశంకి గురి అయింది. వారిద్దరి ముఖాలు కలుసుకున్నప్పుడు, మైత్రేయికి గభీమని తెలివి తప్పి అతని పాదాలలో పడి ఏదో యాచించాలనిపిస్తుంది.

అది శేషాద్రితి తెలుసు. అతనికి తెలుసని ఆమెకీ తెలుసు. ఈ మూడు మాసాలలో రెండు హృదయాల చూపులతోనే ఒకరినొకరు ఆకర్షించబడి - దూరంలోనే నిలబడి - ఒక బంధంలో కట్టబడినట్టు ఇద్దరూ ఊహించారు. కాని ఇంతవరకూ ఒకరితో ఒకరు మాటాడుకునేసేలేదు.

ఆ దినం రోజంతా శేషాద్రిని చూడకుండా తపించిపోతున్న మైత్రేయి ఆ రాత్రి చాలాసేపు వరకూ - కిటికీకి ఎదరుగా పడక పఱచి నిద్రపోవడానికి అతన్ని ఎదురు చూసి, అతను కనుపించక - ఆఖరికి, నిరాశతో నిద్రపోయింది.

గభీమని కలలో కనిపించిన శేషాద్రి జ్ఞాపకంతో ఆమె పరుపునుంచి లేచి కూర్చుంది. శర్మ నిద్రపోతున్న గది చీకటిని దాటి ఆమె చూపు కిటికీ అవతల వసారామీద పడినప్పుడు అక్కడ తన పడకలో కూర్చొని ఏదో రాస్తున్న శేషాద్రి కనిపించాడు.

'ఈ అర్ధరాత్రిలో ఇతనేం రాస్తున్నారు? రెండు గంటలో, మూడు గంటలో . . . ?' అని ఆమెకి జాలి కలిగింది. గది మూల అధమంగా వెలుగుతున్న బెడ్ రూమ్ దీపం మీటని నొక్కడంతో దాని ప్రకాశం ఎక్కువైంది. ఆ తరువాత లేచి ఒక గ్లాసులో నీళ్ళు తాగుతున్నప్పుడు మైత్రేయి కళ్ళని మళ్ళించి వసారాను చూసింది. ఈ గదిలోని చలనం వలన రాయడం ఆపేసి శేషాద్రికూడా తన్ను చూస్తున్నాడని మైత్రేయి గ్రహించింది.

మళ్ళీ నిద్రపోవడానికి పడకమీద కూర్చున్న  మైత్రేయికి గది వెలుతురు తగ్గించడానికో, నిద్రపోవడానికో మనసు రాలేదు. పడకమీద వాలి, దీపంని దగ్గరకి లాగ్గుంది. పక్కనేవున్న ఒక పుస్తకం అందుకొని పేజీలు తిరగేస్తూ, మళ్ళీ ఆ కిటికీని చూసింది.

'అబ్బా, ఎంత పెద్ద కళ్ళు! ఆ కిటికీని దాటి ఆ రెండు కళ్ళు కాంతి ప్రవాహంగా వచ్చి నన్ను కౌగిలించికొని . . .

'ఆ పెదిమల చలనం ఎంత అందంగా ఉంది!' అని నిట్టూర్పు వదిలాడు శేషాద్రి.

కొంచెం సేపు తరునాత శేషాద్రి గురించి, తన గురించి మైత్రేయి గుర్తుచేసుకొని తన తండ్రి జ్ఞాపకం రాగానే - తన ఆశ నెరవేరుతుందా అని ఆలోచించక తను కల్పనలని పెంచుకోడం ఎంత పెద్ద పొరబాటు అని గ్రహించడంతో ఆమె పెద్ద కన్నులు  తడిసిపోయాయి. అది శేషాద్రి చూడకూడదని మైత్రేయి రెప్పలు మూసేసి కన్నులు కిందకి మళ్ళించింది. ఆఖరికి అదీ లాభం లేదని, దీపం వెలుతురు తగ్గించి, తలగడమీద తలని హత్తుకొని వెక్కి వెక్కి ఏడ్చింది. అప్పుడే ఆమె ఎదురుచూడని సంఘటన జరిగింది: శేషాద్రి తన జేబునుంచి ఒక సిగరెట్ తీసుకొని, దాన్ని వెలిగించుకొని మళ్ళీ రాయడం ఆరంభించాడు. "నిద్ర రాకూడదని ఇదొక చెడ్డ అలవాటు కాబోలు! ఏం రాస్తున్నారో?" అని మైత్రేయి సణుక్కుంది.

ఆ మరుదినం, ఉదయం . . .

గుండురాయరు ఇంటి పెరడులో ఒక స్టూల్ మీద కూర్చొని శేషాద్రి ఏదో పత్రిక చదువుతున్నాడు. గంగాబాయి వాడికి ముందున్న కిటికీ ఒడ్డులో వేడి కాఫీని చల్లార్చి పెట్టి లోపలికి వెళ్ళింది. ఏదో పనిమీద పెరడుకి వచ్చిన మైత్రేయి దూరంలో శేషాద్రిని చూసింది. అప్పుడే గుండురాయరు, తొందర తొందరగా, పంచెని ఎత్తి, నడుమున దోపుకొని, జంధ్యంని చెవిలో దోపుకొని కాలకృత్యంకని పరుగెడుతూ వచ్చి శేషాద్రిముందు చెయి చాపగానే వాడు అతనికి తన జేబునుంచి ఒక అగ్గిపెట్టి, సిగరెట్ అందించడం మైత్రేయి చూసింది.

తలెత్తి ఆమెను చూసిన శేషాద్రి ఆమె కళ్ళు ఎఱ్ఱగా పొంగివుండడం గమనించాడు. రాత్రి జరిగినది గుర్తు చేసుకొని "రాత్రి నిద్రపోలేదు కాబోలు!" అని మొట్టమొదటి సారిగా ఆమెతో మాటాడాడు. శేషాద్రి తన్ను సూటిగా చూసి - అకస్మాత్తుగా మాటాడంతో - మైత్రేయి మొహం ఎఱ్ఱబారిపోయింది. అప్పుడే పెరడుకి వచ్చిన గంగాబాయిని చూసి మైత్రేయి మాటాడింది: "నేనేం రాత్రీ పగలూ నిద్ర లేకుండా, వొళ్ళు పాడుచేసుకొని పని చేస్తున్నానా? నేను బాగానే నిద్రపోయాను." గంగాబాయి అది విని, ఇద్దరినీ చూసి, నవ్వుతూ, కొంటెగా "అవునులే, వాడికి కుటుంబం, భారం అని ఏదీ లేదుగా? పెళ్ళాం, పిల్లలు అనే బాధ్యత వచ్చేవరకూ ఇలాగే పార్టీ, సంఘం, మీటింగని తిరుగుతూ ఉంటాడు!" అని అంది.

"అది సరే . . . మామీ, 'రాయరు అంకుల్' కూడా ఆ పార్టీలో ఉన్నారా?" అని మైత్రేయి ఎగతాళిగా అడిగింది.

"అవునులే, అతనికి అదొకటే తక్కువ! . . . " అని అంటూ గంగాబాయి కొళాయి అడుగున వున్నబిందెని తీసుకొని నడుములో సర్దుకొని లోపలికి వెళ్ళింది.

"'అంకుల్' కూడా సిగరెట్ తాగుతున్నారు, అందుకే అడిగాను . . . " అంది మైత్రేయి.

"ఏం, సిగరెట్ తాగుతే, అదేం పెద్ద తప్పా?" అని మెల్లగా శేషాద్రి అడిగాడు.

"మీ సంఘంలో సిగరెట్ తప్పకుండా తాగాలనే నిబంధన ఉందా?"

శేషాద్రి నవ్వుతూ జవాబు చెప్పాడు: "తాగకూడదని ఏ నిబంధనా లేదు."



"అర్ధరాత్రివేళ నేను లేచి చూసినప్పుడు వసారాలో ఒకటే పొగ . . . ఎందుకు రాత్రి రెండు గంటలవరకూ మేలుకొని ఉండాలి?"

"నిన్న రాత్రి మా హోటలు కార్మికుల సంఘం General Body Meeting . . . నేను రావడం ఆలస్యమైపోయింది . . . ఆ కార్యకలాపాలన్నీ నేను కాపీ చేసాను . . . నిద్ర వచ్చినప్పుడు సిగరెట్ తాగుతే . . . "

"ఒరేయ్, నువ్విలా అశుద్ధ బ్రాహ్మణుడుగా ఉంటే వాళ్ళ నాన్నగారు తన కూతురుని నీకెలా ఇస్తారు?" అని వాళ్ళిద్దరి మనసు గ్రహించిన గంగబాయి మెల్లగా శేషాద్రిని మందలించింది.

ఆవిడ మాటలు విని మైత్రేయి కోపం వచ్చినట్టు నటించుతూ వెనకాడింది.

"అదా మీ ఉద్దేశం? వాళ్ళ నాన్నగారు తనలాగ ఆచారాలూ, నియమాలూ పాటించే బ్రాహ్మణుడుకే తన అమ్మాయిని ఇచ్చి పెళ్ళిచేస్తారు . . . " అని అంటూ శేషాద్రి మైత్రేయిని చూసినప్పుడు ఆమె కన్నులు చెమ్మగిల్లడం గమనించాడు.

"మైత్రేయి . . . " అని తడబడుతూ, మెల్లగా ఆమెను పిలిచాడు. ఆమె అక్కడనుంచి పరుగెత్తింది.

"అవును, నిజం! . . . ఈ అమ్మాయిని కన్నతల్లి అల్పాయుషుతో పోయింది. . . ఇతను కూతురిని ఎలా పెంచుతున్నారని మనందరం చూస్తున్నాంగా? ఇతనిలాగే ఒక అల్లుడూ వచ్చాడంటే చాలు, ఇక కొంప మునిగినట్టే! . . . " అని గంగాబాయి విసుగ్గుంటూ నిష్టూరంతో పలికిన మాటలు మైత్రేయి చెవులకి అందాయి.

ఆనకట్టు తెరిచినట్టు కన్నీళ్ళు ధారధారగా ప్రవహించాయి.

## 4

మైలాపురులో ఒక ధనవంతుని ఇంటిలో తన పరిచారక బృందంతో పని చేసి, తన సహకారులకి వేతనం చెల్లించే సమయం సంధ్యాకాలం వచ్చేసిందని గ్రహించిన శర్మ కపాలీశ్వర ఆలయంకి పక్కన ఉన్న చెరువుకి వెళ్ళి, స్నానం చేసి, సంధ్యావందన క్రియలు ముగించి, గట్టెక్కి అలయంలోకి ప్రవేశించారు.

దేవుని దర్శనం చేసుకొని అతను కోవిల ప్రహరిలోకి వచ్చి కొంచెం సేపు నిష్టలో కూర్చున్నారు.

హఠాత్తుగా దేవగానంలాగ లయతో ఎవరి పాటో  అతనికి వినిపించింది. ఆ నాదం కోవిల నల్లమట్టిరాళ్ళని తాకి, చెల్లాచెదురై, ప్రతిధ్వనిగా పలకడం విని శర్మ మైమరచిపోయి కళ్ళుతెరిచారు.

ఆ ధ్వని వచ్చిన దిక్కులో అతను నడిచారు. ప్రహరీ పశ్చిమ దిక్కునుంచి వస్తూ ఉత్తరదిక్కులో మళ్ళిన శర్మకి అక్కడ, దూరంలో,  కళ్ళు మూసుకొని, ఛాతీమీద రెండు చేతులూ  చేర్చుకొని, నుదుట విభూతి, పిలక, బ్రహ్మ తేజస్సుతో, నిష్టలోవున్న ఇరవైయేళ్ళ యువకుడు కనిపించాడు. శర్మ అతని దగ్గరకి వచ్చి, అతని ఎదుట కళ్ళు మూసుకొని కూర్చున్నారు.

యువకుడు పాటలో ప్రతీ పదం నిండుగా, మనశ్శుద్ధిగా వక్కాణించి చెప్పడం విన్న శర్మ కళ్ళకి ఆ ప్రార్ధనకి అర్హుడైన దేవుడి స్వరూపం కనిపించింది.

తన్నూ, తన పరిసరాలనీ మరిచిపోయి, పాడుతున్న ఆ యువకుడుని మరిచిపోయి  అతను ఎంతసేపు అలాగే కూర్చున్నారో . . .

పాడుతున్నవాడు కళ్ళు తెరిచి యోగంలో ఉన్న బ్రాహ్మణుడుని చూసి "స్వామీ, మీరు నన్ను దీవించాలి" అని కోరుతూ అతని ముందు సాంష్టాగ నమస్కారం  చేసాడు. అప్పుడు శర్మ అన్నారు: "నాకు తెలుసు. బ్రాహ్మణధర్మం అనుసరించి జీవించేవారు చాలామంది ఉన్నారు. నీ వయసు గ్రహించి నేను నిన్ను దీవించుతాను." యువకుడు లేచి నిలబడినప్పుడే అతని ఛాతీలో జంధ్యం లేకపోవడం చూసి శర్మకి విభ్రాంతి  కలిగింది.

"క్షమించాలి. నేను బ్రాహ్మణుడుని కాదు. కొన్నిరోజులవరకూ మాడవీధిలో తేవారం[4] పాఠశాల నడిపిన చొక్కలింగ ఓదువార్ నా తండ్రి. నా పేరు సదానందన్" అని యువకుడు చెప్పాడు.

"ఇక నిన్ను నేను 'సదానంద ఓదువార్!' అనే పిలుస్తాను . . . నువ్వేం చేస్తున్నావ్?" అని శర్మ అడిగారు.

"నేను చేసే పని శివ ఆరాధన - కీర్తనలు పాడడం, ఇతరులకి బోధించడం - అంతే,  మరేం లేదు. మా నాన్నగారు కన్నుమూసిన తరువాత నేను ఆ పాఠశాల

---

[4] ఏడవ శతాబ్దంలో, ప్రఖ్యాత ముగ్గురు శివభక్తుల కీర్తనల గ్రంధం. ఈ కీర్తనలని శివాలయంలో పాడేవారిని ఓదువార్ అని పిలుస్తారు

నిర్వహించాలని ప్రయత్నం చేసాను. విద్యార్థులు రాలేదు సరికదా, మళ్ళీ ఆర్థిక సహాయంకి ఎవరూ సమ్మతించలేదు. మా నాన్నగారు అనేవారు, "శైవం, తమిళం - ఈ రెండూ వర్ధిల్లాలి - అదే మన లక్ష్యం," అని. 'శైవం, తమిళం కోసమే నా సేవ, జీవితం' అని నేను నిశ్చయించాను. అందువలన ఆకలితో తిండిలేక చావాలన్నా నేను సిద్ధంగా ఉన్నాను" అని సదానందన్ స్పష్టంగా పలికిన మాటలు విని శర్మ "ఇవన్నీ ఒక బ్రాహ్మణుడు చెప్పవలసిన మాటలు" అని అన్నారు. 'ఎందుకు తిండి లేక చావాలి?' అని తనలో చిఅచిఅలాడారు.

వాడు తన మెడలో ఎర్ర దారంతో కూర్చిన రుద్రాక్ష పూసలని తడముతూ మాటాడాడు: "నాకు మా నాన్నగారి ఆచారం బాగా అలవాటైపోయింది. ఎది దొరికితే అది తిని కడుపు నింపుకోడం నాకు ఇష్టం లేదు. నేనే వండుకుంటాను, లేకపోతే కోవిల ప్రసాదం . . . "

"ఇవాళ నీకు మా ఇంటిలో భోజనం . . . నీకేం అభ్యంతరం లేదుకదా?" అని శర్మ అతన్ని ప్రేమతో పిలిచారు. సదానందన్ అతనితో బయలుదేరాడు.

కోవిలనుంచి బయటకి వచ్చినప్పుడు ఎదుట కనిపించిన తమలపాకు కొట్టు పక్కన రాయరు, శేషాద్రి సిగరెట్ తాగుతూ మాటాడుతున్నారు. అది చూసి శర్మకి ఆశ్చర్యమూ, కోపమూ కలిగాయి.

'వాడు నాస్తికుడు, ఈ రాయరు కూడానా?' అని వచ్చే కోపాన్ని అతను అణచుకున్నారు.

ఇంటికి సదానందన్ తో వస్తున్నప్పుడు శర్మ దారంతా బ్రాహ్మణధర్మం, దానికి కలియుగంలో తగిన గౌరవం లేకపోవడం గురించి దూషించుతూ నడిచారు.

ఇంటికి రాగానే శర్మ సదానందన్ని పెరడులో కాళ్ళు, చేతులు కడుక్కోమనిచెప్పిన తరువాత కూతరుతో "ఈ అబ్బాయి బ్రాహ్మణుడు కాదు. కాని, వాడికి ఎంత భక్తి, ఎంత ఆచారం! వీడితో వస్తున్నప్పుడే బ్రాహ్మణ కడుపులో పుట్టిన ఈ శేషాద్రి, ఈ రాయరు సిగరెట్ కాల్చడం నేను చూసాను! కర్మ! . . . కర్మ!" అని నెత్తిలో బాదుకున్నారు. అది విని మైత్రేయి మొహం నల్లబాఱింది.

సదానందన్ ఆచారశీలుడైనా, బ్రాహ్మణుడు కాదనే కారణం వలన శర్మ అతన్ని ముందు గదిలో కూర్చోబెట్టి కూతురుని అతనికి వడ్డించమన్నారు.

“మీరు భోంచెయ్యరా?” అని సదానందన్ అడిగాడు.

“లేదు. రాత్రి నేను భోజనం చెయ్యను. పళ్ళు, పాలు మాత్రం తీసుకుంటాను” అని చెప్పి శర్మ పక్కనే ఒక పీటలో కూర్చొని, వాడితో వాత్సల్యంతో మాటాడారు.

“ఓదువార్, త్వరలో పెళ్ళి చేసుకో. అప్పుడే ఆచారనియమాలతో జీవించడం సులభం. ఎందుకంటే నువ్వొక మంచి బ్రహ్మచారివి. మంచి బ్రహ్మచారియే మంచి గృహస్తుడుగా జీవించగలడు. బ్రహ్మచారి అంటే పెళ్ళికానివాడు మాత్రం కాదు. ‘బ్రహ్మంని స్తోత్రం చేస్తూ పితృఋణం తీర్చేవాడు’ అని శాస్త్రం చెప్తోంది. అందుకేగదా నీకు హోటల్లో భోజనం చేసే అలవాటు లేదు? నా వంటని అందరూ పొగడుతుంటే నాకు నవ్వాలనిపిస్తుంది! వంట అంటే ఎంత పవిత్రమైన పని! మా అమ్మాయి వండినప్పుడు భయభక్తితో అన్ని పనులూ చేస్తుంది. అందుకే అది నా మనసుకీ, దేహంకి సరిపడుతుంది. ఇక ఇతరుల వంట ఎంత అధ్వాన్నం అని వేరే చెప్పాలా? ఏదో ఉక్కు ఖార్ఖానాలో పనిచేసి చెమట పట్టినట్టు . . . అబ్బా, నాకు అది అసహ్యం! నా అమ్మాయి వంటే నాకు ఇష్టం!” అని శర్మ చెప్పుకుంటూ పోతూంటే మైత్రేయి అతన్ని మందలించింది. “చాలు, భోజనం చేసేవాళ్ళకి బదులు మీరే అన్నీ చెప్తున్నారు! అతనేదీ వ్యతిరేకంగా అనకూడదని మీరు అంటున్నారనిపిస్తోంది. ఒక అతిథి వస్తున్నారని నాకు మీరు ముందే చెప్పివుంటే నేను అతనికని ప్రత్యేకంగా ఏదైనా వండివుంటాను” అని మైత్రేయి తండ్రి నోరు మూసింది.

“అమ్మాయీ, దానికేం? . . . అతిథి అంటే ఉన్నదేదో ప్రేమతో పుచ్చుకునేవారు . . . ఓదువార్, భోజనం తక్కువగా ఉందా? మా అమ్మాయి ఏమంటుందో విన్నావా?” అని శర్మ అడగ్గానే సదానందన్ “స్వామీ, భోజనం సహజంగా, పవిత్రంగా ఉంది” అని జవాబు చెప్తూ లేచాడు.

## 5

శర్మకి చెన్నపట్ణంకి వచ్చిన పదిహేను సంవత్సరాలలో అతనికేర్పడిన గుండురాయరు స్నేహం తరువాత అతనికంటే చాలా చిన్నవాడైన, ఇతర జాతికి చెందిన సదానందన్ తో పరిచయం బాగా నచ్చింది. కలుసుకున్న కొన్ని రోజుల్లోనే ఇద్దరూ ఒకరినొకరు సరిగ్గా, బాగా గుర్తు చేసుకున్నారు.

శర్మగారి జ్ఞాపకం వచ్చినప్పుడెల్లా సదానందన్ తలవంచి మనసార అతన్ని పూజించాడు. 'అతనొక ఉత్తి బ్రాహ్మణుడు కాదు, ఒక మహా పురుషుడు, నాకు దొరికిన మార్గదర్శి, గురువు' అని నమ్మాడు.

సమయం దొరికినపుడెల్లా అతన్ని చూడాలని వాడు లేక వాడిని కలుసుకోడానికి శర్మ వెళ్ళడం అలవాటైపోయింది. సదానందన్ కి తమిళంలోనే పాండిత్యం ఉంది. వాడికి సంస్కృతం తెలీదు. శర్మకి రెండు భాషల్లోనూ మంచి జ్ఞానం ఉంది. అతను వాడికి సంస్కృత శ్లోకాలూ, ఉపనిషత్ కథలు చెప్పి అర్థం వివరించారు. గురువు, శిష్యుడు అనే ధోరణిలో కాకుండా స్నేహభావంతో వాళ్ళు మెలిగినా గురువు దగ్గర పాఠం నేర్చుకున్నట్టే సదానందన్ అతని దగ్గం అన్నీ అడిగి నేర్చుకున్నాడు.

ఆ ఇద్దరూ మొట్టమొదట కలుసుకున్న తరువాత చాలా సార్లు సదానందాన్ని తన ఇంటికి రమ్మని పిలిచి సత్కరించడంలో శర్మకి తృప్తి, సంతోషం కలిగాయి.

ఒక వారంగా శేషాద్రి ఊరులో లేడు. ఏదో మహాసభ అని శర్మకి చెప్పి అతని అనుమతితో అతను వేరే ఊరుకి వెళ్ళాడు. వాడలా సామాజిక కార్యకలాపాలకి తిరగడం గంగాబాయికి నచ్చలేదు. వాడిని ఒక బాధ్యతగల గృహస్తుడుగా చెయ్యడం తన ధర్మం అని ఆవిడ మనసులో ఎందుకో ఒక ఆలోచన లేచింది.

ఆ రోజు ఉదయం శేషాద్రి ఊరునుంచి తిరిగి రాగానే గంగాబాయి తన ఉపదేశం ఆరంభించింది. అలవాటుగా పెరడులో స్టూల్ మీద కూర్చొని శేషాద్రి వార్తా పత్రిక చదువుతున్నప్పుడు వాడికి కాఫీ చల్లార్చి అందించి, చెప్పింది: "అంబీ, నా మాట విను. ఈ మైత్రేయిలాంటి అమ్మాయి నీకు దొరకడం చాలా అదృష్టం . . . నీకు మొహమాటం అంటే నేనే శర్మతో మాటాడుతాను, సరేనా? నీకా ఆలోచనే లేనట్టు నాకనిపిస్తోంది. ఎంతసేపూ నువ్వు, ఆ సభ, ఈ కమిటీ అని తిరుగుతుంటే నీకు ఆ ఆలోచన లేదు. ఇలాగే కాలం గడిపితే ఆ తరువాత నువ్వే బాధపడతావ్, నీ ఆరోగ్యమూ పాడవుతుంది" అని ఆరోపించింది.

'నా మనసులో ఏముందో ఈవిడకి తెలియదు, మరి దాని మనసులో ఏముందో తెలుసునా?' అని అనుమానించిన శేషాద్రి "మామీ, నా ఉద్దేశం ఏమిటో మీరు అడిగారు, సరే . . . కాని మైత్రేయి మనసులో ఏముందో?" అని అడిగాడు.

"బాగుంది, ఇంతేనా నీ తెలివి? దాని మనసులో ఏముందో చెప్తాను, విను! పాపం, ఈ వారమంతా - నువ్వు ఊరులో లేనప్పుడు - అమ్మాయి ఎలాగ తపించిపోయిందో తెలుసా? ఇక్కడ వచ్చినప్పుడల్లా నువ్వు వాళ్ళ నాన్నగారితో మాటాడడం, నువ్వు రాత్రల్లా చదవడం, రాయడం - నీగురించే ఎప్పుడూ, ఏదో అది మాటాడేది. నాకు దాని మనసు తెలిసిపోయింది. నీగురించే నాకేమీ తెలీదు. లేకపోతే నువ్వు రాకముందే నేనే వాళ్ళ నాన్నగారితో మాటాడివుంటాను!"

తనపై ఉన్న ఈ ప్రేమానురాగాలు మైత్రేయి ఇంత నిష్కపటంగా గంగాబాయికి తెలియజేసిందని విని శేషాద్రి ఉప్పొంగిపోయాడు.

"సరే, మామీ, నాకూ ఇష్టమే. మీరు పెళ్ళి అతనితో కలుసుకోండి. కాని, ఒక సంగతి. నేనొక పని సాధించాలని పూనుకుంటే, అది తప్పకుండా చేసి తీరుతాను. వాళ్ళ నాన్నగారు ఇక ఏం చేసినా, అతను ఏ వేదాంతం ఉపదేశించినా, ఈ పెళ్ళి తప్పక జరుగుతుంది. దానికి మీరు నాకు చేయూత ఇవ్వాలి, సరేనా?"

"అంబీ, బాగా చెప్పావ్! నాకూ మనసులో అదే ఆలోచన.  ఈ పిచ్చి బ్రాహ్మణుడు తన కూతురు బ్రతుకు పాడు చెయ్యడానికు ముందే మనం మన పని చేస్తే ఆఖరికి అతను మన దారికి వచ్చేస్తారు. మనం మన పని శాస్త్రోక్తంగా, ఆచార నియమాలతో చెయ్యాలి . . . అవును, నీకు జాతకం ఉందా?"

"నాకెందుకు మామీ జాతకం?"

"అలా అనకు . . . నీకు నమ్మకం లేకపోయినా అందువలన వాళ్ళ నాన్నగారు ఈ పెళ్ళికి ఆక్షేపించకూడదు . . . చూడు . . .  నీ జన్మదినం రాసి నాకు ఇయ్యి. నేను జోస్యుడి దగ్గర జాతకం గణించమని చెప్తాను. రెండు జాతకాలూ చూడమంటాను."

ఆవిడ నొక్కిచెప్పడంతో శేషాద్రి సరే అన్నాడు.

"అంబీ, బాత్ రూమ్ ఖాళీగా ఉంది . . .  నువ్వు స్నానం చెయ్యవచ్చు" అని అంటూ స్నానం గదినుంచి నడుమున తడిసిన బట్టలతో పరుగెత్తుకొని వచ్చిన గుండురాయర్ గంగాబాయి ఎదుట నిలబడి "నాకు తువ్వాలు ఇయ్యవే, నేను మరిచిపోయాను!" అని వొణుకుతూ బతిమాలాడారు.

వచ్చిన నవ్వుని దాచుకంటూ గంగాబాయి అతని మొహంలో ఒక తువ్వాలు విసిరింది.

ఆ మధ్యాహ్నం ముందు గదిలో కూర్చొని శర్మ వేదాంత పరిశోధనలో కొన్ని పుస్తకాల పేజీలు తిరగవేసే సమయం “శర్మా, నీతో కొంచెం మాటాడాలి” అని గంగాబాయి అక్కడకి వచ్చి గడప దగ్గర నిలబడింది.

గుండురాయర్ లాగ ఆవిడకి భయపడే స్వభావం, శర్మ పాండిత్యం గురించి అవగాహన లేకపోవడం వలనా, శర్మ వయసులో తనకంటే చిన్నవాడనే కారణం వలనా, ఆవిడ శర్మని ఏకవచనంలోనే పిలవడం అలవాటు చేసుకుంది.

“ఇదేంటి, గంగాబాయ్! ఆడవాళ్ళందరనీ వదిలేసి మీరు ఇక్కడకి వచ్చేసారు! మీతో ఎది మాటాడినా సరే, అదొక ప్రశ్నగా అయిపోతుందని మీ స్నేహితులు చెప్పడం నాకు తెలుసు. ఇదేం అటువంటి కబురు కాదు కదా?” అని అంటూ శర్మ తన చెయిలో ఉన్న పుస్తకం మూసారు.

“నేను నీతో ముఖ్యమైన విషయమే మాటాడడానికి వచ్చాను. నీ కూతురు జాతకం, మన అంబి జాతకం జోస్యుడుకి ఇచ్చి సరిచూడమన్నాను. రెండూ దివ్యంగా అనుకూలంగా ఉన్నాయని అతను చెప్పారు. ‘ఈ అమ్మాయికి ఈ అబ్బాయే వరుడని బ్రహ్మ విధించాడు’ అని అతను అంటున్నారు. నీకు అబ్బాయిగురించి తెలుసు. ఇక, నీకూ ఒక భారం తగ్గినట్టే, మరేం బాధా లేదు; నీ అమ్మాయి మరెక్కడికీ వెళ్ళకుండా నీతోనే ఉంటుంది . . .” అని గంగాబాయి తనంతట తనే - శర్మ మొహంలోనూ, భావనలలోనూ లేచే ఉగ్రత గమనించకుండా - వల్లించుతుంటే శర్మ కోపంతో సింహంలాగ గర్జించారు.

“నోరు మూయండి! ఎవడా జోస్యుడు? జోస్యుడంటే ఆకాశంలోని గ్రహాలని చూసి గణించేవాడు. పంచాంగం చూసి శుభవేళ చెప్పేవాడు కాదు! వాడు సరే అంటే చాలు అని మీ ఉద్దేశమా? . . . అది సరే, మైత్రేయికి వరుడు చూడాలని మీరెందుకు శ్రమ పడుతున్నారు?” ముందు శర్మ కోపంతో అరంభించినా, చివరకి కంఠం తగ్గించుకొనే అడిగారు.

“ఏం, వాడికేం తక్కువ? కులగోత్రాలగురించి ఏ ప్రశ్నా లేదు. నువ్వు మొండిగా నీ వేదాంతంలో నీ అమ్మాయి జీవితం పాడుచేస్తున్నావు, నువ్వు పూజించే ఆ

దేవుడుకూడా నిన్ను క్షమించడు! ఇది నీ కుటుంబ విషయంమే ఐనా రెండేళ్ళలో తల్లిని పోగొట్టుకున్న పిల్లగా, నువ్విక్కడ వచ్చినప్పుడునుంచి మైత్రేయిని చూసిన దోషం వలన - నీగురించి బాగా తెలిసే - నేను మాటాడుతున్నాను" అని గంగాబాయి కళ్ళు తడబెట్టుకుంటూ చెప్పింది.

"మీరు నన్ను క్షమించాలి! ఒక మంచి బ్రాహ్మణుడికి నా అమ్మాయిని ఇవ్వడానికి నాకు ఆక్షేపణ లేదు. వీడు తను బ్రాహ్మణుడే కాదని అంటున్నాడే? మీరే కులగోత్రాలగురించి మాటాడుతున్నారు. ఒక నాస్తికుడికి నా అమ్మాయిని ఇచ్చి పెళ్ళి చెయ్యడం బ్రాహ్మణధర్మంకి విరుద్ధం, నా అమ్మాయికి నేను చేసే ద్రోహం . . . అందువలన ఈ పెళ్ళి జరగదు! నేను మరేం చెప్పదలచుకోలేదు,ఇక మీరు దీనిగురించి మాటాడవద్దు!" అని శర్మ కరారుగా చెప్పేసారు.

"అదేంటో నాయనా . . . నా మనసులో ఉన్నది నీకు చెప్పాను. అంతే! రేపు నీ వలన నా అమ్మాయికి చెడ్డ పేరు రాకూడదు, అవునా?" అని శర్మ చెవులకి వినిపించినట్టు సణుగ్గుంటూ గంగాబాయి లేచింది.

"మైత్రేయి పవిత్రమైన బ్రాహ్మణ కులంలో పుట్టిన పిల్ల. ఎవరితోనో లేచిపోతుందని భయం వద్దు!" అని శర్మ ధృడంగా హామీ ఇచ్చి ఒక పుస్తకం అందుకున్నారు.

"అదీ చూద్దాం!" అని తనలో గొణుక్కుంటూ గంగాబాయి గబ గబ నడిచింది.

## 6

శర్మ-గంగాబాయి సంభాషణ వివరాలు తెలుసుకున్న తరువాత శేషాద్రి మైత్రేయికోసం చాలా బాధపడ్డాడు. తన మిత్రులని సంప్రతించాడు. వాళ్ళందరూ అతనికంటే తీవ్రమైనవారు కనుక ఆ బ్రాహ్మణుడు అహంకారం అణచి, శేషాద్రి ఈ పెళ్ళి చేసుకోవాలని సలహా ఇచ్చారు. అమ్మాయి నిలకడగా పెళ్ళికి రాజీపడితేనే అది సాధ్యం అని అతనికి నొక్కిచెప్పారు.

గంగాబాయి తను మైత్రేయిని చూసినప్పుడెల్లా ఆమె ఏమీ మాటాడకుండా ఏడుస్తోందని శేషాద్రికి చెప్పింది.

శేషాద్రి బాగా ఆలోచించాడు. మైత్రేయి పెళ్ళికి ఏకీభవిస్తే, శర్మ కాదు, ఈ ప్రపంచమే ఆక్షేపించినా, ఈ పెళ్ళి చేసుకోవాలని అతను నిశ్చయించాడు. మైత్రేయి తన భార్యగా తన ఆదర్శ జీవితంకి ఎలా దోహదం చేస్తుందని కల్పనలు చేసుకుంటూ, ఆమె మనసులో ఏముందో గ్రహించడానికి, శర్మ లేనప్పుడు, ఇంటిలో ప్రవేశించాడు.

చీకటిలో, గదిలో ఒక మూల దీపం వెలిగించి తనకి దారి చూపమని దేవుడుని ప్రార్థించే మైత్రేయి తలెత్తి చూసినప్పుడు పక్కనే నిలబడివున్న శేషాద్రి కనిపించాడు. పరుగెత్తుకొనివచ్చి అతని చేతులు అందుకుంది. అతని మాటలేవీ ఆమె చెవులకి వినబడలేదు. ఆ స్పర్శలో ఆమె దేహమంతా వొణికింది.

ఆ సమయంలోనే శర్మ సదానందన్ తో మాటాడుకుంటూ ఇంటికి వచ్చారు. శర్మ వాడిని వసారాలో కూర్చోబెట్టి లోపలకి వెళ్ళారు, అక్కడ తను చూసిన దృశ్యం చూసి కళ్ళు మూసుకున్నారు. అతని చెవులలో మైత్రేయి మాటలు వచ్చి చితకగొట్టాయి.

"మీరే ఇక నన్ను కాపాడాలి . . . ఇప్పుడే మీతో ఎక్కడికి వెళ్ళాలన్నా నేను సిద్ధంగా ఉన్నాను . . . నాన్నగారి చిత్రవధ ఇక నేను భరించలేను!" అని ఆమె ఏడ్చింది.

శర్మ తన రెండు చెవులు మూసుకొని వసారాకి పరుగెత్తారు.

"సరేలే, మైత్రేయి, ఏడవకు . . . నేను గంగాబాయితో మాటాడి అన్ని ఏర్పాట్లు చేస్తాను . . . వచ్చే ఆదివారం మనం రిజిస్టర్ ఆఫీసుకి వెళ్ళి. . . "

"వద్దు . . . ఏదైనా కోవిలలో . . . "

"సరే . . . ముందు మీ నాన్నగారితో మాటాడిన తరువాతే నేను అన్ని ఏర్పాట్లు చేస్తాను. చివరకి అతని మనసు మారుతుందేమో?" అని శేషాద్రి తన తండ్రిగుంచి మాటాడగానే అతని జ్ఞాపకంతో మైత్రేయి మనసు అల్లాడింది. "నాన్నగారూ", "నాన్నగారూ" అని వెక్కి వెక్కి ఏడుస్తూ వంటగదికి పరుగెత్తింది.

ఆమె శోకం, దృఢమైన మనసు గ్రహించిన శేషాద్రి బయటికి వచ్చినప్పుడు వసారాలో శర్మని చూసి నిర్ఘాంతపోయాడు. కొంచెంసేపు అతన్ని చూస్తూ అలాగే నిల్చున్నాడు. ఆ తరువాత ఇంటి వెనుకతట్టుకి వెళ్ళాడు.

"స్వామీ, మిమ్మల్ని చూస్తే ఎలాగో కనిపిస్తున్నారే?" అని శర్మని సదానందన్ అడిగాడు.

"మరేం లేదు . . . కొంచెం తలనొప్పిగా ఉంది . . . రా, లోపలికి వెళ్దాం" అని శర్మఅతనితో ఇంటిలోకి ప్రవేశించారు. అతన్ని చూడగానే తడిసిన కళ్ళు తుడుచుకొని మైత్రేయి వంటగదినుంచి బయటకి వచ్చింది.

చాలాసేపు శర్మ మాటాడనేలేదు. అది గమనించి మైత్రేయి అతన్ని చూసి "ఇవాళ ఒదువార్ ఇక్కడ భోజనం చేస్తారా?" అని అడిగింది.

శర్మ తలెత్తి లోకప్పును చూస్తూ "ఓదువార్ లాంటి ఆచారనియమాలు పాటించేవారు, నేను, ఇక నువ్వు వండినదేదీ భుజించం. నువ్విక నీ పనులు చూసుకో!" అని కారమైన ధ్వనితో నిమ్మళంగా అన్నారు. ఆ తరువాత లేచి వెళ్ళి ఒక బుట్టలోనుంచి అంటిపళ్ళు, ఒక చెంబులో పాలు తనే తీసుకొనివచ్చి ఒక బెంచిమీద పెట్టారు.

"ఓదువార్! వెళ్ళి కాళ్ళు కడుక్కొని రా . . . ఇవాళ నీకు వ్రతం" అని శర్మ నెమ్మదిగా వాడికి చెప్పారు. అప్పుడు ఆ పక్కనే  గుండురాయర్ కనిపించగానే అతన్ని చూసి "రాయర్, కొంచెం సేపు తరువాత నీ ఇంట్లో ఉన్నాడే ఆ నాస్తికుడు - వాడితో బీచుకి రా . . . నేను వాడితో కొన్ని విషయాలు మాట్లాడాలి!" అని గదమాయించారు.

"సరే . . . తప్పకుండా . . . వస్తానులేండి " అని గుంపుగా బీచుకి వెళ్లే ఆతురతతో రాయరు లోపలికి పరుగెత్తారు.

తండ్రి మొహం చూడలేక చీకటిలో ఒక మూల కూర్చొని మైత్రేయి మౌనంగా ఏడుస్తూ ఉంది.

"నా అమ్మాయి వంటే నాకిష్టం" అని ఆ రోజు శర్మ అన్నమాటలు మైత్రేయి ఇప్పుడు గుర్తుచేసుకుంది. 'నా స్వార్థం వలన నేను నాన్నగారికి ద్రోహం చేస్తున్నానా?' అని కలవరపడి ఏడ్చినప్పుడు ఆమె వెక్కులు శర్మకి వినిపించాయి. కాని అతను లెక్కచెయ్యలేదు.

రాత్రి తొమ్మిది గంటలకి సదానందన్ని మైలాపూర్లో ఇంటికి పంపించేసిన తరువాత శర్మ మెరీనా బీచుకి వచ్చారు. మెరీనా బెంచుల మాద రాయరుతో

కూర్చొనివున్న శేషాద్రి మర్యాదగా లేచి నిల్చున్నాడు. మౌనంగా ఆకాశాన్ని చూస్తూ ఏదో ఆలోచిస్తున్న శర్మ గభీమని శేషాద్రితో మాటాడారు.

"ఇది నా అమ్మాయి గురించే! కాని మగవాళ్ళు మాటాడుతున్నప్పుడు అది చొరబడకూడదని ఇక్కడకి రమ్మన్నాను. . . " అని అతను అన్న మాటలు గుండురాయరుకి బోధపడలేదు.

"మీరేమంటున్నారు? నాకేం అర్థం కావటం లేదు!" అని అన్న అతని బోళాతనం చూసి శర్మకి కోపం వచ్చింది.

"నీకేం బోధపడుతుంది? నువ్వూ ఒక సరైన ఒక మగవాడే . . . నీ పెళ్ళాంని అడుగు!" అని శర్మ చిరచిరలాడగానే రాయరు మరేం బోధపడకుండానే నోరు మూసుకున్నారు.

కొంచెం సేపు మౌనం వహించి శర్మ మళ్ళీ మాటాడారు.

"నువ్వు నాస్తికుడైనా యోగ్యుడని నేను అనుకున్నాను . . . నీకు నాగురించి బాగా తెలుసు . . . నా కూతురుకి ఎటువంటి యపకుడుని పెళ్ళాడే అర్హతా, హోదా ఉన్నాయని నీకు తెలిసివుంటుంది. నువ్వు దాని మనసుని పాడుచేసి, నా దగ్గరనుంచి అపహరించడం న్యాయమా?"

శేషాద్రి జంకుతూనే, మెల్లగా, ముక్కుని రుద్దుకుంటూ, శర్మతో రాజీపడాలని మాటాడాడు.

"మీరు నన్ను అపార్థం చేసుకున్నారు. మీకు తెలియకుండా రహస్యంగా ఈ పని చెయ్యాలని నా ఉద్దేశం కాదు. ఇది మీకు ఇష్టంకాని పని అని నాకు తెలుసు. మా ఇద్దరికీ ఇష్టమైన ఈ సంబంధం - మా వయసుల ఆధారంగా - నెరవేర్చాలని మేం నిశ్చయించాం. గంగాబాయి, నా మిత్రులతో కలిసి వచ్చే ఆదివారం తిరునీర్ మలైలో జరగబోయే మా పెళ్ళి గురించి మీకు చెప్పాలని నేను వచ్చినప్పుడే రాయర్ అంకుల్ మీరు నన్ను పిలిచారని నాకు చెప్పారు."

"వీడికెంత సాహసం!" అని శర్మకి కోపం వచ్చింది. దాన్ని అణచుకొని తన కూతురు ఇచ్చిన ధైర్యమే అందుకు కారణం అనే భావనలో అతని నోటినుంచి ఏ మాటా రాలేదు. అతనికి ఏడవాలనిపించింది. "నేనెందుకు ఏడవాలి? నాకేం పోయింది?" అని నెత్తిని రద్దుకుంటూ అరిచారు.

"అవును, నాకేం పోయింది? ఒక పూట భోజనం - మనసార నాకు వడ్డించేది . . . ఇప్పుడేమో దాని మతి పోయింది! . . . కర్మ అంటే ఇదే! . . . ఇక నేను చేసేదేముంది?" అని అతను వాపోయారు.

"నేను మీ అమ్మాయిని అపహరించానని అపాపర్థం చేసుకోవద్దు. అది ఎప్పుడూ మీ కూతురుగానే ఉంటుంది."

"అది అసాధ్యం!" ఆని బిగ్గరగా శర్మ తలూపారు. "ఇక అది నా కూతురు కాదు! నేను దాన్ని ఎంత గాబరాగా పెంచాను!" ఆ పాపని తన భుజంమీద ఎత్తుకొని అన్ని ఊరులూ తిరిగిన ఆ పాతరోజులు అతను గుర్తుచేసుకున్నారు. "పాపి!", "పాపి!" అని తనలో గొణుక్కుంటూ శర్మ పళ్ళు కొరికారు.

"మేం ఏ పాపమూ చెయ్యలేదు. మీరు మీ పంతం మానుకొని మమ్మల్ని ఆశీర్వదించాలి. మీరిలా మీ నియమాలని అంగీకరించనివారిమీద మండిపడడం న్యాయంకాదు!" అని రెండు చేతులు జోడించి శేషాద్రి అన్నాడు.

"ఎంత ఘోరం! నా వంశంలో పుట్టిన పిల్ల . . . నా కడుపులో పుట్టిన పిల్ల . . . బ్రాహ్మణ కులంని పాడు చేస్తోందని నాకు బాధగా ఉంది. అంతే, మరేం లేదు!" అని శర్మ తువ్వాలుతో కళ్లు తుడుచుకున్నారు.

చాలా సేపు ఇద్దరూ మౌనంగా ఉన్నారు. శర్మని చూస్తూంటే శేషాద్రికి సంకటంగా ఉంది. కాని బ్రాహ్మణుడుగా పుట్టిన తన్ను నిరాకరించి, శర్మ తనకి కావలసిన బ్రాహ్మణుడు దొరకలేదని తన కూతురు జీవితం పాడుచెయ్యడం శేషాద్రి భరించలేకపోయాడు.

లేస్తూ, ఆఖరికి, శేషాద్రి నొక్కిమాటాడాడు:

"ఎలాగ చూసినా మేం చెయ్యదలచుకున్న పని సరే. మీరే తరచుగా అనేవారు ఆ మీ మను అలాగ అన్నాడు అని: 'ఏ బ్రాహ్మణుడైనా సరే, తన కూతురు యీడేరిన మూడు సంవత్సరాలలో ఆమెకి పెళ్ళి చెయ్యకపోతే, ఆ యువతి తనకి నచ్చిన వరుని తనే పెళ్ళితేసుకోవచ్చు'. అది విని శర్మ ఉలికిపడ్డారు. శేషాద్రి చెప్పినది నిజం, అతను కాదనలేరు. తను గౌరవించే శాస్త్రంలో ఒక సూత్రంమూలంగా తన నోరుని శేషాద్రి మూసేసాడని, ఆ నేరంకి తనకే బాధ్యత ఉందని గ్రహించి అతను మౌనం వహించారు. తరువాత, మెల్లగా, నిదానంగా

మాటాడారు: "ఏది జరిగినా అది దైవఘటన అని మనం సమ్మతించాలి. నేను మరచిపోయిన ఒక నిజంని, చేసిన ఒక నేరంని నువ్వు నాకు గుర్తు చేసావ్. మైత్రేయి చేసినది సరే. నేను దాన్ని ఎదిరించకూడదు. కాని దాన్ని నేను అంగీకరించాలని మను చెప్పలేదు. నా కూతురు అనే అర్హతని మైత్రేయి పోగొట్టుకుంది. పోనీలే, ఎవరో ఇద్దరు పెళ్ళిచేసుకుంటే నేనెలా దీవించుతానో, అలాగే మీ పెళ్ళికి నా ఆశీర్వాదం ఉంది" అని అన్నప్పుడు పితృభావం వలన అతను ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

"దయచేసి, మీరు వచ్చి . . . " అని శేషాద్రి లాగాడు.

"ఎక్కడికి?"

"తిరునీర్ మలైకి . . . "

"ఛీ, అది ఎన్నడూ జరగదు! అవును, నువ్వెందుకు అక్కడకి వెళ్తున్నావ్ . . . నీకు మతం, ఆచారం అంటే నమ్మకం లేదుగా? దాన్ని ఈడ్చుకొనిపోతే చాలదా?" అని శర్మ వెక్కిరింపుగా అడిగారు.

"దానికి నమ్మకం ఉంది, అవన్నీ కావాలి" అని క్లుప్తంగా శేషాద్రి జవాబు చెప్పాడు.

## 7

ఆదివారం ఉదయం, ఇంటిలో, ఒంటరిగా, తన గదిలో శర్మ కూర్చొనివున్నారు. అతని మనసు నిష్కళంకంగా ఉంది.

అవాళ ఉదయం గంగాబాయి ఆదరణ, శేషాద్రి ధైర్యంగా పలిగిన మాటలలో నమ్మకం ఉన్నాకూడా మైత్రేయి తన తండ్రిని దాటి వెళ్ళడానికి జంకింది. అతను నోరు తెరిచి ఒక మాటా అనలేదు. అతని కాళ్ళకింద పడి, నమస్కరించి ఆమె నిష్క్రమించిన దృశ్యం ఒక శోక నాటకమనాలి.

వాళ్ళతో వెళ్ళకుండా రాయరు శర్మతో ఇంట్లోనే ఉన్నారు.

శర్మగారి చిన్నబోయిన మొహం చూడడానికి భయపడుతూ రాయరు వసారాలో కూర్చొనివున్నారు. కిటికీనుంచి అతన్ని చూసి శర్మ లోపలికి పిలిచారు.

"మీరు వెళ్ళలేదా ఆ పెళ్ళికి?" అని అతను అడగ్గానే, రాయరు తడిసిన కళ్ళని తన రెండు అరచేతులతో తుడుచుకొని "లేదు" అని తల ఊపారు.

శర్మకి అతన్ని చూసి జాలి కలిగింది. "సరే, లేచి రండి" అని పిలిచారు. ఆ మాటకే ఇంతసేపూ కాచుకున్నట్టు రాయరు, ఏడుస్తున్న చంటి పాప తల్లి దగ్గరికి వెళ్తున్నట్టు, రెండు చేతులు జోడించి "నాకేం తెలియదు స్వామీ! ఇదంతా గంగాబాయి పని! అది మొండిగా ఉన్నప్పుడు, నేనేం చేస్తాను, చెప్పండి? తప్పు నాదే! నేనేకదా వాడిని తీసుకొని వచ్చాను? మీరు నన్ను క్షమించాలి! ఈ పెళ్ళి మీకు వ్యతిరేకంగా జరగడంలో నాకూ ఇష్టం లేదు, ఇలాగ జరుగతుందని నాకు తెలియదు!" అని బ్రతిమాలాడారు.

"సరేలేవయ్యా, దానిగురించి మరేం బాధ పడవద్దు . . . ఆడపిల్ల కదా, అది ఎవరితోనో ఒక రోజు వెళ్ళవలసిందే! . . . వాడూ ఏం తక్కువయినవాడు కాదు . . . నాకుగాని ఒక కొడుకు ఉండి, వాడొక నాస్తికుడుతో కలిసి చెడిపోయాడనుకో, నేను బాధపడివుంటాను . . . ఇది అమ్మాయేకదా? ఆడపిల్ల అంటే వట్టి భూమి అన్నమాట. 'మనం నాటే విత్తనంకి తగినట్టుగానే పంట' అని శాస్త్రం చెప్తోంది. ఆక్కడ జరుగుతున్న అదే ముహూర్తంలో ఇక్కడ ఒక దైవఘటన జరుగబోతుంది! నీకు తెలుసా? సదానంద ఓదువార్ని నేను బ్రాహ్మణుడుగా మార్చబోతున్నాను . . . " అని నిశ్చలంగా అంటూ శర్మ పక్కనే ఒక చిన్న మూటనుంచి జంధ్యం, హోమగుండంకి కావలసిన సామగ్రి బయటకి తీసారు.

"స్వామీ, ఇదేంటి? మీరు 'కలియుగం', 'కలియుగం' అని అనేవారు. అది మిమ్మల్నికూడా పట్టుకుందా? ఓదువార్ అబ్బాయిని బ్రాహ్మణుడుగా మార్చడమేమిటి?"

"నువ్వేం కేకలు పెట్టవద్దు! . . . నేను బాగా ఆలోచించి, మన శాస్త్ర, వేద, సంప్రదాయాలు పరీక్ష చేసే ఈ పని నిశ్చయించాను. నా నిర్ణయం చెప్పినప్పుడు ఓదువార్ కూడా నీలాగే అడిగాడు. వాడికి చెప్పిన జవాబే నీకూ చెప్తున్నాను. విను. నేను చేసేది బ్రాహ్మణ ధర్మంని పునరజ్జీవింపచేసే పని. పుట్టుకతోనే ఎవడూ బ్రాహ్మణుడు కాదని చాలామందికి తెలియదు. అంటే, ఒకడు బ్రాహ్మణ ఆచారాలు పాటించుతూ వచ్చాడనుకో, వాడి పుట్టుక ఆ స్థాయికి అడ్డు రాదనేకదా అర్థం? ఇది నేననలేదు. వసిష్ట మహరిషి నోటిలో 'బ్రహ్మరిషి' అని బిరుదు అందుకున్న విశ్వామిత్రుడు బ్రాహ్మణుడుగా పుట్టలేదు! కణ్వ మహర్షికూడా బ్రాహ్మణుడుగా

పుట్టలేదు, నీకు తెలుసా? వాళ్ళు బ్రహ్మ జ్ఞానం పొంది, బ్రాహ్మణ నియమాలు అనుష్టించి, బ్రాహ్మణులయ్యారు. మనం ఈ కలికాలంలో అవన్నీ మరిచిపోయాం! అందుకే సదానందన్ లాగ వేద శాస్త్రాలలో నమ్మకం ఉన్న ఒక బ్రహ్మచారిని బ్రాహ్మణుడుగా మార్చడం శాస్త్రంకి తగిన పని. నువ్వేం బాధపడవద్దు!" అని శర్మ చెప్తూంటే సదానందన్ స్నానం చేసి అక్కడకి వచ్చాడు.

వాడు పట్టు వస్త్రాలు ధరించిన తరువాత, హోమ గుండం ముందు వాడిని కూర్చోబెట్టి, మంత్రాలు వల్లించుతూ ఆచారక్రియలు నెరవేర్చుతున్న శర్మని వింతగా, చోద్యంగా చూస్తూ రాయరు నిల్చున్నారు.

ఆ తరువాత శర్మ వాడికి జంధ్యం తొడిగించి, పట్టు వస్త్రాల్లో వాడిని చేర్చుకొని, పూర్తిగా కప్పుకొని, వాడి చెవిలో గాయత్రీ మంత్రం ఉచ్చరించి, వాడికి బ్రహ్మోపదేశం చేసారు.

అతని మనసులో తన కులధర్మం నెరవేర్చిన తృప్తి, అది భవిష్యత్తులో వర్ధిల్లుతుందనే గర్వమూ చోటుచేసుకున్నాయి; కళ్ళలో కాంతి, ఆనందబాష్పాలు కనిపించాయి.

"నా తరువాత నా కులధర్మం అంతమవుతుందని నేను భయపడ్డాను. ఇది నసించిపోయే ధర్మం కాదు! ఇలాగే కలకాలం దీన్ని మహనీయులు రక్షించారు. నా కర్తవ్యం నేను నెరవేర్చేసాను!" అని శర్మ పెట్టి ఆవేశంతో ప్రలాపించుకున్నారు.

ఆ తరువాత అతని పాదాలలో పడి, నమస్కరించి, లేచిన సదానందన్ని కౌగిలించుకొని శర్మ అభిమానంతో మాటాడారు: "నువ్వు ఈ ఇంటికి అతిథిగా వచ్చావ్ - ఇక ఇది మనిద్దరికీ ఇల్లు. నా కూతురు తరువాత నేను నేనే వండుకొని భోజనం చెయ్యాలా అని ఆలోచించాను. ఇప్పుడు నువ్వు బ్రాహ్మణుడువు, నువ్వు వండు, నేను భోంచేస్తాను. నాకు తెలుసు - ఈ లోకం నిన్ను బ్రాహ్మణుడుగా అంగీకరించదు. అది సరేలే, నేనూ ఈ లోకంని అంగీకరించలేదు . . . "

అప్పుడే గండురాయరు, అలవాటుగా ఒక దొంగ నవ్వు నవ్వుతూ అడిగారు: "అలాగైతే, ఇతనికే మైత్రేయిని ఇచ్చి పెళ్ళి చేసివుండవచ్చుకదా?"

"రాయర్, నీకేం మతి పోయిందా? తండ్రి స్థానంలోనేకదా నేను వీడికి బ్రహ్మోపదేశం చేసాను? ఇప్పుడు వీడు నా కొడుకు!" అని శర్మ గర్వంతో కూతురుని పోగొట్టుకున్న దుఃఖం మరిచిపోయి మాటాడారు!

********

# స్ఫటికం

# స్ఫటికం

నేను చేసినది సరియేనా?

నా  ఆరాటం  తగ్గటం లేదు. అంతే కాదు; ఈ విశు మొహం చూస్తూంటే అది ఇంకా ఎక్కువగా పెరుగుతోంది . . .

మరి పెద్దలు ఊరకే అన్నారా - చోటు మారాటంగా ఔదార్యం చూపవద్దని? అనాలోచితంగా అందరినీ ఇంటిలోకి రమ్మని అనకూడదట! మరి నేనేం చేసాను? అది నా పొరబాటేనా? నా కలవరం, తడబాటు చూస్తూంటే  . . .

నా ఒళ్ళంతా చల్లబడిపోతోంది . . .

ఈ ముసలిదానికి ఈ శిక్ష ఎక్కువే . . .

అవును, ఇది ఎక్కువే!

ఇక నేను ఎవరిదగ్గర మొరపెట్టుకుంటాను? వినేవారు ఎవరున్నారు? నేను నాతో చెప్పుకోవలసిందే . . .  లేకపోతే ఆ గర్భగ్రుహంలో ఎవరికీ తెలియని అంధకారంలో ఉన్నాడే , ఆ దేవుడి దగ్గర చెప్పుకోవాలి. . . అదే నయం.

మనుష్యులుని నమ్మలేం . . .కళ్ళున్నా చూడరు; చెవులున్నా వినరు. ఇక నోరున్నా మాట్లాడరు . . .ఆ నిర్గుణ పరబ్రమ్మం - పంచ భూతాలని తన వశం చేసుకున్నాడే - వాడినే బ్రతిమాలాడాలి.  అప్పుడే నా మనసు కొంచెం కుదుటబడుతుంది . . .

వాడు వస్తాడా?

నేను ఈ ప్రశ్న అందరినీ అడగను, దేవుడినే అడగాలి. వాడు తిరిగి వస్తాడు అని అనడానికి నాకు ధైర్యం రావటం లేదు. నా మనస్సు మాటి మాటికి  ' వాడు రాడు' అని వారిస్తూవుంది.

ఏం, ఎందుకు?

ఐదేళ్ళ విశు కళ్ళు మూసుకొని పడుకున్నాడు, కాని నిద్ర పోవటం లేదు. బయట కుండపోతగా వర్షం కురుస్తోంది. అది వింటూ హాయిగా ఆనందించే వయసు. జీవితంలోని  లోతుపాతులు వాడికి తెలియవు. అప్పుడప్పుడు నన్ను ఏదయినా

రాజు రాణీ కథలు చెప్పమని అల్లరి చేస్తాడు. నేనుకూడా ఏదో ఒక కథ చెప్తాను. 'అదే జీవితం' అని వాడి కల్పన. వాడి మనసు మొలకెత్తని ఒక మొగ్గులాగ . . .

పిల్లవాడినీ, అమ్మాయిణ్ణినీ చూసినప్పుడల్లా నేను ఎలా బాధపడుతున్నానని ఎవరికీ తెలియదు. వారిద్దరిమీదా నాకున్న ప్రేమ, అభిమానంవలనే నేను దేవుణ్ణి తప్పుపెట్టడం లేదు. ఇదిగో విను: నువ్వు ఇల్లా దూరమమయిపోవడం సహించక నిన్ను జోరుగా తిడుతున్నాను కాని నా కళ్ళు నీ మొహాన్ని చూసిన మరు క్షణమే నా హృదయం కరిగిపోతుంది! ఎవరికి తెలుసు ఈ వింత?

వాడు వస్తాడా?

దేవుడా, వాడు రాడేమో?

వర్షం బాగా ఆగిపోయింది. ధారలుధారలుగా కారుతున్న వాన నీరు రోడంతా వ్యాపించింది. అప్పుడప్పుడు ఆకాశంలోనుంచి రాలి ఆకులమీద పడే చినుకుల శబ్దం వినిపిస్తోంది. లేకపోతే అంతా ఒకటే నిశబ్దం! ఎనిమిది గంటలతరువాత అగ్రహారంలో ఏం సందడి?

ఎదురింటిలో ఉంటున్న గోపాలచారి తమలపాకు నములుతూ కాండ్రించి వీధిలో తుప్పుతున్నాడు. రెండు ఇళ్ళు దాటి అజ్జి అవ్వ తమలపాకు, చెక్కలు రోకలితో దంచుతోంది. వీధి చివరన కక్కారి కరణం, వెంకట్ ఇంటి వసారాలో లాంతరు పెట్టుకొని పేకాట ఆడుతున్నారు. అప్పుడప్పుడు వాళ్ళ బొంగురు గొంతుకలు వినిపిస్తాయి, లేకపోతే ఊరంతా మట్టి నిద్రలో . . . .

వర్షం తగ్గినా చల్లని గాలి పోలేదు. తలుపు తెరుస్తే చాలు గాలి దూసుకొని ఇంట్లోకి వస్తోంది. ఇంటి పొరుగున ఉన్న దీపస్తంభంలోని హరికేను లైటు గాలిలో ఆరిపోయింది. నేను మెల్లగా తలుపు తెరిచి చూసాను; అరుగు ఖాళీగానే ఉంది - నా మనసులాగ. అక్కడే వాడు పడుకొంటాడు - తలనుంచి కాలు వరకూ ఒక దుప్పటి కప్పుకొని కనిపిస్తాడు . . .

" యజ్ఞం, యజ్ఞం, నిద్రపోతున్నావా?" అని అడుగుతాను. జవాబు రాకపోతే, "సరే, వాడు నిద్రపోతున్నాడు," అని చెప్పుకొని ఇంట్లోకి వచ్చేస్తాను.

ఇవాళ వాడు లేడు. అవును, వాడు మమ్మల్ని విడిచి వెళ్ళిపోయాడు . . .

అగ్రహారం అంధకారంలో మునిగిపోయింది. ఇక్కడా, అక్కడా ఎవరో మనుషులు వీధిలో నడుస్తున్నారు, నాకెవరూ తెలియదు. ఈ పక్కనే ఉన్న చాకలిపేటలో ఉన్న

శారదా టూరింగు టాకీసునుంచి సినిమా పాటలు వినిపిస్తున్నాయి. ఎవరో తటాలున కేకలూ, అరుపులూ పెడుతున్నారు. ఒక పిల్లవాడి ఏడ్పు కూడా వినిపిస్తోంది . .

నాకు మెల్ల మెల్లగా చాలా సంవత్సరాలముందు జరిగిన ఆ సంఘటన గుర్తుకి వస్తోంది. అవును, అవాళ కూడా నా మనస్సు ఇలాగే ఉండేది. అది కూడా ఒక రాత్రివేళ . . .

"ఏమండీ, మీ అరుగుమీద పడుకోడానికి కొంచెం జాగా ఇస్తారా?" అని ఎవరో పిల్లికూతలో నన్ను అడిగారు. చీకటిలో అతని మొహం కనిపించలేదు. 'సరే, ఎవరో బాటసారి కాబోలు,' అని నేను సరే అన్నాను, ఇంట్లోకి వచ్చేసాను.

ప్రొద్దుట తలుపు తీసి చూసాను. వాడు లేడు,

'ఎవరో బాటసారి, ఎవరికి తెలుసు? పోనీలే,' అని అనుకున్నాను.

ఆ ముందురోజు ఏకాదశి; అవాళ ద్వాదశి. నేను వంట ఆరంభించినవేళ వాడు మళ్ళీ ఇంటి గుమ్మం ముందు కనిపించాడు.

దట్టమైన ఉంగరాల జుత్తు - మన సుబ్బుణి లాగ. బాగా ఎదిగిన శరీరం. కళ్ళు లోతుగా కనిపించాయి. మాసిన పంచె. వాడి భుజాలమీద ఎవరో తొందరగా ఒక తువాలు పడేసారా అనిపించింది. వాడిని చూస్తే దుమ్మూ, ధూళి కప్పిపోయిన ఒక మైలురాయిలాగ ఉన్నాడు. కాని మొహంలో ఒక తేజస్సు . . .

వీడేనా గుమ్మంలో పడుకోడానికి నా అనుమతి అడిగాడు? నేను నమ్మలేకున్నాను.

వాడు అలాగే నిలబడి నన్ను చూస్తున్నాడు.

ఒక్కసారి గొంతు సవరించుకొని, ' నీకేం కావాలి?' అని అడిగాను, ధృఢంగా.

వాడికి మాట్లాడానికి కూడా బలం లేదోమో? ఒక చెయితో నోరుని తాకి పొట్టను చూపించాడు.

అవాళ ద్వాదశి అని చెప్పేనుగా? అతిథులను గౌరవిస్తే పుణ్యం వస్తుంది. వీడిని చూస్తే బ్రాహ్మనుడనిపించింది. పెరటిలో ఒక అరటాకు కోసాను. వాడిని లోపలికి రమ్మని పిలిచి అన్నం వడ్డించాను.

నాకు తెలుసు, ఊరిలో అందరూ నన్ను పిశినారి, జాలి లేని మనిషి అని అంటారు. నేను ఎవరికీ చనువివ్వను. ఎవరూ నాతో వ్యవహారం పెట్టుకోరు. వీళ్ళ గుసగుసలూ, వదంతులూ, గాలివార్తలూ, నాకు తెలియవా? ఐతేనేం, నాకెవరి

దయా, సానుభూతి అక్కరలేదు. నాకు సాలియమంగళంలో భూములూ, పంట పొలాలూ ఉన్నాయి. సంవత్సరానికి 250, 300 లిటర్లు ధాన్యం వస్తోంది. దాన్ని రెండెద్దుల బండీలో తెచ్చి గాదెలో పోసి, మూయడానికి నౌకరులున్నారు. ఈ ఇల్లు వంశపారంపర్యంగా నాకు వచ్చింది. రెండు పెద్ద వాకిలీలు ఉన్నాయి. పెరడులో రెండు పెద్ద చింత చెట్లు. వైసాఖ, జ్యేష్ట మాసాలలో కొమ్మల నిండా చింతకాయలు కాచి వాటి బరువున సేల వాలుతాయి, ఈ కుర్ర వెధవలు రాళ్ళు విసిరి ఆ కాయలు దొంగలాడిన తరువాత మిగిలినవి ఒక కులుకుతో రెండు మూడు గోనె సంచుల్లో రొప్పవచ్చు. అవి అమ్మితే నాకు ఆదాయం వస్తుంది. నేను ఎవరికీ అప్పు ఇవ్వను. ఎందుకు ఇవ్వాలి? వాళ్ళు నాకు తిరిగి ఇస్తారా? నేనెందుకు వాళ్ళ వెనక పరుగెత్తాలి? వీళ్ళందరూ పనికిరాని మనుషులు! నాకు మిత్రులూ, శత్రువులూ ఎవరూ వద్దు! నాకు వీళ్ళతో ఎటువంటి సంబంధమూ వొద్దు!

నేను ఏదో చెప్పడానికి వచ్చి మరేదో అంటున్నాను; నేను చెప్పదలచుకున్నది ఇది .

వాడు ముందు ఇంటి అరుగులో నిద్రపోవడానికి అనుమతి అడిగాడు; ఆ తరువాత తిండి కావాలన్నాడు. ఈ రెండురోజుల పరిచయంతో నాకు వాడిగురించి ఏమిటి తెలుసు? ఎవడో బాటసారి అనుకున్నాను. కాని మూడవరోజు జరిగిన సంఘటన ముఖ్యం. నేనెందుకు వీడిని, ఎదురింటిలో గురువుల వసారాలో అలసిపోయి కూర్చున్నవాడిని, తప్పనిసరిగా పిలవాలి? భగవంతుని రాతలో మేమిద్దరం ఇలా డీ కొట్టుకోవాలని ఉంది; ఇది ఈ జడ్డికి ఎలా బోధపడుతుంది చెప్పండి?

నేను ఇంటి గుమ్మంలో నిలబడి వాడిని చూసాను; వాడు వెంటనే లేచి నిలబడ్డాడు - నా ఆజ్ఞ కోసమా అని. వాడు తికమకలు పడుతూంటే నేను రమ్మని పిలిచాను. వాడు నవ్వుతూ వచ్చాడు. నేను పెరటిలో ఒక విస్తరాకు తీసి సాంబారు, కూరలూ వడ్డించాను.

"ఇంతే ఉంది," అని చెప్పి, "భోంచేసిన తరువాత ఈ రెండు గిన్నెలు తోము," అని అన్నాను. వాడు సరే అని తల ఊపాడు.

తిండికి మొహం వాచినట్లు ఆకులో ఉన్నదంతా త్వరలో ఖాళీ చేసేసాడు. మంచి కణ కణ ఆకలి అనుకుంటా.

ఆ మూడవ రోజు ముఖ్యమని చెప్పానుగా? అవును, అది చాలా ముఖ్యమైన రోజు . . .

నేను వాడిని రెండు గిన్నెలు మాత్రం తోమమన్నాను. వాడేమో గిన్నెలు బాగా శుభ్రం చేసి, నుయ్యినుండి ధార ధారగా నీళ్ళు రెండు పెద్ద బిందెలలో నింపాడు.

"ఏమండీ, మీకు మరేం కావాలి?" అని నన్ను అడిగాడు. నేను ఆ మాటలు ఇంతకు ముందు ఎప్పుడూ వినలేదు. వాడి సాయం నాకు చురుకుగా పని చెయ్యడానికి ప్రోత్సాహం ఇచ్చింది.

ఇవాళకి ఎనిమిది రోజులయ్యాయి; నేను గాదెనుంచి ధాన్యం దించి పది పదహేను లిట్టర్లు రైసు మిల్లుకి తీసుకువెళ్ళమని మరియమ్మాకు చెప్పాను; నాలుగు రోజులుగా అది కనిపించలేదు. ఎవరో చెప్పారు అది బంధువుల పరామర్శకి వెళ్ళిందని. అంటే అది తిరిగి వచ్చినవరకూ నేను కాచుకొని ఉండాలా?

వీడు 'సాయం చేస్తాను' అని అంటున్నాడు. నేనూ వీడితో మిల్లుకి వెళ్ళవచ్చుగా?

నాకేమో అడగడానికి భయంగా ఉంది; కాని చివరకి అడిగేసాను, వాడూ సరేనన్నాడు.

"మనం రెండు నడకలు వెళ్ళి రావాలి," అని నేను చెప్పాను. "గోపాలచారి పెరడు నుంచి కాలిబాటలో నడిచి శివుని గుడి గోడ దాటి వెళ్ళాలి." కాని అది అనవసరం.ఆ మిల్లునుంచి వచ్చే రోత ఎనిమిది గ్రామాలికి వినబడుతోంది. మనకి దారి సులభంగా కనిపిస్తుంది.

వాడు మంచి సమయంలో సాయం చేసాడు. అందువలనే ఒక మనిషికి ఇంకొక మనిషిమీద మమకారం కలుగుతుంది.

మన మనసూ మన క్రియా పొందులో ఉంటేనే మనం ఇతరుల గురించి చేసే తీర్పు సరి అని నమ్మగలం.

వాడి వినయం, సాయపడే భావం, ఆఖరికి సాధించిన విధం: ఇవన్నీ నా మనస్సులో నిలిచిపోయాయి. నాకు వాడిమీద అభిమానం కలిగింది.

నేను వాడికోసం ప్రత్యేకంగా ఏదీ వండటం లేదు; ఇది నాలుగు రోజుల ముందు సంగతి. కాని ఇప్పుడో . . .  బియ్యం నీళ్ళలో జాడించినప్పుడు నేను కొంచెం ఆగి నన్నే అడుగుతాను  . . . వాడికోసం ప్రత్యేకంగా  వండాలా?

రెండు పిడికలు ఎక్కువ కలిపాను . . .  అన్నం ఉడికిన తరువాత కొంచెం మీదకి లేచింది .. . .

నేను ఎందుకు వాడికోసం వండాలి? అవును, ఎందుకు వండాలి?

నేను ఈ ప్రశ్న ఎవరిని అడుగుతాను? నన్నే అడుక్కోవాలి . . . .

వాడు రోజు మా ఇంటి వసారాలో నిద్రపోతాడు. తెల్లవారడానికి ముందే నీళ్ళలో పేడ కలిపి ఇల్లూ వాకిలీ శుభ్రం చేస్తాడు. గ్రామంలో ఉన్న చెరువులో స్నానం చేసిన తరువాత ఆ తడిబట్టలతోనే కోవిలకి వెళ్ళి ప్రాకారంలో గోచీతో నిలబడి ఎండలో తన జుత్తూ, బట్టలూ ఆరేసుకుంతాడు. తొందర తొందరగా బట్టలు తొడుక్కొని ఆ కోవిలపక్కనే ఉన్న తోటలోని పువ్వులు తన తువ్వాలుతో ఏరుకొని, కోవిలకి వెళ్ళి, వాటిని దారంలో గుచ్చుతాడు. ఒక రోజు దండని వినాయకుడికి, ఇంకొక రోజు సుబ్రమణ్య స్వాములకి, ఇంకొక రోజు నంది దేవుడి మెడలో చుట్టుతాడు.

వాడిని కోవిలలో చూసినవాళ్ళు వాడిగురించి మాట్లాడడం నేను విన్నాను. వాడు ఎవ్వరితోనూ ఎక్కువగా మాటాడట.

** ** **

"నీ పేరేంటి?"

ఒక రోజు వాడు భోజనం చేస్తూంటే నేను అడిగాను. అది మా పరిచయం అయిన నాలుగు రోజుల తరువాత.

" యజ్ఞం," వాడు పరిశేషణం చేస్తూనే సమాధానం చెప్పాడు.

"నీదేం ఊరు?"

"కుంబకోణం."

"నీకెవరున్నారు?"

వాడు అడ్డంగా తల ఊపాడు.

"నాకు నీ తల ఊపడం అర్థం కావటం లేదు . . ."

"అమ్మమ్మగారూ, నాకు ఎవరూ లేరు. నేను అనాధ. మా నాన్నగారు హఠాతుగా వాతరోగం వచ్చి, రోడ్డులో కారుముందు పడి పోయారు, మా అమ్మ అతనికి ముందే పోయింది."

"ఓ, అలాగా? . . పాపం . . . మరి నువ్వు కుంబకోణంనుంచి ఎలా వచ్చావ్? అక్కడ ఎలాగ కాలక్షేపం చేసేవ్??"

"నా సొంత ఊరు మాయవరం . . . కాని నేను పెరిగినదంతా కుంబకోణంలోనే . . "

" . . . పెరిగినదంతా అంటే?"

"మా నాన్నగారు పోయినతరువాత నేను కుంబకోణం వచ్చాను."

నేను మరేం అడగలేదు. ఆ రోజుకు అది చాలు అనుకున్నాను.

వాడు భోజనం ముగించి, లేచి, విస్తరాకు తీసి, నిలబడ్డాడు.

మంచి సంప్రదాయం, సంస్కారం ఉన్న మనిషి. ఎప్పుడూ నుదుటమీద వీభూతి, దాని మధ్య ఒక చిన్న బొట్టు. తలంతా ఒకటే జుత్తుమయం; జడలు అల్లుకొనే అందంలో ఒక ప్రత్యేక ఆకర్షణ. అబ్బాయి మంచివాడు. ఆ విశ్వాసం నా గుండె నిండా ఉంది.

** ** **

ఇక కోవిలలో యజ్ఞంకి చాలా బాధ్యతలు ఉన్నాయి: సాయంకాల పూజలో గర్భ గృహంలో ఉన్న పూజారికి అన్ని వసతులూ ఏర్పాటు చెయ్యడం; దర్శనంకి వెళ్ళే మార్గంలో ఉన్న దీపాలన్నిటినీ శుభ్రం చెయ్యడం. అంతేకాదు, దీపారాధన సమయంలో యజ్ఞం కూడా పూజారితో కలిసి మంత్రాలు చెప్తాడట. వాడిగురించి అందరూ చెప్పే సంగతులు - అవి సాధరణమైనా - నాకు చాలా గొప్పగా అపురూపంగా వినిపించాయి. వాడిని ఎవరు పొగడినా, నాకు అది ఒక గర్వ కారణంగా అనిపించేది. ఇంతకీ, వాడు ఎవడు? మా ఇంటి వసారాలో నిద్రపోయే మనిషి. నేను ఏది ఇచ్చినా తృప్తిగా భోజనం చేసే మనిషి, అంతే. మా ఇద్దరికీ మరేం సంభంధం లేదు. కాని ఇతరులు వాడిగురించి మాట్లాడడం నాకు సంతోషంగా ఉంది.

"నువ్వు కుంబకోణం శాస్త్రుల దగ్గర ఎన్ని సంవత్సరాలు గడిపావ్?"

"ఐదారు సంవత్సరాలు . . ."

"అక్కడ ఏం చేసావ్?"

"శాస్త్రిగారి గుమ్మంలో పడుకొని కావేరిలో స్నానం చేసేవాడిని. అతనితో తద్దినం, మాసికాలకి వేళ్ళేవాడిని. అతను పూజలూ, పునస్కారాలకి ఏ ఊరుకి వెళ్ళినా నేను అతనితో ప్రయాణం చేసేవాడిని. అతనే నాకు మంత్రాలు నేర్పారు. కొన్ని మంత్రాలు నేనే నా ప్రయత్నంలో నేర్చుకున్నాను. వేదపారాయణం అతనే నాకు నేర్పారు. నేను కూడా తక్కిన పురోహితులతో వేదం వల్లించడం ఆరంభించాను. అది ఎంత భాగ్యం!అది నా ముత్తాతలు నాకిచ్చిన వరప్రసాదం! నేను వేద పాఠశాలలో చదివినది తక్కువే. నేను అక్కడ ఏమైనా నేర్చుకున్నాను అని అంటే అది పచ్చ అబద్ధం. అక్కడ అన్ని వసతులూ ఉన్నాయి. మంచి భోజనం. నేను ఇద్దరి తిండి తిన్నాను. ఆ తరువాత నన్ను అక్కడనుంచి వెళ్ళగొట్టారు. నేను శాస్త్రిగారి ఇంటికి వచ్చేసాను. అప్పుడుకూడా అతని దగ్గర ఎక్కువ రోజుల వాసం అనే తలపు రాలేదు. నేను చదివినది నాలుగో క్లాసు, మరి నాకు ఎవరు ఆదరణ ఇస్తారు చెప్పండి? కాని అప్పుడే ఒక ఎదురుచూడని సంఘటన జరిగింది. శాస్త్రిగారికి నా మీద అభిమానం ఎక్కువైంది. అతని అమ్మాయి కోమళికికూడా నేనంటే ఇష్టం . . . .

ఇందులో ఆశ్చర్యం ఏమంటే శాస్త్రిగారు నన్ను తన అభిమాన శిష్యుడుగా అంగీకరించారు."

** ** **

నేను యజ్ఞం కథలు వినడం వాడు భోజనం చేసేటప్పుఢే . . .

వాడు ఒక రోజు నన్ను అడిగాడు:

"ఏమండీ అమమ్మగారూ . . . మీరు నామీద ఇంత ప్రేమ చూపిస్తూ రోజూ అన్నం వడ్డిస్తున్నారు కదా, రోజు రోజుకి నా అప్పు పెరిగిపోతుంది . . . మరి నేను ఈ ఋణం తీర్చడం ఎలాగ?"

అది నాకు అర్థం కాని ప్రశ్న! ఒక క్షణం నా నోటినుంచి ఏ మాటా రాలేదు. యజ్ఞం మీద నా సానుబూతి మితిమీరి పోయిందా? నాకు తెలుసు, ఊరిలో అందరూ ఏమంటున్నారో? 'చూడవోయ్, ఈ ముసలిదానికి ఎంత భ్రాంతి! వీధిలో పోయేవాడిని పిలిచి శాస్వతంగా తన అతిధిగా చేసేసింది. ఈవిడ ఉండేది ఇక ఎన్ని రోజులో? ఇదేం పిచ్చి?' అని. నాకు తెలుసు. గోపాలచారికి పెద్ద నోరు, కాని మనిషి మంచివాడే. అతనికి నామీద ఎటువంటి ద్వేషమూ లేదు.

నేను యజ్ఞంకి ఏం చెప్పానో తెలుసా?

"తక్కినవాళ్ళు నీ గురించి ఏం చెప్పినా నాకు లెక్క లేదు. నువ్వు నన్ను బాగా అర్థం చేసుకొని నాకేం కావాలో అది ఇస్తున్నావు. నాకే ఒక కొడుకు ఉంటే వాడు నీకంటే గొప్పగా చూసుకుంటాడా?"

నా మాటలు విని యజ్ఞం కళ్ళు చెమ్మగిల్లాయి.

"అమ్మమ్మగారూ, నేను చాలా అథృష్టవంతుడిని. నేను కుంబకోణం వదిలి ఒక నెల మాత్రమే అయింది. నిజం చెప్పాలంటే నేను ఇంత దూరం నడిచే వచ్చాను. కాళ్ళు నొప్పి పట్టితే నేను బాధ పడలేదు; కాని మనసు ఉందే, అది బాధ పడడం భరించలేను . . ."

"ఏమంటున్నావ్?

"నేను నా మానసిక బాధ గురించి చెప్తున్నాను."

పాపం, వాడి కళ్ళు తడిసిపోయాయి. ఎవరు ఈ అబ్బాయిని ఏమన్నారో? మరి 'నా' అని ఎవరూ లేదు కదా?

ఆ రోజు కోమళి అనే పిల్లగురించి వీడు చెప్పలేదూ? వీళ్ళిద్దరి మధ్య ఏమైనా జరిగిందా? కాని అబ్బాయి మంచివాడిలా కనిపిస్తున్నాడు; ఏ తప్పూ తంటాకి వెళ్ళడు అనే నా నమ్మకం. ఇందులో ఏదో మర్మం ఉంది. వీళ్ళ ఇద్దరిలో ఎవరో ఒకరు దీనికి కారణం. నాకు అడగాలని తోచింది; అడిగేసాను.

"నీ మనస్సు అంతగా కుంచిపోవడానికి అక్కడ ఏం జరిగింది? నువ్వు అవాళ కోమళి అనే అమ్మాయిగురించి చెప్పావు. ఆమె అందుకు కారణమా?"

వెనాకాడకుండా యజ్ఞం అవునని ఒప్పుకున్నాడు; నా ఊహ సరే అని నేను కొంచెం గర్వపడ్డాను కూడ.

"ఇందులో నా తప్పేం లేదు," అన్నాడు యజ్ఞం. "నాకెప్పుడూ నా హోదా, నా అంతస్తూ, నా గౌరవం బాగా తెలుసు. నా అర్హత, యోగ్యత మీరి నేను ఎదీ ఎదురుచూడను. ఇవాళా రేపూ బ్రాహ్మణల గుంపులో చేరి మంత్రాలువల్లించడంవలనే నాకు ఈ పొగడ్తలూ, మర్యాద అన్నీ. ఈ మాసికాలూ, తద్దినాలూ జరిగే సమయాల్లో మంత్రాలు అక్షరశుద్ధిగా, ఖచ్చితంగా చెప్పాలి. అప్పుడే మనకి పెద్దల మర్యాద, బహుమానం దొరుకుతాయి. లేకపోతే రెండణాలు ఇచ్చి పొమ్మంటారు. పెద్దలతో కలిసి మనం వేద పారాయణం చేసినప్పుడు బుకాయించ కూడదు, వదురుబోతుతనం కూడదు. నోరు మూసుకొని వాళ్ళు ఎది

ఇచ్చినా అది మర్యాదతో తీసుకోవాలి. అప్పుడే మా గురువుగారు నాకు తదనుకూలమైన అవకాసాలు  ఇస్తారు. నాకు తెలిసినది తక్కువ; నేను సంపూర్ణంగా వేదాభ్యాసం చెయ్యలేదని నాకు బాగా తెలుసు. మరి నేనెలాగ ఈ గొంతిమ కోరికలకి ఆశపడతాను చెప్పండి . . . ఇదే  నా జీవితంలో అన్ని అంశాలకీ ఆధార సూత్రం. ఇక నాకంటే ఉన్నత స్తితిలో ఉండే కోమళి కోరికని నేను పూర్తి చెయ్యడం ఎలాగ?"

నేను యజ్ఞం మొహం చూస్తూనే ఉన్నాను. వాడు పూజలో మంత్రాలు వల్లించినట్టు - తన మనసులో ఏదీ దాచకుండా - నిష్కపటమైన గొంతుతో చెప్తున్నాడు . . .

"కోమళి కుంబకోణం కాలేజిలో చదువుతోంది. మంచి అందగత్తె. కుంబకోణం శాస్త్రులు పారంపర్యగా ఉపాధ్యాయులు; ఐనా కూడా అతనికి మంచి లోకపరిచయం ఉంది. అతనికి వేరే పిల్లలు లేరు. కోమళిని  చాలా ముద్దుగా పెంచారాయన. కోమళికి మంచి అందమూ, తెలివి తేటలూ ఉన్నాయి . . ."

"యజ్ఞం, నీకేం తక్కువ?" అని నేను వాడిని ఆపాను. "ఆస్తి, అంతస్తు మరిచిపోతే నీలాంటి  మనిషి కనిపించడం అరుదు. సరే, చెప్పు . . .  తరువాత ఏమైంది?

"ప్రారంభంలో కోమళి నాపై చూపిన ఆదరణ, సానుభూతి, మర్యాద  అని నేను తప్పార్థం చేసుకున్నాను. నేను మనస్సులో నాగురించి బాధపడుతున్నానని కోమళికి నా మీద జాలి అని అనుమానించాను. కాని తరువాతనే అదేం  నిజం కాదు అని నాకు బోధపడింది .

ఒక రోజు మంచి వర్షంలో చిక్కుకొని నాకు జలుబు పట్టేసింది. ఆ రోజు స్వామిమలైలో ఒక పెళ్ళి; నేను శాస్త్రిగారితో ఆ పెళ్ళికి వెళ్ళలేదు. "ఎంత దురదృష్టవంతుడు వీడు! ఇలాంటి మంచి ముహూర్తంలో వీడి గతి ఇలాగ!" అని గురువుగారు నన్ను తిట్టారు. "నేను లేనప్పుడు ఇల్లు బాగా చూసుకో. ఇది మూడు రోజుల పెళ్ళి. నేను నాలుగు రోజుల తరువాత తిరిగి వస్తాను. వీటి అన్నిటికీ పెట్టి పుట్టాలిరా," అని అంటూ అతను వేరే శిష్యులతొ వెళ్ళిపోయారు.

నేను మాత్రం ఒంటరిగా ఉండిపోయాను.

అది చాలా పెద్ద ఇల్లు. పెరడులో యాభై కొబ్బరి, పోకకాయి చెట్లు ఉన్నాయి. "ఒరేయ్, దుప్పటి కప్పుకొని అస్తమానం మంచంలో నిద్రపోకు. ఆ పోకకాయల్లో మంచివీ, చెడ్డవీ, తీసి గోనె సంచెలో పెట్టు," అని అతను చెప్పి వెళ్ళారు.

అతను వెళ్ళి రెండు రోజులయ్యాయి. మూడవ రోజు, సాయంకాల పూజ ఐన తరువాత నేను నేలమీద పడిన పోకకాయలు చూసాను.

కోమళి వచ్చి పెరడులొ నిలబడడం నేను గమనించ లేదు. అవాళ వాళ్ళ కాలేజి నాలుగు గంటలకి మూసేసారు. కొన్ని రోజులుగానే నాకు కోమళి చేష్టలూ, చూపులూ, వింతగా కనిపించడం గుర్తించాను. దేనిగురించి నేను ఎప్పుడూ కల్పనకూడా చెయ్యలేదో, దానిగురించే కోమళి నాకు మెల్ల మెల్లగా బోధిస్తోంది. ఆమె జాడగా తెలిపే సందేశాలు నేను లెక్క చెయ్యలేదు; కాని అందువలనే ఆమె మొండితనం ఎక్కువయింది. నేను కొన్ని పోకకాయలు చెయ్యిలో తీసుకొని ఆమె దిశలో నడుస్తూంటే కోమళి తన చెయ్యి చాపడంతో నేను ఆగాను. ఆమె వెంటనే నా చెయ్యి బాగా పట్టుకుంది. పోకకాయలు కింద వాలాయి.

"ఇదేంటి?"

నాకు ఆమె ప్రవర్తన నచ్చలేదు.

"ఇవి పోకకాయలు," అని కోమళి తన వేళ్ళని నేలమీద చూపించింది.

చీకటి మెల్ల మెల్లగా వ్యాపించడం నేను గమనించాను.

మేమిద్దరం పెరడులో నిలబడి ఉన్నాం. గాలి బాగా విసురుతోంది. నేను 'కోమళి ఎంత అందగత్తె!' అని దాన్ని చూస్తున్నాను. నాలో ఆమె చూసేది ఏమిటి? దానికి నాకు ఎటువంటి అర్హతా లేదు అని నిశ్చయించాను. నన్ను సర్దుకొని అలాగే నిలబడ్డాను. హఠాత్తుగా కోమళి నా చేతులు లాక్కొని ఏడవడం ఆరంభించింది. దానికి ఏ మాటలూ రాలేదు. నాకూ అంతే . . . "సరే, ఇక ఇక్కడ ఉండకూడదు," అని పరుగెత్తాను. నా జ్వరం - కొంచెం ముందు తగ్గినది - మళ్ళీ త్వరగా నా దేహమంతా కప్పేసింది. దోషం చేసిన ఆవేదనతో నా ఒళ్ళు వొణుకుతోంది. కోమళి చూపులూ, చేష్టలూ ఇంత తీవ్రంగా నన్ను బాధిస్తాయని నేను ఎదురుచూడలేదు.

"నీకు నేనంటే ఇష్టం లేదా?" అని అమె స్పందన ధ్వని నాకు వినిపించింది. నా పక్కనే వచ్చి నిలబడింది. నాకేం చెప్పాలో అర్థం కాలేదు.

నేను తటాలున అమెను అడిగాను:

"కోమళి, నాకు ఇదేం బోధపడటం లేదు. నీకు ఎందుకు నా మీద ఇంత ఆసక్తి? నాలో ఏముందని?"

"మనం ఏ వస్తువు, మనిషి చూసినా దానివలన మనకి కలిగే ఆకర్షణ లేక అయిష్టతకి మన మనసే కారణం," అని కోమళి నాకు పాఠం చెప్పడం ఆరంభించింది. "మనం ఎది చూసామో అదే మన మనసుకి మొలక, ఆధారం. ఐతే మనసు అనేది ఎప్పుడూ మారుతునే ఉంటుంది. చూపులో మనం అనుభవించేది ఆకర్షణ అంటే ఇక మనసు ఎటువంటి వ్యామోహానికీ అడ్డు చెప్పదు." నాకు కోమళి వాదం పూర్తిగా అర్ధమవకపోయినా ఆమె ఆలోచన దృఢమైనది అని బోధపడింది.

"మనం ఎది చేసినా మన చూపుబట్టే అది తప్పు లేక సరి అని నిశ్చయించుకోవాలి' అని నీవంటున్నావు," అని నేను వివరించాను. "ఐతే మన కళ్ళు చూసేదంతా సరి అని మనం భేదాలు చూడకుండా ప్రవర్తిస్తే ఈ మనసు చెత్త కుప్పగా మారిపోతుంది. కోమళీ, మన కళ్ళూ, మనసూ రెండూ కలిసి పని చెయ్యాలి." నేను ఈ మాటలు ఆలోచించి చెప్పలేదు. అవి ఎలాగో ఇంకొక యజ్ఞం రూపంలో నా నోటిలో వచ్చినట్లు నాకనిపించింది.

"మనం కళ్ళు తెరిచి చూసేది మన మనసుని బట్టి ఉంటుంది," అని నేను మళ్ళీ చెప్పాను. "మన కళ్ళూ, మనసూ రెండూ తమ తమ కార్య భారాలు తీరుస్తాయి. కాని ఆఖరికి మన మనసే మనం ఏంచేయాలో నిర్ణయించాలి. కళ్ళ ద్వారా ఒక వస్తువు, మనిషిమీద ఆసక్తి వస్తే మనసు వెంటనే దాన్ని అంగీకరించాలని అపార్ధం చేసుకోకూడదు. ఈ భేదాలు అర్ధం చేసుకోలేని మనసు తికమకలుపడుతుంది."

"కళ్ళు మాత్రం కాదు, నా మనసు కూడా నువ్వు కావాలంటోంది,"

ఆమె మాటలు అర్ధం చేసుకోడానికి నేను భయపడ్డాను. నేను చిరునవ్వు నవ్వాను: ఎందుకు?? కోమళి మాటలు లక్ష్యం చెయ్యలేదు అని చెప్పాడానికి కాదు, లేక పోతే నాకు అన్నీ బోధపడ్డాయి అని చెప్పడానికి కాదు. ఎది ఏమైనా సరే కోమళి వ్యామోహానికి నేను లొంగకూడదు; ఆమెది ఒక  విపరీత బుద్ధి. అది విశ్వరూపం ధరించే ముందు ఇక్కడినుంచి నేను తప్పించుకోవాలి. అప్పుడే నాకు నా పేరూ, ప్రతిష్టా దక్కుతాలయి.

"కోమళీ, నీకు మంచి భవిష్యత్తు ఉంది. నువ్వు సంతోషంగా నువ్వు కోరే భర్తతో జీవితం గడపాలని నా ఆశ. నువ్వు బాగా చదువుకున్నదానివి; నీ అంతస్తుకి తగిన

భర్త నీకు దొరుకుతాడు. ఇక నా సంగతి చూడు: నాకు ఎవరూ లేరు. నా నివాశం మీ నాన్నగారి ఇంటి వసారాలో. నా జీవితం ఇంకా కుదుటపడలేదు. పిచ్చిక ఎప్పుడైనా డేగగా మారగలదా చెప్పు! నేను భోంచేసేది మీ నాన్నగారి కరుణవల్ల నువ్వు వడ్డించే అన్నం. నేను కట్టుకొనే పంచె ఎలా వచ్చిందో తెలుసా? మీ నాన్నగారి పుణ్యమాఅంటు అతనితో వెళ్ళిన నాకు దొరికిన బహుమతి. అది కూడా మీ నాన్నగారు 'సరే తీసుకోరా,' అని చెప్పినతరువాతే పుచ్చుకుంటాను.ఈ మూడు తప్పితే నా జీవితం శూన్యం. నా మీద మమకారం చూపే ఈ ప్రపంచం వెర్రితనం చూసి నేను నాలోనే నవ్వుకుంటాను."

కోమళి ఇంకా ఏడుస్తూనే ఉంది. నేను సంధి కోసం పెద్ద అడుగులు వేసుకుంటూ హనుమాన్ ఘాట్ కి వెళ్ళిపోయాను. ఎలాగో కోమళి దగ్గరనుంచి తప్పుకున్నాను, అదే నాకు కావాలి.

** ** **

"అమ్మమ్మ . . . అమ్మమ్మ . . . ."

విశు నన్ను పిలుస్తున్నాడు. మంచి హరికధ వింటుంటే ఎవరో తటాలున ఆపినట్టనిపించింది. ఇంకా కొంచెం నిలబడి చీకటిలో మునిగివున్న అగ్రహారం చూడాలనిపించింది.

యజ్ఞం నాకు ఎన్నో సంగతులు చెప్పాడు; నేను వాడికి చెప్పవలసినవి ఎన్నో ఉన్నాయి.

ఇప్పుడు నన్ను అమ్మమ్మ అని పిలిచాడే విశు, వాడు మా ఇద్దరినీ జోడించే గొలుసులో ఒక కొక్కెం.

నేను లోపలికి వెళ్ళాను. వంటగది ముందు సావిడిలో గోడ పక్కన తిరగలి మీద ఒక లాంతరు, పక్కనే కొన్ని చిమ్మటులు, తెల్ల చీమలు, రెక్కలు వాలిపోయి నేలమీద కనిపించాయి.

"ఏంరా, నువ్వు ఇంకా నిద్రపోలా?"

"అమ్మమ్మా, నాకు భయంగా ఉంది."

"ఎందుకురా భయం? నువ్వు మగపిల్లవాడివి . . నిద్రపో . . . నేను ఇక్కడే ఉంటాను . . ."

పిల్లవాడు బిగువుగా కళ్ళు మూసాడు; నేను వాడిపక్కనే వెళ్ళి కూర్చున్నాను. ఒక చెయితో నన్ను పట్టుకొని ఇంకొక చెయిలోని బొటనవేలుని తన నోటిలో పెట్టుకొని చప్పరిస్తున్నాడు. వాడికి ఐదేళ్ళు నిండినా కొన్ని పదాలు రావటం లేదు. 'ర' అని అనలేడు; అది ఎప్పుడూ 'ద' పే.

కొన్ని రోజులుగా వాడికి వాళ్ళ నాన్నగారి జ్ఞాపకం వస్తోంది. "అమ్మమ్మా, మనం విశాలక్షి కోవిలకి వెళ్దాం, నాన్నగారిని చూద్దాం," అని నన్ను చికాకు పెడతాడు. అది భరించలేక ఒక సారి వాడితో వెళ్ళాను. వాడు కోవిలలో అడుగు పెట్టినవెంటనే "నాన్నగారూ, మీరు ఎక్కడున్నారు?" అని అరిచాడు. నాకు గుండె పగిలినట్లు దుఃఖం ముంచుకొని వచ్చింది. "నాన్నగారిని పిలిచాను, ఆయన రావటం లేదు," అని విశు గొణుక్కున్నాడు.

** ** **

"యజ్ఞం గురించి ఏమైనా తెలిసిందా?"

నేను మఠంనుంచి ఇంటికి వస్తూంటే రాజావయ్యర్ గారు విసనకర్రతో తన వీపుని గోకుకుంటూ, ముందుకి వొంగి, నన్ను అడిగారు.

"లేదు."

"మరి, ఇక మనం ఏంచేయాలి?"

"ఇదేం పెద్ద సంగతా? యజ్ఞం ఏం పిల్లవాడా? వీడిలా చేసాడేమిటి? నన్ను ఇలాంటి పరిస్తితిలో పెట్టి ఎక్కడో వెళ్ళిపోయాడు. మనుషులకి బాధ్యతులు తెలియవద్దూ? నాకు ఈ అమ్మాయొణ్ణు ఏడవడం చూస్తే చాలా బాధగా ఉంది. ఇదంతా ఆ భగవంతుని లీల, మన కర్మ . . ."

నేను విశుతో నడుస్తూ అగ్రహారం దాటేసాను. ఊరిలో అందరూ మాట్లాడుతున్నారు - కొన్ని నా చెవికి అందాయి, కొన్ని వాళ్ళందరూ తమ తమలో చెప్పుకుంటున్నారు. ఊరు నోరు మూయడం ఎలాగ?

రాజావయ్యర్ గారితో మాట్లాడిన తరువాత నాకు కొన్ని సంఘటనలు గుర్తుకొచ్చాయి. అన్నీ యజ్ఞంకి సంభంచినవే. అనావృష్టి భూమిని దవ్వితే నీరు నెమ్మదిగా కారుతున్నట్టు మా సంబాషణలో మెల్ల మెల్లగా నాకు చాలా సంగతులు జ్ఞాపకం వచ్చాయి.

ఆ రాత్రి నేను విశుని తినిపించి, అటుకులతో మజ్జిగ తాగి రుద్రాక్షమాలతో ముందు వాకిలికి వచ్చేసాను. అమ్మాపొణ్ణు సందడి చెయ్యకుండా వంటగదిలో పనిచేస్తోంది.

** ** **

యజ్ఞం ఇప్పుడు మా కుటుంబంలో ఒక్కడై పోయాడు. మా అందరి హృదయాల్లో వాడొక శిల్పి చెక్కిన మూర్తిలాగ కనిపిస్తున్నాడు.

"వీడి పేరు యజ్ఞం . . "

"ఓ, అవునా?"

రాజావయ్యరు వాడి మొహం చూస్తున్నారు; వాడు వినయంతో అతనికి తన పూర్వీకం చెప్పాడు.

"కుంబకోణంలో ఏం చేసావ్?"

"శేషగిరి శాస్త్రిగారికి సేవ చేసాను."

"నీకేం తెలుసు?"

"అతని దయవల్ల తక్కిన పురోహితులతో పరిచయం కలిగింది. వాళ్ళతో కొన్ని కార్యాలకి వెళ్ళాను. కొన్ని ఆగమాలు తెలుసు. ఉపదేశం ఇంకా తీసుకోలేదు . . . తరువాత . . . అక్కడనుంచి వచ్చేసాను."

"ఏం, ఏమయింది? వాళ్ళతో కలిసి ఉండలేకఫోయావా?"

"కొన్ని అభిప్రాయల భేదాలు వచ్చిన తరువాత నేనే వచ్చేసాను. కొందరికి నా మీద కోపం వచ్చేసింది కూడా . . . "

రాజావయ్యరు నన్ను చూసారు. అతని చూపు 'మరి వీడిని ఏంచేద్దాం' అని అడుగుతున్నట్టుంది.

"మీరు వీడికి చేయూత ఇవ్వాలి," అన్నాను నేను. "నేను రామనాథ గురువుగారిని అడిగాను. అతను మిమ్మల్ని అడగమన్నారు. 'అతను నాకంటే పెద్దవారు, అతను ఏమంటారో చూద్దాం; నేనేం వాగ్ధానం ఇవ్వలేను ' అని అన్నారు."

మేం మాటాడుతుంటే రామానాథ గురువుగారే తన ఇంటిలోనుంచి బయటకు వచ్చారు. ఎదుటిల్లే కదా? అతను మా సంభాషణ విని ఉండాలి.

"రామనాథా, ఇలాగ కొంచెం వస్తావా?"

అతను వచ్చారు.

"ఈ అబ్బాయి గురించి ఏమంటావ్? మనకేమైనా పనికివస్తాడా?"

రాజావయ్యరు జుట్టనపేలుని యజ్ఞంపై చూపుతూ మాటాడారు.

"వీడు ఇప్పుడు కోవిల వంటగదిలో పని చేస్తున్నాడు. దీప మంత్రాలూ, అష్టోత్తరం, నామావళి అన్నీ ధారాశుద్ధిగా వల్లించగలడు. రుద్రం తెలుసని చెప్పాడు, అది వినడానికి నాకు అవకాశం కుదరలేదు. కొన్ని ఆగమాలు తెలుసట. వీడి పూర్వీకం మనకి తెలుసు: వీడి గురువుగారు - కుంబకోణం శాస్త్రులు ఉక్కూరు ప్రణహార్తి కుటుంబానికి - చెందినవారు. మీరు సరే అంటే నాకు మరేం అభ్యంతరం లేదు. . ."

యజ్ఞం తువాలుని నడుములో చుట్టుకొని మౌనంగా ఒక మూల నిలబడ్డాడు. రామనాథ గురువుగారు వాడి గురించి ఆలోచిస్తున్నారు.

రాజావయ్యరు - అతను వేద నైపుణ్యులు - నాకూ, యజ్ఞంకీ కోవిలలో జరిగే పూజలగురించి కొన్ని వివరాలు చెప్పారు. యజ్ఞంని కొన్ని మంత్రాలగురించి అడిగారు, వాడు వినయంగా వల్లించాడు. కొన్ని చోట్ల వాడికి మంత్రం రాకపోతే అతను తనే ఒక పదం లేక పదబంధం అందించగానే వాడు సరళంగా మళ్ళీ చెప్పసాగాడు.

రాజావయ్యరు మళ్ళీ మౌనం వహించారు. కొంచెం ఆలోచించి మళ్ళీ వాడిని అడిగారు:

"కంఠత ఏం తెలుసు?"

"కొన్ని సంప్రదాయాలు తెలుసు. రఘువంశం తెలుసు. మహాన్యాశం కూడ చెప్పగలను."

రాజావయ్యరు కొన్ని సంకల్పాలు వివరించి మంత్రాలు వల్లించమన్నారు: " ఈ మంత్రాలు నియమాలబట్టి ఒక బ్రహ్మచారికి, స్త్రీకి, సన్యాసికి, ఎలా చెప్తావో చూద్దాం."

యజ్ఞం వల్లించాడు. అక్కడక్క ఆగి, తను చెప్పిన ధోరణిని వాఖ్యానం చేస్తూ అవి ఎలాగ ఒక బ్రహ్మచారికి, స్త్రీకి, సన్యాసికి చెప్పాలో వివరించాడు.

రాజావయ్యరుకి పరమ సంతోషం. కాని అతని మొహంలో ఒక విధమైన సంశయం కనిపించింది. చాలా సేపు ఆలోచించి అతను నన్ను చూస్తూ అన్నారు.

"మనం చేసే విగ్రహ ఆరాధనలో రెండు పద్ధతులు ఉన్నాయి. ఒకటి ఆగమ ప్రతిష్ట, ఇంకొకటి వైదిక ప్రతిష్ట. ఆగమ ప్రతిష్టలో ఆది శైవులు మాత్రం పూజలు

చెయ్యడానికి అర్హులు: ఆధ్యాత్మికమైన పనులు చెయ్యడానికి - విగ్రహాలని తాకడం, అభిషేకాలూ, పూజలూ చెయ్యడం - వీటికి వాళ్ళకి అనుమతి ఉంది. వైదిక ప్రతిష్టలో కూడా ఇవే నియమాలు, కాని లింగం తాకడానికి వాళ్ళకి అనుమతి లేదు. కొన్ని సంప్రదాయాలు తగ్గించవచ్చు, కాని దీక్ష లేకుండా ఇవేమీ చెయ్యకూడదు."

రాజావయ్యరు విధవిధమైన ఆరాధనలు, వాటి పద్ధతులు మళ్ళీ వివరించారు. యజ్ఞం ఒక విధ్యార్థి లాగ అతను చెప్పినదంతా వింటున్నాడు.

** ** **

యజ్ఞం ఇప్పుడు కోవిలలో పని చేస్తున్నాడు. పూజారికి వసతులు కూర్చే పని ఆరంభించి ఇప్పుడు దీపారాధన వరకు వచ్చేసాడు. పూజారి ఉండేది గర్భ గృహంలో. యజ్ఞం అర్ధమండపంలో నిలబడి దీపాలు వరుస వరుసగా అతనికి అందిస్తాడు. కొన్ని రోజుల తరువాత యజ్ఞం కోరిక ఫలమైంది. తనూ గర్భగృహంలోకి వెళ్ళడానికి వాడికి అనుమతి దొరికింది. అది తన భాగ్యం అని యజ్ఞం అంటున్నాడు. అవును, అది నిజమే కదా? దైవ పూజ అందరికీ దొరుకుతుందా? మనకి జీవితంలో అన్నీ దొరకవచ్చు, లేకపోతే మనం వెదికి సాధించవచ్చు. కాని కైంకర్యం అనేది కొంతమందికే లభిస్తుంది. అందులో పెద్ద గౌరవం, హోదా, లేకపోవచ్చు - తాసిల్దారులాగ - కాని అది ఒక మహారాజుకి కూడా గిట్టదు. భగవంతుడు దైవ పూజకి ఏరుకున్న మనుషులు చూస్తే నాకు నవ్వోస్తుంది.

** ** **

రోజులు దాటి పోతున్నాయి. నాకు ఊరిలో కొత్త మనుషులు కనిపిస్తున్నారు. ఒకసారి, తటాలున, అగ్రహారంలో ఒక శవాన్ని ఊరేగించడం చూసాను.

నా చుట్టుపక్కల ఏం జరుగుతోందో నాకు అర్ధం కావడం లేదు. నా జీవితం ఎలా సమాప్తం అవుతుందో నాకు తెలియదు. ఇంకొక చావు చూస్తేనే నాకు నా చావు గుర్తుకి వస్తోంది. నేను ఇల్లువదలి ఎక్కడకీ వెళ్ళడం లేదు. ఎన్ని రోజులు పండగలనీ, ఉత్సవాలనీ, శని ఆదివారాల్లో పక్కనున్న గ్రామాలకి వెళ్ళేదాన్ని! మరి, ఇప్పుడో? అవన్నీ చాలా దూరంగా కాశీ, రామేశ్వరంలాగ కనిపిస్తున్నాయి. అంటే నేను బాగా ముసలిదాన్ని ఐపోయాను అనడానికి ఒక సూచన.

** ** **

ఎలాగో ఒకలాగ యజ్ఞంకి నచ్చచెప్పిన తరువాత వాడు వాసరాలోనుంచి ఇంటిలోపలకి వచ్చి చావడిలో నిద్రపోవడానికి ఒప్పుకున్నాడు. ఇక మనం

లాంచనాలూ, మర్యాదలూ ఒకంత తగ్గిస్తే వాడు సహజ భావంతో, దాపరికం వొదిలి మనతో మెలుగుతాడు అని నాకు అర్ధమైంది.

రోజూ ప్రొద్దున్నే లేచి, సూర్యోదయం ముందే ఇల్లూ, వాకిలీ, శుభ్రం చేస్తాడు; కొన్ని రోజులు వాడే ముగ్గులు వేస్తాడు. వాడికి అన్నీ తెలుసు; ప్రతీ ఉదయం గ్రామంలోని కాలువలో స్నానం చేస్తాడు. ఏ కారాణం వలన అక్కడ వీలు కాకపోతే తిన్నగా చెరువుకి వెళ్తాడు.

వాడి మొహంలో ఎప్పుడూ శాంతి, ప్రశాంతి. దీర్ఘమైన ముక్కు; ఒక చెవిలో ఎప్పుడూ ఒక ఎర్రని పుడక. నిష్కళంకమైన నవ్వు. వాడు నవ్వడం అరుదు. వాడికి తమాషా అంటే తెలియదు అనుకుంటా. వాడేం చెప్పదలచుకున్నా అందులో ఒక గూఢమైన అర్ధమూ, భావమూ ఉంటాయి. తక్కినవాళ్ళకి అదేం తెలియదు, కాని నాకు తెలుసు.

ఒక రోజు వాడు నాకు కోవిల దర్శనం గురించి చెప్పాడు:

"ఈ కోవిల ఉందే అది ఎంత గంభీరంగా, బ్రహ్మాండంగా కనిపించినా ఏ నాటికీ లింగంతో ఈడు కాదు. మనం కోవిలలో ప్రవేశించడానికి ముందు ద్వారం దగ్గర నిలబడి ఐదు సార్లు ప్రార్ధన చెయ్యాలి. మన సంప్రదాయంలో లింగమనేది ఐదు దిక్కులలో ఉంది. ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ దిశల తరువాత ఆకాశంలో - దానికి ఈశానం అని పేరు. మనం నిలబడి ఆకాశం చూస్తూ దాన్ని ప్రార్ధించాలి."

తరువాత యజ్ఞం ప్రదక్షణంకి అర్ధం చెప్పాడు. ప్రదక్షణంలో మనం తొమ్మిదిసార్లు తిరగాలట!

"దైవ దర్శనం ఎందుకు? మనం శివపూజకి మన మనసు అప్పగించిన తరువాత మన ప్రజ్ఞలో ఒక పునర్జన్మ అనుభవిస్తాం. మనం మనల్ని అర్ధం చేసుకోడంవలన మెల్లమెల్లగా ఈ లోక బంధాలనుంచి విముక్తి పొందుతాం. మానవుడికి ఈ జీవితంలోని లక్ష్యం - బ్రహ్మానందం. దానికి దారి దైవ దర్శనమే."

రామనాద గురువుగారికి యజ్ఞం మీద ప్రేమా, మర్యాదా, ఎక్కువయ్యాయి.

రాజావయ్యరుతో కొంతసేపు కలిసి మాట్లాడడంలో నేను చెప్పవలసిన సంగతులు మరిచిపోయాను. కోమళి సంగతి ఏమిటో మళ్ళీ చూద్దాం.

** ** **

"యజ్ఞం, సరే, ఇంకా  ఏమైందో చెప్పు, 'కోమళీ ఏడుస్తూ నిలబడింది,' అని అన్నావు. తరువాత ఏమైయింది?"

"కోమళి కాలేజీలో చదువుతోంది కాని దాని మనసు ఒక పసిపాపలాగ. ఆ కపటం లేని మనసుకి తన వ్యక్తిగతమైన జీవితంలో ఏం జరుగుతోందో, దాన్ని ఎలాగ సమర్ధించుకోవాలో  బోధపడలేదు. నేను మాట్లాడి, నచ్చజెప్పి దాని విపరీత బుద్ధిని మార్చబోయాను. కాని కోమళి తన మూర్ఖపు పట్టుదల వదలలేదు. మరి లోకజ్ఞానం లేని మనుషులని ఒప్పించడం ఎలాగ, చెప్పండి?

సాయంకాలంలో నేను హనుమాన్ ఘట్టంలో సంధి చేస్తాను. నిర్మలమైన ఆ నది ప్రవాహం చూస్తూ పవిత్రమైన ఆ పరిసరాలు అనుభవించడంలో మనం అన్నీ మరిచిపోతాం! ఆ ఏకాంతంలో వొణుకుతూ నేల మీద వాలే ఆకుల సందడి; చెట్లనుండి వేలాడే గబ్బిలాలు; అటూ ఇటూ ఉత్తికే తిరుగుతున్న జనులు; నేలమీద తువ్వాలు విప్పి గాయత్రీ మంత్రం చెప్పడానికి సిద్ధమైన మరికొందరు; ఆ ప్రశాంతాన్ని ఎప్పుడు భంగం చేద్దామా అని కాచుకున్న కోతి గుంపులు  . . .

నేను అక్కడ రెండు పూట్లా సంది చేసేవాడిని. కోమళి నన్ను ముఖాముఖిగా అక్కడ కలుసుకోవడం ఆరంభించింది. ఆమె ఎవరికీ తెలియకుండా నన్ను ఒంటరిగా అకాల వేళలో కలుసుకోడం నాకు ఏ మాత్రం ఇష్టం లేదు.నేను ఎంత చెప్పినా నా మాట వినలేదు. నాకు భయం: వాళ్ళ నాన్నగారికి తెలుస్తే? నేను అపవాదంలో చిక్కుకుంటాను, అందరూ నన్ను చూసి నవ్వరూ?? కోమళి సాహసం, పొగరుబోతుతనం చూసిన తరువాత ఆమె మనసు మారుతుందని నాకు నమ్మకం రాలేదు. కాని నాకు కోమళిమీద ఎటువంటి ద్వేషం రాలేదు. ఆమె అందగత్తె; వాళ్ళ నాన్నగారిలాగే పెద్ద ముక్కు; తల్లి లేని బిడ్డ అని శాస్త్రిగారు ఆమెను చాలా ముద్దుగా పెంచారు. అతనికి తన కూతురు భవిష్యత్తులో ఉన్న కలలూ, వాంచలూ, చాలా యువకులకి అంతులో లేనివి. కోమళి  B.A.  ముగించిన వెంటనే దాన్ని ఒక పెద్ద గవర్ణమెంటు ఆఫీసరుకి ఇచ్చి పెళ్ళి చెయ్యాలి  అని అతని ఆశ. అతను తన మిత్రులతో అనేవారు: 'మా అమ్మాయి ఒక కలెక్టరుని పెళ్ళాడబోతుంది; నేను మరి ఏ సామాన్యుల జాతకాలు తిరిగికూడా చూడను. ఎంత కట్నం కావాలన్నా సరే, ఇది ఒక కలవారి అబ్బాయి  కుటుంబంతో సంబంధం,'  అని.  మరి, కోమళి పిచ్చితనంకి నేనెలా ఒప్పుకుంటాను, చెప్పండి?

'ఈ అవస్త ఇక విపరీతంగా మారుతే ఏమవుతుందో?' అని కల్పన చెయ్యడానికి కూడా నేను భయపడ్డాను.

కాని, ఆ ప్రమాదం ఎలాగో వచ్చేసింది."

ఇక్కడ తన మనస్సులోని భావాలని దిటవు చేసుకోడానికి యజ్ఞం కొంచెం ఆగాడు. దేహంలో అలసట, మొహంలో ఒక నీరశం కనిపించినా తాను చెప్పవలసింది చెప్పితీరాలని, ఒక నిట్టూర్పు విడిచి, మళ్ళీ ఆరంభించాడు:

"ఒక మనిషికి తగిన ప్రపంచ జ్ఞానం, పరిపక్వం కలిగి తక్కినవారి ఉదాసీనత, తిరస్కారం చూసి, 'సరే, ఇది ఒక అనుభవం!' అని మానశీకంగా భావించడం జరుగుతే అది నిజంగానే జీవితం మనకి నేర్పించే పాఠం' అని నేను నమ్ముతాను."

ఇక్కడ యజ్ఞం మళ్ళీ ఆగాడు.

"మనుషులలో లోపాలు అని ఆరంభిస్తే అవి మనం వేరే వేరే కోణాలలో చూడవచ్చు. నేను కుంబకోణంలో పడిన ఇక్కట్టు గురించి చెప్పానుకదా? అదే సమయం కొన్ని నిమిషాలముందు ఈ అగ్రహారం దాటి వెళ్ళిన ఆ జమీందారుగురించి కొంచెం ఆలోచించండి. అతనులోనూ లోపాలున్నాయి. కుంబకోణం శాస్త్రిగారి సంగతీ అలాగే. అతనికి వచ్చిన పట్టరాని కోపంలో నన్ను అపార్థం చేసుకున్నారు. నేను ఏం చెప్పదలచుకున్నానో అది ఓపికగా వినాలనికూడా అతనికి తోచలేదు . . .

నేను అతన్ని తప్పుపెట్టను. అది నమ్మక ద్రోహం. అతను నా గురువు. అతన్ని విమర్శించడానికి నాకు అర్హత లేదు. అతనే నా  జీవితం సరిదిద్ది నాకు ఒక మనుగడ చూపారు. నేను ఇవాళ నలుగురు బ్రాహ్మణులతో కలిసి ధైర్యంగా మంత్రాలు వల్లించడానికి కారణం అతను మొట్టమొదట నాకు నేర్పించిన పాఠం. నేను వేదపారాయణంకి యోగ్యుడని ప్రకటన చేసినది అతనే. నేను బ్రాహ్మణులతో ఏకాదశి రుద్ర మంత్రం లేక ఎది వల్లించినా ముందు అతని శుబాకాంక్షలు కోరుతాను.

నా గురువు నన్ను అపార్థం చేసుకున్నారు!

'పెధవా! ఇది పచ్చి ద్రోహం! నీ నాలికని పాపం చుట్టుకుంది, ఇక నువ్వు వేదపారాయం చెయ్యగలవా?గురుద్రోహం చేసినవాడికి విముక్తి లేదు!' అని నన్ను శపించి అతను ఇంటిలోకి వెళ్ళిపోయారు.

తరువాత నాకు కోమళి కేకలూ, కూతలూ వినిపించాయి. ఎవరో అమెను బాతుతున్నారు అని తెలిసింది; ఇక అక్కడ నిలబడలేక నేను అక్కడనుంచి వెళ్ళిపోయాను . . .

హనుమాన్ మందిరం, దాని పక్కనే ఉన్న ఒక సత్రం - నేను తలదాచుకోడానికి నాకు చోటూ, రక్షణ ఇచ్చాయి.

నేను నలుగురు వైదికులతో కలిసి ఆచారకాండాలకి వెళ్ళేవాడిని. ఎది దొరికినా దానితో నది తీరాన్న వండుకొనేవాడిని. ఆ కోతుల దాడి తరువాత ఎది మిగిలిందో అదే నా భోజనం. ఇలాగే కొన్ని రోజులు గడిపాను.

ఒకరోజు సాయంకాల పూజ చేస్తుంటే కోమళి వచ్చేసింది. నన్ను చూసి ఏడుస్తూ నిలబడింది. నేను నెమ్మదిగా మాట్లాడాను:

“కోమళీ, నీ మనసు మార్చుకో! నిన్ను వరించడానికి నాకు అర్హత లేదు. అంతేకాక, నీ కోరికలో ఎటువంటి న్యాయమూ లేదు. నా మీద ఎటువంటి తప్పూ లేదు.  నేను ముందే చెప్పాను; ఐనాకూడా, నేను ఎందుకు భయపడ్డానో అది జరిగిపోయింది. మీ నాన్నగారికి నా మీద కోపం వచ్చేసింది, అది నాకు బాధగా ఉంది. తక్కిన పురోహితులు నన్ను చూసి ఎలా నవ్వుతున్నారో తెలుసా? కొందరు నా మొహం చూసినవెంటనే పరుగులు తీస్తున్నారు. నేను అన్నీ భరించి ఎలాగో రోజులు గడుపుతున్నాను. కాని ఒక సంగతి మరిచిపోకు. నాకు నీమీద సానుభూతి, మర్యాద ఉన్నాయి. నువ్వు ఎక్కడున్నా  సౌక్యంగా ఉండాలి. అదే నా కోరిక. నువ్వు ఇలాగ నన్ను చూడడానికి రావడం నాకు ఇష్టం లేదు.”

ఈ మాటలు చెప్తూంటే యజ్ఞం కళ్ళు తడిపట్టాయి. కొంచెం ఆగి, వాడు మళ్ళీ అన్నాడు:

“కోమళి నా మాటలు వింటూనే ఏడుస్తోంది.”

“నేను వెళ్ళను . . . మనమిద్దరం ఎక్కడైనా వెళ్ళిపోదాం!”

నాకు ఒకటే భ్రమ, నదిప్రవాహంలో ఎవరో నన్ను ఈడ్చుకుపోతున్నట్టు . . .

నేను నవ్వేసాను. 'కోమళీ, నీకేం పిచ్చా? కాలేజిలో చదివినా నీకు లోక జ్ఞానం లేదు. జీవితం అంటే అర్థం తెలియని మనిషి. జీవితం అంటే కల అనుకున్నావా? ఆ కల మాయవడానికి కళ్ళు తెరిచి చూస్తే చాలదు, మనసుకూడా విప్పి చూడాలి. కల అనేది నిద్ర లేవగానే మాయమవుతుంది, కాని నిజ జీవితంలో చేసే తప్పు అలా

కాదు. మొక్క జొన్న నాటితే చెరుకు కాస్తుందా? మరి పెళ్ళంటే చిన్న పిల్లలు ఆడే బొమ్మలాట అనుకున్నావా? ఆట అవగానే పిల్లలు బొమ్మలు తీసుకొని వాళ్ళ వాళ్ళ ఇంటికి వెళ్ళిపోతారు. నువ్వు నీ మనసు మార్చుకుంటేనే నీ జివితం మెరుగుపడుతుంది. నా బ్రతుకు ఇలాగో ఎలాగో రోజులవారీ సాగుతోంది, ఇక గాలి కొంచెం బలంగా విసురుతే అదీ కూలిపోతుంది. బిచ్చమెత్తుకొని తిరిగేవాడికికూడా జీవితంలో ఏమైనా ఆశ ఉండవచ్చు, నాకేం లేదు . . . ' నేను మరేం అనకుండా సంధి చెయ్యడానికని మెట్టులు దిగుతుంటే కోమళి నా వెనుక పరుగెత్తుకొనివచ్చి 'ఇక చచ్చిపో!' అని అంటూ నన్ను నదిలోకి తోసింది. అప్పుడుకూడా నాకు కోమళి మీద ద్వేషం రాలేదు."

** ** **

ఇక్కడ యజ్ఞం కథ మొదటి భాగం పూర్తి అయింది. వాడు కుంబకోణం శాస్త్రిగారి తిట్లు తిని, గుండె పగిలి, ఎక్కడెక్కడో తిరిగి ఆఖరికి ఈ ఒరత్తనాడుకి వచ్చి చేరాడు. ఆ తరువాత ఏం జరిగిందో నాకు తెలుసు. రాజావయ్యరు యజ్ఞంకి పంచాక్షర మంత్రం, దీక్ష అనుగ్రహించారు; వాడిప్పుడు కాశీ విశ్వనాధ కోవిలలో పని చేస్తున్నాడు.

యజ్ఞం అంటే అందరికీ ప్రియం, మర్యాద. వాడు వల్లించే మంత్రాలు చెవిలో నింపుగా నిండుతాయి. వాడు ఇప్పుడు వేదపాఠాలు ఆరంభించాడు. ఇటీవల జందెం వేసుకున్న బ్రహ్మచారులు యజ్ఞం దగ్గర సంధ్యావందనం మంత్రాలు నేర్చుకుంటున్నారు. వాడు రోజూ కోవిల అభిషేకం కోసం నుయ్యినుండి నీరు తోడి బిందెలలో నింపుతాడు. వాడు మంత్రాలు ఉచ్చరించడం విన్నవారు - అందులోని ఉద్రేపం, తీవ్రత - అనుభవించిన తరువాత తమ్మల్ని మరిసిపోయి అలాగే నిలబడిపోతారు.

** ** **

ఇప్పుడు యజ్ఞం ఇక్కడ లేకపోవడం నాకు బాధగా ఉంది. మరి ఎక్కడ వెళ్ళి ఉంటాడు? మరి తిరిగి వస్తాడా?

పిల్లవాడు విశు రోజూ నాన్నగారి గురించి అడుగుతున్నాడు, ఏడుస్తున్నాడు. అమ్మాయొణ్ణుకూడా అడుగుతోంది. యజ్ఞం కోసం తను అనుభవించే ప్రేమ, కోరికలు,

ఆనందం, బాధ, అన్నీ తన కళ్ళతోనే నాకు టూకిగా చెప్తోంది. అమ్మాపొణ్ణు నోటినుంచి మాటలు రావు. ఆమె మూగ!

అమ్మాపొణ్ణు మంచి అందకత్తె; దానికి ఎటువంటి తప్పూ, తంటాలూ, మోసం, తెలియవు.

మీకు జ్ఞాపకం ఉందా? ఈ వీధిని ఆనుకొని అగ్రహారం చివరన ఆరావుముదం అని ఒకతను ఉండేవారు. అతని ఇల్లు పక్కనే ఒక తోట. ఆ తోటలో, ఒక గుడిశెలో అమ్మాపొణ్ణు పెరిగింది. గుడిశె ఎదుట విశ్వనాధ అయ్యరుగారి గృహం. అతనికి ఇద్దరు అమ్మాయిలు - వేదవల్లి . . . ఇంకొక అమ్మాయి పేరు గుర్తుకి రావడం లేదు - అమ్మాపొణ్ణుకి స్నేహితులు.

అమ్మాపొణ్ణు నాన్నగారు పోయారు; అమ్మ మాత్రం ఉంది. ఒక అన్నయ్య ఉండేవాడు, ఎందుకూ పనికిరాని మనిషి. ఎవరో ఒక పిల్లని ప్రేమించి దానితో ఊరినుంచి లేచిపోయాడు. చాలారోజులు తరువాత వాడిగురించి ఎవరికి ఏమీ తెలియదు.

పెద్ద కళ్ళు; మొహంలో మంచి కళ. అది చిన్నపిల్లగా ఈ అగ్రహారంలో ఇక్కడా అక్కడా పరుగెత్తడం నాకు గుర్తుంది. ఇప్పుడు బాగా ఎదిగిపోయింది.

ఇందకు ముందు తల్లి, కూతురు నివాశం శైవమఠం వీధిలో; కాని అక్కడనుండి వాళ్ళని తరిమేసారు; ఇల్లూ వాకిలీ పీకేసి బయటికి పొమ్మన్నారు. అమ్మాపొణ్ణు తల్లి రాజావయ్యరు కాళ్ళలో పడి బతిమాలింది - 'ఈ మూగ పిల్లతో నేను ఎక్కడికి వెళ్ళగలను?' అని. రాజావయ్యరు తన జాగాలో ఒక గుడిశెలో వాళ్ళకి కాపురం పెట్టారు.

మూగ అమ్మాపొణ్ణు నాలుగిళ్ళలో పని చేసేది. పాపం, జీవనోపాయం కష్టమే. నాకు వీలు కానప్పుడు నా ఇంటికి వచ్చి సాయం చేసేది. యజ్ఞంని చూసినప్పుడెల్లా దాని కళ్ళ రెప్పలు పావురంలా వొణుకుతాయి. వాడిని చూస్తే దానికి ఒకటే సిగ్గు.

యజ్ఞం ఒక పూల తట్టతో దాని గుడిశె దాటివెళ్ళినప్పుడు అమ్మాపొణ్ణు వాడి చేతిలో తను అల్లిన ఒక బొగటిపూల దండ ఇస్తుంది. అది దేవుడికి అని మనం నమ్మాలి. దండ ఇచ్చినతరువాత యజ్ఞంని చూస్తూ నిల్చుంటుంది. వాడిని దగ్గరలో చూడాలని చమత్కారంగా చేసే పని ఇది. పిచ్చిపిల్ల! ఇవన్నీ నాకు తెలియదని దాని భ్రమ!

అది మూగ, కాని దానికి ఎంత తీక్షణమైన కళ్ళు! రోజూ సాయంకాల పూజవేళలో ఒక నూనె గిన్నతో దాన్ని చూడవచ్చు. బాగా ఎత్తైన ఒక కంచు దీపం పక్కన నిలబడి మరేం చేస్తుందో? దేవుడి మొహం అంటే అంత ఆకర్షణ, పరవశం అన్నమాట! దాని మనసులో ఏముందో నాకు అర్థమైంది. యజ్ఞం కూడా దాన్ని ఒకలాగ చూడడం గమనించాను. పూజ ముగించిన తరువాత యజ్ఞం తన ఇంటికి వచ్చే మార్గంలో అమ్మామొణ్ణు తన తల్లితో గుడిశెముందు కూర్చొని ఉంటుంది. యజ్ఞం ఆవిడ చేతిలో ప్రసాదం అంటూ నాలుగు అరటిపళ్ళూ, దద్దోజనం, గారెలు, అన్నీ ఇస్తాడు. ఇవన్నీ నాకు తెలియవా?

"చాలా మంచి పిల్లరా, పాపం, పేద! కులగోత్రాలు చూడనక్కరలేదు. మంచి కుటుంబం. ఏమంటావ్?"

వాడికి సిగ్గు వచ్చేసింది. రాజావయ్యరుదగ్గర చెప్పాను. అతనికి పరమ తృప్తి. "నువ్వు అమ్మామొణ్ణు కుటుంబం గురించి ఏమీ ఆలోచించవద్దు. వాళ్ళ వంశావళి నాకు బాగా తెలుసు. అమ్మామొణ్ణు తాతగారు వడువూరులో పెద్ద పండితులు; పురోహితులుగా కాలం గడిపేవారు. అతని తమ్ముడు ఒక జూదరి; వాడివల్ల కుటుంబం మెల్ల మెల్లగా క్షీణించిపోయింది. అమ్మామొణ్ణు తండ్రి దాని చిన్నవయసులోనే పోయారు. ఇక వాళ్ళని పరామరింపడానికి బంధువులేవరూ ముందుకు రాలేదు, అనాధులుగా వదిలేసారు. వాళ్ళది మంచి బ్రహచరణ కుటుంబం."

నాకు కూడా తృప్తి. రాజావయ్యరుని పక్కన పెట్టుకొని అమ్మామొణ్ణు తల్లిని పిలిచి 'నీవేమంటావు?' అని అడిగాను.

"దేవుడి దయవల్ల ఈ పెళ్ళి జరిగితే 'అమ్మామొణ్ణూ అదృష్టవంతురాలు' అని చెప్పాలి," అని అంది ఆవిడ.

'ఇక యజ్ఞంని పిలిచి వాడేమంటాడో కనుక్కోండి,' అని రాజావయ్యరుకి చెప్పాను. అతను పిలిచి అడిగినప్పుడు యజ్ఞం ఏమీ అనలేదు. వాడి మనసులో ఏముందో నాకు తెలియదా? కాని వాడు ఎంత బాగా తన మనసు విప్పి చెప్పాడో, తెలుసా?

"ఇవాళా రేపు నేను అనుభవించే అంతస్తు మీ పెద్దల దయవల్ల నాకు దొరికింది. నేను ఈమాత్రం నిలదొక్కుతూ విశాలాక్షి నీడలో కాస్త బాగున్నాను అంటే దానికి

అమ్మమ్మే కారణం.  మీరందరూ నా జీవితాని స్థిరపరచిన విశ్వకర్మలు. మరి నేను ఎందుకు మీ మాటకి అడ్డం చెప్పుతాను? అమ్మాపొణ్ణు మూగ అవనీ, నాకు అది చాలు. నాకు మరేం ఆశలు లేవు."

ఊరిలో చాలామంది ఏమేమో చెప్పుకున్నారు. "చూడవయ్యా, ఈ ముసలమ్మ ఎవడో పరాయివాడిని ఇంటిలోకి రానిచ్చి కాపురం చేస్తోంది. ఇప్పుడు వాడికి పెళ్ళంట! ఊరకే రామా, కృష్ణా, అని కూర్చోకుండా ఇవన్నీ ఎందుకు? సరే, అనువుగా ఒక మూగపిల్ల కూడ దొరికిందట!" ఇలాగే ఎన్నో గుసగుసలు! కానీ, ఎవరు ఏమన్నా నేను ఎదీ చెవిలో వేసుకోలేదు . . .

పెళ్ళిగురించి వేళాకోళంగా చెప్పే మాటలు మీరు వినిఉంటారు: 'ఊరిలో పెళ్ళి, గుడిలో బాకా, బాజా, బజంత్రీలు, ఇక వాళ్ళ వాళ్ళ ఇంటిలో భోజనం!' అని.  యజ్ఞం, అమ్మాపొణ్ణు పెళ్ళి అలాగే జరిగింది.

** ** **

విశు నా ఒడిలో పడుకునిఉన్నాడు. అమ్మాపొణ్ణు వచ్చి వాడ్ని తీసుకొని తన భుజంమీద వేసుకొని లోపలికి వెళ్ళింది. ఒక చాపలో వాన్ని పడుకోబెట్టి, తనూ పక్కనే వాలింది.

పాపం, నాకంటే దానికే దిక్కుమాలినతనం ఎక్కువ.

దాని కళ్ళు మాట్లాడే కళ్ళు! అన్ని సంగతులూ కళ్ళతోనే చెప్పడం నేర్చుకుంది!

యజ్ఞం ఊరులో ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోవడం మాయిద్దరికీ బాధగా ఉంది. కొన్నిసార్లు నా మనసు తికమకలు పడుతుంటే నన్ను మీరి ఏమేమో వెర్రి వెర్రి ఆలోచనలు పీడిస్తున్నాయి. వాడు రావడం ఎదురు చూసి రోజు, రోజు, మోసపోతున్నాను. రాజావయ్యరు, గోపాలచారి, కక్కర కర్ణం, అందరూ యజ్ఞం గురించి అడుగుతున్నారు. నేనేం చెయ్యను? జోశ్యులు కొందరిని అడిగాను: వాడు తప్పక వస్తాడు అన్నారు; ఇప్పుడు పశ్చిమ దిక్కులో ప్రయాణం చేస్తున్నాడట. ఉత్తర దిశనుంచి ఊరికి వస్తాడు అని అంటున్నారు.

వీధిలో, రథయాత్రలో, రథం రెండుసార్లు ఊరేగింది. చెరువులో నీళ్ళు వట్టిపోవడం రెండుసార్లు జరిగింది. కోవిలలో పనస చెట్టులో పళ్ళు గుత్తులు గుత్తులుగా ఎదిగి వేరులోనుండి బయటకి వచ్చేసాయి.

వాడు రాలేదు! అమ్మాపొణ్ణు తల్లికూడా పోయింది; దానికీ వాడు రాలేదు!

ఇదొక బంధం లేని బంధం! వాడికీ, నాకూ ఏం చుట్టరికమా? వాడు ఎవరో, నేను ఎవరో? నాకెందుకు వాడిమీద ఇంత మోజు? ఇదేం పూర్వజన్మ ఋణమా, ధర్మమా? ఇది భగవంతుని విధి కాబోలు! మనసు ఇలాగా అలాగా రచ్చగొట్టేటప్పుడు ధీర్ఘాయుషు శిక్షలాగ అనిపిస్తోంది.

** ** **

"అమ్మమ్మా . . . అమ్మమ్మా, . . ." అని పిల్లవాడు విశు పిలుస్తున్నాడు. నేను ఇంటిలోకి వెళ్ళాను. అమ్మాపొణ్ణు పక్కన పడుకోడానికి అల్లరి చేస్తున్నాడు. వాడికి నేనంటే చాలు. అమ్మ అక్కరలేదు; దానిదగ్గర ఎక్కువ చనువు లేదు. నన్ను చూడగానే పరుగెత్తుకొనివచ్చి నా చెయ్యి పట్టుకున్నాడు. నన్ను బాగా చుట్టుకున్నాడు.

"నీకేం వచ్చింది? వెధవా, దానిదగ్గర పడుకుంటే ఏం? ఇప్పుడే అమ్మ మొహం వేరేగా కనిపిస్తుందా? ఇక పెద్దవాడైతే దాన్ని అధికారం చలాయించాలనా?"

"అమ్మమ్మా, నేను నీ దగ్గరే పడుకుంటాను."

విశు నన్ను పట్టుకొని ఏడుస్తున్నాడు; అమ్మాపొణ్ణు వాడిని తనతో లాగ్గొని లోపలికి వెళ్ళిపోయింది.

వాడు ఏడవటం ఆపలేదు. వాడు కొన్ని రాత్రులు గభాలున నిద్రలో లేచి "నాన్నగారు కావాలి," అని ఏడుస్తాడు. నాకు వినడానికి బాధగా వుంది.

** ** **

వీధిలో జరుగుతున్నవి చూస్తూ నిల్చున్నాను.

పోస్టుమేన్ పూనమలై ఇంటిఇంటివార ఆగి పేరు పిలిచి తపాలు అందిస్తున్నాడు.

పిచ్చువయ్యర్ అబ్బాయి సింగపూర్నుంచి చాలా రోజులతరువాత తిరిగివచ్చాడు. చేతిలో ఒక ఎలకల బోను పట్టుకొని - అందులో ఎలక ఉంది - నడుస్తున్నాడు; వాడివెనకనే ఒక కుక్క పరుగెడుతోంది.

నా దృష్టి పిచ్చువయ్యర్ ఏనాడో కట్టిన గిడ్డంగి మీద పడింది. అది ఇప్పుడు ఆడపిల్లల స్కూలుగా మారింది. అక్కడ ఎప్పుడు చూసినా సందడే . . . .

వరుస వరుసగా ఎద్దుల బళ్ళు వీధిలో నడుస్తున్నాయి.

"అమ్మమ్మగారూ . . . . మీ భోజనం అయిందా?"

"ఓ, నువ్వా? . . . రా . . రా . . నేనింకా చెయ్యలేదు . . "

"ఇదిగో అవియల్ . . మీకోసం మడీతో చేసాను . . . "

కోమళి ఒక పాత్రతో ఇంటిలోకి వచ్చింది.

"ఎందుకమ్మా ఇవన్నీ?

"మరేం లేదు . . . మా ఆయనకి అవియల్ అంటే చాలా ఇష్టం . . అతను ఇవాళ పొద్దుటే కేంపుకి వెళ్ళారు."

పాత్ర అందించినతరువాత కోమళి అమ్మాపొణ్ణుని చూసి, దాని బుగ్గని ప్రేమతో నొక్కింది. "నువ్వు ఎప్పుడూ చిన్న పిల్లలాగే వున్నావ్," అంది.

"అమ్మమ్మగారూ . .నేను వస్తాను; నాకు ఇంటిలో కొంచెం పనుంది."

కోమళి వెళ్ళిపోయింది.

*" మనసుని అదుపులో నిలపలేనివాడికి ఆత్మ వివేకంగాని, ఆత్మ చింతనకాని అలవడవు. అలాంటి వారికి మనశ్శాంతి ఉండదు; మనశ్శాంతి లేనివాడికి సుఖం శూన్యం."*

నాకు యజ్ఞంని చూసినప్పుడెల్లా భగవద్గీత సాంఖ్య యోగంలోని ఈ శ్లోకం జ్ఞాపకం వస్తుంది.

యజ్ఞం తన హోదా, అర్హత, ఏనాడూ మరిచిపోలేదు. నిగ్రహం, మనోబలం, అణకువ అన్నీ వాడిలో ఇమిడివున్నాయి. సామాన్యంగా జనులు తమ తమ అంతర్బుద్ధితో ఎది కావాలో తెలుసుకొని దానితో తృప్తి పడతారు. అదే వాళ్ళ మనసుకి ప్రశాంతతని ఇస్తుంది,

యజ్ఞం కోమళిని తిరస్కరించి అమ్మాపొణ్ణుని పెళ్ళి చేసుకోడంలో నాకు వాడి తెలివితేటలు, ప్రపంచ జ్ఞానం బాగా అర్థమైంది.

కోమళిని మొట్టమొదట చూడగానే నాకు అది బోధపడింది.

కోమళి గభాలున ఒక రోజు నా గుమ్మం ముందు కనిపించింది. కోడి పుంజు చెత్త కుప్పలో ఏమైనా దొరకదా అని వెతుక్కుంటూ తటాలున ఒక గెంతు గెంతినట్టు ఆమె వెంటనే మాయమయింది.

చెత్తకుప్పలో ఎవరైనా ఒక చుట్ట, సిగరెట్టు కాల్చి పారేసుంటారు. ఆ నిప్పుతో నేలమీద ఉన్న బూడిద చెల్లాచెదురుగా ఉంటుంది. ఆ పుంజు అమాయకంగా ఆ నిప్పుని తాకినవెంటనే బాధతో అరుస్తూ మీదకి ఎగురుతుంది.

ఇప్పుడు కోమళి రావడంతో ఈ ఆలోచనలు నా బుర్రలో పరుగులు పెట్టాయి.

ఒక రోజు యజ్ఞం కనబడలేదు. నాకు ఆ సంగతి వాడు వెళ్ళిపోయి రెండు రోజులతరువాతే తెలిసింది.

రాజావయ్యరు కొన్నిసార్లు నా ఇంటికి వచ్చి అడిగారు. యజ్ఞంని తెలియనివారుకూడా కొంతమంది గభీమని వచ్చి అడిగారు:

"యజ్ఞం ఎక్కడ?"

అందరూ నన్నే అడుగుతున్నారు. మరి నేనెవరిని అడుగుతాను?

పిల్లవాడు విశు కూడా ఏమీ తోచక, రెండు మూడు రోజులుగా బొటనవేలుని నోటిలో పెట్టుకొని , ఇల్లంతా తిరుగుతున్నాడు. వాడికికూడా ఇదే ప్రశ్న అడగాలని వుంటుంది.

యజ్ఞం కనిపించకపోవడం వాడికి ప్రియమైనవారందరికీ చాలా బాధగానూ, ఆశ్చర్యంగానూ ఉంది; నాకూ అలాగే. కాని ఇప్పుడే నాకు ఒక సంగతి గుర్తుకి వచ్చింది. కొన్నిరోజులుగా యజ్ఞ్యం మనసులో ఏముందో అర్థం కాలేదు; వాడు సరిగ్గా భోజనం చెయ్యలేదు; ఎవరితోనూ సంపర్కం వద్దని జారిపోవడం గమనించాను. నేను వాడి కళ్ళు చూసాను - ఇది వాడు కనిపించకపోవడానికి రెండు రోజులముందు - చూపులో ఏదో తాపం. వాడేమో తన పాతరోజులు గురించి ఆలోచిస్తున్నాడేమో అని అనిపించింది. కాని ఆ వేధన ఇంత త్రీవంగా మారుతుందని నేను అనుకోలేదు.

నేనిలా తాపత్రయం పడుతుంటే కోమళి నా ఇంటికి వచ్చింది. ముందెప్పుడూ నేను చూడని మొహం.

అప్పుడు కోవిలలో సాయంకాల పూజ జరుగుతోంది. అమ్మాపొణ్ణు నూనె గిన్నెతో వెళ్ళింది. విశు మాత్రం నాతో ఇంటిలో ఉన్నాడు.

నేను గుమ్మంలో కూర్చుని ఉన్నాను. ఎవరో వచ్చి పక్కన నిల్చున్నట్లు అనిపించింది.

"ఇదేనా మిస్టర్ యజ్ఞంగారి ఇల్లు?"

"ఎవరమ్మా నువ్వు? రా . . . లోపలికి రా . . "

తను ఊరికి కొత్తగా వచ్చిన ఒవర్సీయరుగారి భార్య అని చెప్పింది. నేను దాని ముఖం బాగా పరిశీలించి చూసాను; ఇందకుముందు అగ్రహారంలో చూడని మొహం.

"నువ్వెందుకు యజ్ఞంని చూడాలి?"

"నేను అతన్ని తప్పక చూడాలి; అతనితో కొన్ని సంగతులు మాట్లాడాలి."

నాకు రెండు నిమిషాలలో అంతా తెలిసిపోయింది. వెంటనే అడిగేసాను.

"నువ్వు కుంబకోణం శాస్త్రులగారి అమ్మాయికదూ?"

దానికి చాలా సంతోషం, ఆశ్చర్యంకూడా. "అవును," అంది. నేను లోపలికి రమ్మన్నాను.

ఇద్దరం ఎదుటెదుట కూర్చునాం. నా మనసు భారంగా ఉంది. ఏం అడుగుదామా అని ఆలోచిస్తున్నాను.

"నువ్వు యజ్ఞంని చూడాలని వచ్చావ్; వాడు ఇప్పుడు ఇక్కడ లేడు. ఎక్కడకి వెళ్ళాడో మాకెవరికీ తెలియదు. ఇవాళకి పది రోజులయ్యాయి . వాడు ఒక బుధవారం కనిపించలేదు; ఎక్కడున్నాడో ఎవరికీ తెలియదు."

"నిజంగానా?"

"నేను చెప్పేది నిజం . . . . నువ్వు వాడిని ఎందుకు చూడాలి? నీ గురించీ, మీ నాన్నగారిగురించీ నాకు అన్నీ చెప్పాడు . . . నువ్వేమైనా చెప్పు, యజ్ఞం ఏ పాపమూ ఎరగడు. మీ నాన్నగారు వాడ్ని అవమానించడంలో ఏ న్యాయామూ లేదు. మీరిద్దరూ ఇచ్చిన దెబ్బలో వాడు అదిరిపోయాడు."

కోమళి ఏడవడం ఆరంభించింది.

నాకు ఆమె కళ్ళు తడిసిపోవడం చూసి ఎటువంటి జాలీ రాలేదు. ఇంకా చెప్పాలంటే నా కోపం ఎక్కువైంది.

"ఇప్పుడు ఏడ్చి ఏం లాభం? అది వాడి కర్మ. వాడు గుండె పగిలి, అనాధగా, ఈ ఊరుకి వచ్చాడు. వాడి మంచి స్వభావం, నిజాయితీ చూసి నేనే వాడికి జాగా ఇచ్చాను. వాడు నాకు పూస గుచ్చినట్లు అన్నీ చెప్పాడు. వాడి ఆత్మగౌరవం నాశనమవడానికి చాలామంది కారణం. కాని ఇప్పుడు వాడు మా కుటుంబంలో కలిసిపోయాడు. వాడికి విశాలాక్షి దారి చూపింది. పెళ్ళికూడా అయింది.

"దాన్ని చూసావా? అదే వాడి భార్య . . ."

కోమళి కళ్ళు మెరిసాయి. అమ్మాయిణ్ణుని చూసి "నువ్వు చాలా అదృష్టవంతురాలు.. నీకు మంచి భర్త దొరికారు. మీ ఇద్దరికీ నా శుభ కాంక్షలు," అని అంటూ ఆ తరువాత నాపక్క తిరిగి మాట్లాడింది: "అమ్మమ్మగారూ, నా గురించీ, మా నాన్నగారిగురించీ యజ్ఞం చెప్పినదంతా నిజం. అతని కష్టాలకి నేనే కారణం. నా పొరబాటువలనే ఇదంతా జరిగింది."

కొంచెం ఆగి, ఏడవడం ఆపి, మళ్ళీ మాట్లాడింది.

"నేను చాలా రోజులుగా అతన్ని కలుసుకోడానికి ప్రయత్నిస్తున్నాను. మా నాన్నగారు తను అనుకున్నట్టే నాకు పెళ్ళి చేసారు. నా తప్పు గ్రహించిన తరువాతే యజ్ఞం నాకు మంచి మార్గం చూపారు అని నేను తెలుసుకున్నాను. ఆ రోజుల్లో నేను ప్రేమ అని అనుకున్నది ఒక అర్థం లేని వ్యామోహం అని నాకు బోధపడింది. అతను అనేవారు: 'పెళ్ళి అన్నది ఒక కల కాదు - కళ్ళు తెరిచినవెంటనే మరిచిపోవడానికి. పెళ్ళి అన్నది అందరి జీవితాల్లో ఒక సమశ్య. దాన్ని తీర్చుకోడానికి మనం నెమ్మదిగా, కలవరపడకుండా, అవేశం వదలి, నడుచుకోవాలి.' ఇదే నేను నా అనుభవంలో నేర్చుకున్న పాఠం. ఇంకా చెప్పాలంటే యజ్ఞం నన్ను నా పెద్ద పొరబాటునుంచి కాపాడారు. కాని దురదృష్టవసంగా అతనే అందుకు బలి అయ్యారు."

కోమళి ఇంకా మాట్లాడడం ఆపలేదు. నేను ఏమీ అనకుండా వింటున్నాను.

"మా ఆయనికి పెద్ద చదువు, మంచి జీతం. అతనికి నేనంటే చాలా ప్రేమ. మా కాపురం బాగా సాగుతోంది. యజ్ఞం జ్ఞాపకం వచ్చినప్పుడెల్లా 'అతనిమీద నాకున్న కృతజ్ఞత ఎలా తెలియపరచడం?' అనే నా తాపం. నేను ఇప్పుడు అనుభవించే జీవితంకి అతనే కారణం. నా కళ్ళు తెరిచి ప్రపంచ జ్ఞానం అంటే ఏమిటో అని తెలుసుకోడానికి తోడు చేసిన యజ్ఞంకి కృతజ్ఞత చెప్పవద్దూ? అందుకే నేను అతన్ని వెతుకుతున్నాను. అంటే నా మనసు అతన్ని వెతుకుతోంది అన్న మాట. మా ఆయన ఉద్యోగం కోసం మేం ఏ ఊరు వెళ్ళినా అక్కడ యజ్ఞంని చూడవచ్చు అని నా ఆశ. మా ఆయనికి పూజలూ, పండుగలంటే చాలా ఇష్టం. మేం ఎక్కడ కాపురం చేసినా పండుగరోజుల్లో శాస్త్రులు మా ఇంటికి వస్తారు. పూజకి వచ్చిన పురోహితులందరినీ నేను యజ్ఞం గురించి అడిగేదాన్ని. కాని ఎవరికీ అతను ఎక్కడున్నారో తెలిసిందికాదు. నేను మొట్టమొదటిగా అతన్ని ఈ ఊరు కోవిలలో చూసాను . . .

"నా సంతోషమూ, భక్తి ఎక్కువయ్యాయి. అతన్ని కలుసుకొని, నా మనసు విప్పి రెండు మాటలు చెప్పాలి. కాని మీరు అతను పదిరోజులుగా ఊర్లో లేరని అంటున్నారే . . ."

కళ్ళు తుడుచుకుంటూ కోమళి లేచింది.

అమ్మాపొణ్ణు ఆమెను ధీర్ఘంగా చూస్తోంది.

"పది రోజులముందు, ఒక శుక్రవారం, నేను కోవిలకి వెళ్ళాను. చాలామంది అమ్మవారి దర్శనంకోసం కాచుకొని ఉన్నారు.

"తటాలున నా చెవిలో కొన్ని మంత్రాలు వినబడ్డాయి. అవి ఎవరో మనకి తెలిసినవాళ్ళు వల్లించినట్లుందే అనిపించింది. కాని అర్ధమండపంలో ఉన్నవారెవరూ కనిపించలేదు; వెలుతురు తక్కువ. పైగా ఎక్కడ చూసినా పొగ . . .

దీపారాధన తరువాత ఒక పళ్ళెంలో కర్పూర దీపంతో ఆయన బయటకి వచ్చారు. అప్పుడుకూడా నేను అతన్ని పోల్చుకోలేదు . . .

"నా చేతులు కర్పూర వెలుగుని తాకినతరువాత కళ్ళని ఒత్తుకున్నాయి. నేను నా పేరుతో అర్చన చెయ్యమని నా పళ్ళెం అందించాను. అప్పుడే అతని మొహం బాగా చూసాను. అతని చెయి వొణుకుతోంది; నాది కూడా అలాగే. అతను అందరికీ కర్పూరదీపం అందించి అర్ధమండపంకి తిరిగి వెళ్ళిపోయారు.

"నేను స్త్రీలగుంపునుంచి విడిపించుకొని బయటకి వచ్చి తొందర తొందరగా అడుగులు వేస్తూ అర్ధమండంకి వచ్చేసాను. అప్పుడే యజ్ఞం గర్భగృహంలో ఉన్న శాస్త్రిని కలుసుకొని తన గంభీర ధ్వనితో మంత్రాలు వల్లించడం ఆరంభించారు. అతనికి దేహమంతా చెమటపట్టేసింది.

"కొంత సమయం తరువాత అతను బయటకి వచ్చి నాకు నా ఆరతి పళ్ళెం అందించారు. నేను దాన్ని తీసుకొని ఒక చిరునవ్వుతో అతన్ని అడిగాను:

'ఎలాగున్నారు మీరు? ఇక్కడే ఉంటున్నారా?'

"నేను అతన్ని సహజభావంతో పరిచయం చేసుకున్నట్టు అడిగాను. కాని అతను మొహం తిప్పేసుకొని, దూరంలోని దేవతను చూస్తూ, 'ఆ దేవి దయవల్ల ఎలాగో రోజులు గడుపుతున్నాను,' అని చెప్పి జరిగారు. తరువాత మిగిలినవారిదగ్గర అర్చన టోకెన్లు తీసుకొని గర్భగృహంలోకి వెళ్ళారు.

"నేను భక్తులగుంపునుంచి బయటకి వచ్చేసాను. ఎలాగైనా అతన్ని కలుసుకొని కొంచెం సేపు మాట్లాడలని నా ఆశ. కాని అతను దానికి తోడివ్వలేదు. ఆ తరువాత అతను ఒంటరిగా కోవిల ప్రాకారంలో నడుస్తూంటే నేను, 'కొంచెం ఆగండి,' అని అంటూ అతని దగ్గరకి చేరాను. కాని అతను అడుగులు త్వరగా వేసుకుంటూ నన్ను వదలి

తిరిగి గర్భగృహంకి వెళ్ళిపోయారు. సరే, 'నేను ఇలా కోవిలలో కలుసుకోవడం అతనికి ఇష్టం లేదు' అని ఆ తరువాతే అతని ఎడ్రసు అడిగి తెలుసుకున్నాను . . .

"అమ్మమ్మగారూ, నాకు B.A. డిగ్రీ ఉంది. యజ్ఞం చదివిందేమో నాలుగో క్లాసు. కాని అతనే నాకు చదువుకున్న మనిషికి ఉండవలసిన జ్ఞానం లేదని గ్రహించడానికి సహాయం చేసారు. ఆఖరికి అతనికి మిగిలింది అవమానం, తలవంపు. అప్పుడుకూడా అతను నాకోసం త్యాగం చేసారు. మా నాన్నగారు అతన్ని నిరాదించారు. నేను చేసిన తప్పులకి నన్ను క్షమించమని అడగడానికి నేను ఇక్కడకి వచ్చాను."

కోమళి అమ్మాపొణ్ణుని చూస్తోంది.

"దాని పేరు అమ్మాపొణ్ణు. దానికి మాటలు రావు."

"ఏం, ఎందుకు?"

"అది మూగ."

కోమళి అమ్మాపొణ్ణుని కౌగిలించుకొంది.

"మీ ఆయన చాలా గొప్పవారు . . . .నువ్వు అదృష్టవంతురాలువి."

"అమ్మమ్మగారూ, ఇప్పుడు మా నివాసం శైవ మఠ వీధిలో తాసిల్దారు పక్క ఇల్లు. సరే, మళ్ళీ వస్తాను . . ."

కోమళి వెళ్ళిపోయింది,

** ** **

ఇప్పుడు కోమళి వచ్చివెళ్ళిన తరువాత ఆమె మొట్టమొదటిసారి యజ్ఞంని వెతుక్కుంటూ నా ఇంటికి వచ్చినది నాకు జ్ఞాపకానికి వస్తోంది.

కోమళి ఒరత్తనాడుకి కాపురం వచ్చి చాలా రోజులయ్యాయి. వారంకి ఒకసారి తప్పకుండా నన్ను చూడడానికి వస్తుంది.

అస్తమానం ఉత్తికే అమ్మాపొణ్ణు మొహం చూస్తూ నిల్చుంటుంది; విశుని పక్కన లాక్కొని ముద్దులాడుతుంది. పెళ్ళై చాలా రోజులైనా దానికి పిల్లలు పుట్టలేదు.

** ** **

రోజులు సాగిపోతున్నాయి. నేను మంచి మార్పులు ఎదురుచూసాను కాని అవేమీ రాలేదు. ఇంకా చెప్పాలంటే కంటికి కనిపించేది వేరే వేరే దిక్కుల్లో

దేశదిమ్మరిలాగ తిరుగుతున్నట్లు కనిపిస్తున్నాయి. నా మనసు ఎందులోనూ నిలకడ లేకుండా తాపత్రయం పడుతూంటే కోమళి వచ్చి ఆదరాబాదరగా ఇదీ, అదీ మాట్లాడుతూ వుంటుంది. దాన్ని చూస్తే నాకు జాలిగా ఉంటుంది.

ఇప్పుడంతా కోమళి వేదాంతం, దానిలోని గూఢ అర్థాలు మాట్లాడుతోంది. 'పాత' యజ్ఞం గురించి చెప్తున్నప్పుడు తమాషాగా వాడి గుణాలు - నిజాయితీ, అమాయకత్వం - వర్ణిస్తుంది. అదే సమయం యజ్ఞం మనసుని బాధ పెట్టినందుకు తన్ను నొచ్చుకుంటుంది. అతి త్వరలో నాకు మా సహవాసం నచ్చింది. కాని దేవుడి ఆజ్ఞ ప్రకారం లో మేం వారా వారం జరిపే సంబాషణలు ఒక ముగింపుకి వచ్చేసాయి.

ఒక రోజు ఉదయం ఎనిమిది గంటలకే కోమళి ఇంటికి వచ్చేసింది. దాన్ని కళ్ళు చూడగానే ఆమె ఏడ్చి ఉండాలని నాకు తెలిసిపోయింది. విశుని లాగ్గొని బిగువుగా కౌగిలించుకుంది. అమ్మాయొణ్ణి ముఖాన్ని తన రెండు చేతులమధ్య అదుముకొని ముద్దు మాటలు వర్షించింది.

"అమ్మమ్మగారూ, నేను ఈ ఊరి విడిచి వెళ్ళిపోతున్నాను. మా ఆయన్ని తిరుచ్చీకి పక్కన ఒక ఊరికి బదిలీ చేసారు. అతను ఇంకా ఒక వారం టైముంది అని చెప్పారు కాని ఇవాళే మేం వెళ్ళాలి. మీ దగ్గర శెలవు తీసుకోడానికి వచ్చాను."

నా కాళ్ళకింద పడి నమస్కరించింది.

"మంచిది, వెళ్ళి రావమ్మా. నువ్వు సౌభాగ్యలక్ష్మిగా జీవించాలని నా ప్రార్థన."

"నేను ఈ ఊరిలో తప్పకుండా అతన్ని (కోమళి యజ్ఞం గురించి చెప్తోంది) కలుసుకుంటాను అని నమ్మాను, కాని అది జరగలేదు. ఇక్కడ చూసినాకూడా నా మనసులో ఏముందో నేను చెప్పడానికి ముందే అతను జారిపోయారు. మరి ఈ జీవితంలో నాకు అతని క్షమాపణ దొరకదేమో? కాని నేను ఊరుకోను. నేను మా ఆయనతో ఏ ఊరుకి వెళ్ళినా తప్పకుండా ఇక్కడికి తిరిగివచ్చి - ఒక్కసారి కాదు, ఎన్నిసార్లైనా సరే - యజ్ఞంని కలుసుకుంటాను. నాకు అతని క్షమాపణ తప్పకుండా కావాలి. ఇది నాకు చాలా ముఖ్యం. నేను వెళ్ళిన తరువాత అతను తప్పకుండా వస్తారు అని నా నమ్మకం. అతను వస్తే నేను అతన్ని కలుసుకోడంలో ఎటువంటి దురుద్దేశం లేదని చెప్పండి. నేను మళ్ళీ అతన్ని చూడడానికి రావడం అతను తప్పార్థం చేసుకున్నారా అనిపిస్తోంది."

కోమళి ఏడుస్తూనే వెళ్ళింది. నాకు ఆమె వేదన బోధపడింది.

నేను యజ్ఞంగురించి ఆలోచిస్తున్నాను. నాకూ వాడిని చూడాలనివుంది. కొన్నిసార్లు వాడు రాడేమో అని బెదిరిపోతున్నాను. వాడు అమ్మాపొణ్ణుని, విశుని నా బాధ్యతలో వదిలి పారిపోతే? కోమళి వచ్చినతరువాత యజ్ఞం ఎందుకు గభీమని మాయమయ్యాడు అని నాకు బోధపడింది. కాని ఇప్పుడో? కోమళి వెళ్ళి చాలారోజులయ్యాయి, మరి యజ్ఞం కనిపించడేం? ఎందుకు?

మరి వాడు తిరిగి రాడా? వాడు వచ్చేటట్లు ఏమైనా సూచనలు కనిపిస్తున్నాయా?

అమ్మాపొణ్ణు పడకమీద దొర్లుతూ వుంది. విశు ఏదో తనలోనే గొణుకుతున్నాడు.

"అమ్మమ్మగారూ. . ."

"ఎవరది?"

"నేనే . . ."

"యజ్ఞంలాగ ఉందే?"

"అవును, యజ్ఞం . . . మిమ్మల్ని చూడడానికి వచ్చాను . . ."

విశు లేచి, నాన్నగారి గొంతు విని పరుగెత్తుకొని వచ్చాడు. ఆశ్చర్యం తాళలేక అమ్మాపొణ్ణు లేచి గబ గబ మని ముందుకొచ్చింది.

యజ్ఞం మోహంలో ఒక ప్రకాశం. వాడి ముక్కూ, బుగ్గలూ ఎర్రబడి వున్నాయి. జుత్తు మెడదాక వచ్చేసింది

"యజ్ఞం, ఏంరా ఇలాగ చేసావ్? ఇదేం బాగుందా, నువ్వే చెప్పు," అని నేను కొంచెం దీనమైన కంఠంతో అడిగాను. "నువ్వు ఇలాగ లటుక్కున వెళ్ళిపోయి మాఅందరినీ అదరుకొట్టేసావ్. నీకన్నీ తెలుసు, నేనేం చెప్పనక్కరలేదు. కాని ఇది నాకు ఒక పెద్ద దెబ్బే . . . "

యజ్ఞం భుజంమీద ఉన్న తువాలు తీసి నేలమీద పరిచి కూర్చున్నాడు. విశుని తన ఒడిలో పెట్టుకొని మాట్లాడాడు:

"అమ్మగారూ, నన్ను క్షమించండి. నేనేం ఎక్కడికీ పారిపోలేదు. ఇక్కడ కోమళిని చూసినతరువాత నాకు భయం వచ్చేసింది."

"అవును, ఇప్పుడు అది నాకుకూడా పరిచయమైపోయింది; కాని అది ఇప్పుడు ఈ ఊరులో లేదు. ఆమె భర్తకి ఉద్యోగం బదిలీ అవడంతో వెళ్ళిపోయింది. వెళ్తున్నప్పుడు నిన్ను చూడలేదని బాధపడింది. తను నిన్ను నిష్కపటమైన బుద్ధితో చూడడానికి వచ్చానని నీకు చెప్పమంది."

"దాని ఉద్దేశం ఏమైనాసరే నాకు మళ్ళీ కోమళిని చూడడానికి ఇష్టం లేదు. ఆమెపై నాకు ఎటువంటి ద్వేషభావమూ లేదు. నేను ఇప్పుడు ఇక్కడ, నా జీవితాన్ని నా హోదాకి తగ్గినట్టుగా సర్దుకొని సంతోషంగా ఉన్నాను. కోమళి నన్ను ఎందుకు వచ్చి చూడాలి? అంతేకాదు. ఇప్పుడు దానికి పెళ్ళైంది. ఆమె భర్త ఒక సీనియర్ గవర్ణమెంటు ఆఫీసరు కూడా! ఇంకా చెప్పాలంటే నేను కోమళి దగ్గర ఏమీ ఎదురుచూడలేదు. ఆమె నా క్షమాపణకోసం వస్తే అది నేను ఎన్నడూ ఆశించలేదు. నేను ఏనాడో ఆమె ఎక్కడ ఉన్నా ఆమె కలలు ఫలించి తగిన భర్తని, జీవితాన్ని పొందాలని ఆమెకి నా శుభాకంక్షలు చెప్పేసాను. అది హాయిగా, సంతోషంగా ఉండనీ. నన్నెందుకు వచ్చి చూడాలి? ఆమె నన్ను కలుసుకోడానికి రెండుమూడుసార్లు ప్రయత్నం చేసింది, కాని నేను దానికి అవకాశం ఇవ్వదలచుకోలేదు. ఇక ఏ అపవాదమూ రాకూడదని నేను ఊరు విడిచి వెళ్ళిపోయాను. కోమళి ఈ ఊరులో ఉన్నంతవరకూ నేను తిరిగిరాకూడదని నిశ్చయించుకున్నాను. అందుకే నేను వెళ్ళినది ఎవరికీ తెలీదు."

"నువ్వు ఏం చెప్పినాసరే. ఈ పరీక్ష నాకు ఎక్కువే! భరించలేకున్నాను!"

"అమ్మమ్మగారు, నన్ను క్షమించండి. నాకు తెలుసు మీరు బాధపడతారు అని. కాని నాకు ఇంకొక పని ఉంది. కుంబకోణం శాస్త్రులు నా మొదటి గురువు; నేనతనికి ద్రోహం చేసానని నిందించారు. అతని తీర్పు మార్చవద్దా? అతని శుబాకాంక్షలు లేకుండా నా విధ్యకి ఏం లాభం? అందుకే అతని మనసు మార్చడం ముఖ్యం అని అతన్ని కలుసుకొని అతని కాళ్ళలోపడి అన్ని సంగతులూ చెప్పేసాను. అతను మనసు మారింది. అతనే కోమళి ఓరత్తనాడు వదిలి తిరుచ్చికి వెళ్ళిపోయిందని చెప్పారు,

"నేను వెంటనే తిరుగు ప్రయాణం మొదలుపెట్టాను. మధ్య షీర్గాళిలో తోసై అప్పర్కి సేవ చెయ్యడానికి అవకాశం దొరికింది. కాని నా మనసు ఎప్పుడూ మీ మీదనే . . ."

నేను చూస్తునే నిల్చున్నాను. అమ్మాపొణ్ణు, విశు వాడిని అకస్మాత్తుగా చూడడం వలన ఇంకా దిగ్భ్రాంతిలోనే ఉన్నారు.

నాకు భగవద్గీతలో ఒక శ్లోకం జ్ఞాపకం వచ్చింది:

*"మనసుని వశపరచుకొని ఆత్మ మీద నిశ్చలంగా నిలిపి, సర్వ వాంఛలూ విసర్గించినవాడే యోగి అవుతాడు."*


అవును, పామరులలో యజ్ఞం ఒక యోగి!

**********

....

# జయకాంతన్

(1934-2015)



# మహరిషి

(1932-2019)

